

అనంత
# జనశక్తి
జనం కోసమే మా అక్షరం

19.08.2026
బుధవారం | అనంతపురం
సంపుటి : 11 | సంచిక: 98
పేజీలు : 08 | వెల: రూ.5

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## కూటమితో కలిసి స్థానిక సంస్థల ఎన్నికలకు

- బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్
- ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకెళ్లాలి
- నేతలు, కార్యకర్తలతో భేటీ



**అమరావతి, ఆగస్ట్ 18, అనంతజనశక్తి న్యూస్**

కూటమితో కలసి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తున్నామని బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మంత్రి సత్యకుమార్ నేతృత్వంలో ఓ కమిటీని ఏర్పాటు చేసుకున్నామని వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో మంగళవారం బీజేపీ నేతలు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడారు. దేశంలో గొప్ప ప్రభుత్వం నడుస్తోందని పేర్కొన్నారు.

2లో..

## మీ కోసం జనతాగ్యారేజ్

- తలుపులు తెరిచే ఉంటాయ్ : హరీష్‌రావు
- 22ఏ నిషేధిత జాబితా నుంచి విడిపించే వరకు
- బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా
- నిషేధిత జాబితాలో ఉంటే ఫోన్ చేయాలి
- టోల్ ఫ్రీ నంబర్ ఇచ్చిన మంత్రి హరీశ్ రావు

మూసిపరివాహక ప్రాంతంలోని ఇండ్లను హైడ్రా కూలగొట్టే ప్రయత్నం చేసినప్పుడు జనతా గ్యారేజ్ తలుపు తట్టారని, అప్పుడు వాళ్లకు న్యాయం చేశామని అన్నారు. అదేవిధంగా నిషేధిత జాబితాలో ఉన్న ఇళ్ల విషయంలో కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. సబ్బండ వర్గాలకు రాజకీయ, సామాజిక సమానత్వం కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన కృషి చరిత్రలో నిలిచి పోతుందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు.




**హైదరాబాద్, ఆగస్ట్ 18, అనంతజనశక్తి న్యూస్**

మీ భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి విడిపించే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నేత హరీశ్‌రావు ప్రజలకు హామీ ఇచ్చారు. న్యాయబద్ధంగా, కష్టార్జితంతో సంపాదించిన భూములు నిషేధిత జాబితాలో ఉంటే ఫోన్ చేయాలంటూ ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్ ఇచ్చిందని, అయితే ఆ టోల్ ఫ్రీ నెంబర్ పనిచేయడం లేదని హరీశ్‌రావు చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన టోల్ ఫ్రీ నంబర్ పని చేయకపోయినా మా జనతా గ్యారేజ్ (తెలంగాణ భవన్) తలుపులు మీకోసం ఎప్పుడూ తెరిచే ఉంటాయని హరీశ్‌రావు అన్నారు.

2లో..

# స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్లు

- క్యాబినెట్ కీలక నిర్ణయాలు
- చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ భేటీ
- రూరల్ ప్రాంతాల్లో బీసీలకు 34శాతం
- అర్బన్‌లో 33.1 శాతం రిజర్వేషన్లు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు
- 13 జడ్పీలను జిల్లాల పునర్విభజన
- 28 జిల్లా పరిషత్‌లుగా ఏర్పాటు
- 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్‌కు గ్రీన్‌సిగ్నల్
- కర్నూలులో అగస్త్య గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు
- ప్రత్యక్ష పద్ధతిలో మేయర్ల ఎన్నిక





**అమరావతి, ఆగస్ట్ 18, అనంత జనశక్తి న్యూస్**

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన ఏపీ మంత్రివర్గం 55కి పైగా అజెండా అంశాలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. స్థానిక సంస్థల్లో రూరల్ ప్రాంతాల్లో బీసీలకు 34శాతం, అర్బన్‌లో 33.1 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు, మేయర్ల ఎన్నికలకు ప్రత్యక్ష పద్ధతిలో వెళ్లాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న 13 జడ్పీలను జిల్లాల పునర్విభజనకు అనుగుణంగా 28 జిల్లా పరిషత్‌లుగా ఏర్పాటు. 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్‌కు గ్రీన్‌సిగ్నల్. కర్నూలులో అగస్త్య గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. విశాఖలో అక్షత్ గ్రీన్‌టెక్ సోలార్ సెల్, మాడ్యూల్ ప్లాంట్, డేటా సెంటర్ల ప్రతిపాదనలకు ఆమోదం. తిరుపతి, సూర్యలంక, కేశరపల్లి, కాకినాడలో స్టార్ హోటళ్ల ఏర్పాటుకు ఆమోదం. బీసీ విద్యార్థులకు ఐఐటీ, జేఈఈ, నీట్ కోచింగ్, ప్రైవేట్ యూనివర్సిటీలకు సంబంధించిన కీలక ప్రతిపాదనలకు క్యాబినెట్ ఆమోదముద్ర.

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో పలు కీలకమైన మరియు ప్రాధాన్యత కలిగిన నిర్ణయాలకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. మొత్తం 57 అజెండా అంశాలపై సుదీర్ఘంగా చర్చించిన మంత్రివర్గం.... వాటికి ఆమోదం తెలుపుతూ పచ్చజెండా ఊపింది. ఈ భేటీలో ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీ రిజర్వేషన్ల అంశంపై ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంది.

**బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు....**

రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలకు (బీసీలకు) తగిన ప్రాతినిధ్యం కల్పించే దిశగా కేబినెట్ నిర్ణయం తీసుకుంది. బీసీ రిజర్వేషన్లను పునరుద్ధరిస్తూ.... వాటిని చట్టబద్ధంగా అమలు చేసేందుకు చర్యలు వేగవంతం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని (రూరల్) స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అదేవిధంగా, పట్టణ ప్రాంతాల్లో (అర్బన్) 33.13 శాతం రిజర్వేషన్లు కల్పించాలని స్పష్టమైన నిర్ణయం తీసుకుంది. బీసీ సామాజిక వర్గాలకు రాజకీయంగా సరైన గుర్తింపు, అధికారంలో భాగస్వామ్యం కల్పించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

2లో..

## చంపత్ రాయ్‌కు సిట్ క్లీన్‌చిట్..!

- అయోధ్య రామ మందిరం విరాళాల కేసు
- ట్రస్ట్ మాజీ సభ్యుడు అనిల్ మిశ్రాకు కూడా
- చోరీ కేసుతో సంబంధం లేదని సిట్ నివేదిక

6లో..



## అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తున్నారు

- కాంగ్రెస్ పార్టీ తీరు బాధాకరం
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్
- రాహుల్ గాంధీ బాధ్యతారహిత్యం



**అమరావతి, ఆగస్ట్ 18, అనంతజనశక్తి న్యూస్**

కార్యకర్త నుంచి జాతీయ నాయకుడిగా ఎదిగిన భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు పోరాటాల స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని బీజేపీ శ్రేణులకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ స్పష్టం చేశారు. మంగళవారం విశాఖపట్నంలో పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ చీఫ్ నితిన్ నబిన్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే బీజేపీ అతి పెద్ద పార్టీగా ఉందని అన్నారు. దేశాన్ని మరింత శక్తిమంతంగా చేయడానికి సంకల్పం తీసుకోవాలని ప్రతి కార్యకర్తకు సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశంలో మంచి పాలన అందుతుందని పేర్కొన్నారు.

2లో..

## 2014 నుంచి రాజ్యాంగ సంస్థలు నిర్వీర్యం

- బీజేపీ, ఎన్నికల సంఘం ఒక్కటే
- పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ కామెంట్
- కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం



2లో..

**హైదరాబాద్, ఆగస్ట్ 18, అనంతజనశక్తి న్యూస్**

2014లో కొలువుదీరిన నాటి నుంచి రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ కూడా బీజేపీకి అనుబంధ సంస్థగా మారిందని విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. తాము ప్రతి ఓటు హక్కు కాపాడాలని చూస్తున్నామని అన్నారు. ఎన్నికల సంఘం గైడ్‌లైన్స్‌తో చాలా నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

## ఆలయ ఉద్యోగాల్లో జోనల్ విధానం లేదు

- మెరిట్‌కే ప్రాధాన్యం
- మంత్రి ఆనం రామనారాయణ

2లో..



**అమరావతి, ఆగస్ట్ 18, అనంతజనశక్తి న్యూస్**

దేవాలయాల్లో అర్చకులు, వేద పండితులు, పరిచారకులు, ఇతర ధార్మిక సిబ్బంది నియామకాల్లో జోనల్ విధానం అమల్లో లేదని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. దేవాలయాల్లో ఉద్యోగాలకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు.

## అమిత్ షా చిన్నపిల్లాడు
### మల్లికార్జున ఖర్గే

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 18, అనంతజనశక్తి న్యూస్**

6లో..

కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తాను తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన సమయంలో అమిత్ షా చిన్నపిల్లాడిగా ఉన్నారని వ్యాఖ్యానించారు. 'నేను తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పుడు అమిత్ షా చిన్నపిల్లాడు. ఇప్పుడు ఆయన మాకు దేశభక్తి గురించి బోధిస్తున్నారు' అంటూ ఖర్గే విమర్శించారు.

## ఆ భూములను లాక్కుంటే.. చూస్తూ ఊరుకోం



**హైదరాబాద్, ఆగస్ట్ 18, అనంతజనశక్తి న్యూస్**

తాము అధికారంలోకి వస్తే 'భూలక్ష్మి' పేరుతో పేదలకు భూమి పంపిణీ చేస్తామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. పేదల భూములను రేవంత్‌రెడ్డి సర్కార్ లాక్కుంటే.. చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ టీఆర్ఎస్ కార్యాలయంలో కవిత మీడియాతో మాట్లాడారు. బీసీలకు పెద్దపీట వేస్తామని చెప్పినా.. ఆచరణలో మాత్రం సామాజిక న్యాయం ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు.

2లో..

- రేవంత్ సర్కార్‌కు కవిత హెచ్చరికలు
- మేము అధికారంలోకి వస్తే భూలక్ష్మి
- పేదలకు భూములు పంపిణీ చేస్తాం
- పేదల భూములు రేవంత్

## 2027 జూన్ నుంచి జగన్‌కు సమస్యలు

- లోకేష్‌కు ప్రమోషన్ వచ్చే అవకాశం
- పవన్ కళ్యాణ్ జాతకం తిరుగులేదు
- వచ్చే ఎన్నికల్లో వార్ వన్ సైడ్

2027 జూన్ తర్వాత రాజకీయాల్లో మార్పులు

2లో..

## వచ్చే ఏడాది విజయ్ ప్రభుత్వం కూలిపోతుంది

- గడ్కరీ, అమిత్ షాలకు మూడోసారి ఏలినాటి శని
- వేణుస్వామి సంచలన జోస్యం
- మోదీ జాతకంలోనూ కొన్ని సమస్యలు



2లో..

# స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు



(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో చాలా రోజులుగా వాయిదా పడుతూ వస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఉన్న అనిశ్చితికి కేబినెట్ తెరదించింది. రాబోయే అక్టోబర్ నెలలోనే స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తిస్థాయిలో నిర్వహించాలని ఏపీ కేబినెట్ నిర్ణయించింది. ఈ మేరకు ఎన్నికల యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని మరియు రిజర్వేషన్ల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది.

**ప్రత్యక్ష పద్ధతిలో మేయర్లు, చైర్మన్ల ఎన్నిక...**

పాలనా సంస్కరణల్లో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో ప్రభుత్వం కీలక మార్పులు తీసుకొచ్చింది. ఇకపై మున్సిపాలిటీల చైర్మన్లు, కార్పొరేషన్ల మేయర్ల పదవులకు ప్రత్యక్ష పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ తీర్మానించింది. అంటే.... ప్రజలే నేరుగా ఓటు వేసి తమ మున్సిపల్ చైర్మన్లను, కార్పొరేషన్ మేయర్లను ఎన్నుకుంటారు. ఈ నిర్ణయం ద్వారా స్థానిక సంస్థల్లో పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అంతేకాకుండా, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల సంఖ్య, పాలనా వ్యవస్థపై స్పష్టతనిస్తూ ఇకపై ప్రతి మున్సిపాలిటీ లేదా కార్పొరేషన్‌లో ఒక్కరే డిప్యూటీ మేయర్ లేదా వైస్ చైర్మన్ ఉండేలా కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ నూతన విధానాలు రాబోయే అక్టోబర్ ఎన్నికల నుంచే అమలులోకి రానున్నాయి. మరోవైపు కర్నూలులో అగస్త్య గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఇక విశాఖలో అక్షత్ గ్రీన్‌టెక్ సోలార్ సెల్, మాడ్యూల్ ప్లాంట్, డేటా సెంటర్ల ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తిరుపతి, సూర్యలంక, కేశరపల్లి, కాకినాడలో స్టార్ హోటళ్ల ఏర్పాటుకు లైన్ క్లియర్ అయింది.

# కూటమితో కలిసి స్థానిక సంస్థల ఎన్నికలకు

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని మోదీ నేతృత్వంలో ప్రతి గ్రామానికి వికాసం.. ప్రధాని మోదీ నేతృత్వంలో ప్రతి గ్రామానికి వికాసం వచ్చిందని మాధవ్ తెలిపారు. ప్రతి ఊరులో బీజేపీ జెండా ఎగరాలని సూచించారు. ప్రతి గ్రామంలో వార్డు సభ్యుడు ఉండాలని సూచించారు. చైర్మన్‌లు, అన్ని పదవుల్లో మనం ఉండాలని తెలిపారు. పదవుల్లో ఉన్నవారంతా మళ్లీ ఓ సమావేశం ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. మన్ కి బాత్‌ను ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వేజోన్ ఏర్పాటు చేశారని ప్రస్తావించారు. విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకున్నామని తెలిపారు.

**విశాఖ ఉక్కు పరిశ్రమ లాభాల బాటలో నడుస్తోంది..**

విశాఖ ఉక్కు పరిశ్రమ లాభాల బాటలో నడుస్తోందని మాధవ్ అన్నారు. ఈ నెల చివరకు పోలవరం నీరు విశాఖకు వస్తుందని చెప్పారు. ఈరోజు కార్యవర్గ సమావేశంలో రెండు తీర్మానాలను ప్రవేశ పెడతామని వెల్లడించారు. పార్టీ పిలుపునిచ్చే ప్రతి కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆదేశించారు. వాడవాడల్లోకి బీజేపీ పార్టీ వెళ్లాలని సూచించారు. సూర్యుడు ఉదయించాలి... కమలం వికసించాలని పిలుపునిచ్చారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూ బీజేపీని బలోపేతం చేయాలని నిర్దేశించారు. సేవా సంకల్పం పేరుతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలునిర్వహిస్తామని మాధవ్ పేర్కొన్నారు.

# మీ కోసం జనతాగ్యారేజ్

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ బహుజనుల ఆత్మగౌరవానికి, ధీరత్వానికి ప్రతీకగా నిలిచిన పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. పాపన్న గౌడ్ స్ఫూర్తి భవిష్యత్ తరాలకు అందించేలా ఏటా వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని నాడు సీఎంగా కేసీఆర్ నిర్ణయించారన్నారు.

వేలాది మంది దళిత, బహుజన బిడ్డలను నాయకులుగా తీర్చిదిద్దడం ద్వారా సబ్బండ వర్గాలకు రాజకీయ అధికారంలో భాగస్వామ్యం కల్పించి స్వరాష్ట్రంలో పాపన్నగౌడ్ ఆశయాలను అమలు చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రమేనని స్పష్టం చేశారు. వరంగల్ జిల్లాలో సామాన్య కుటుంబంలో పుట్టినా మొఘల్ చక్రవర్తులను ఓడించి గోల్కొండ కోటపై విజయ పతాకం ఎగచేసిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని పిలుపునిచ్చారు.

# ఆలయ ఉద్యోగాల్లో జోనల్ విధానం లేదు

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన దేవాలయాల్లో అర్చకులు, వేద పండితుల నియామకాల్లో రాయలసీమకు అన్యాయం జరుగుతోందన్న విషయం ప్రభుత్వం దృష్టికి రాలేదని తెలిపారు. ఇటీవల భర్తీ చేసిన 344 పోస్టుల్లో 172 పోస్టులను రాయలసీమ ప్రాంతంలోని ప్రధాన దేవాలయాల్లో భర్తీ చేశామని చెప్పుకొచ్చారు. శ్రీశైలం, మహానంది, శ్రీకాళహస్తి, కాణిపాకం వంటి ప్రధాన దేవాలయాల్లో ఖాళీలను నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తున్నామని వెల్లడించారు.

ప్రాంతంతో సంబంధం లేకుండా వేద, ఆగమ పరిజ్ఞానం, అర్హత, ప్రతిభ, మెరిట్‌కే ప్రాధాన్యం ఇస్తున్నట్లు మంత్రి చెప్పారు. ప్రముఖ దేవాలయాలకు చెందిన వేద, ఆగమ పండితులను ఎంపిక కమిటీల్లో సభ్యులుగా నియమించి ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. సుమారు 1,400 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరయ్యారని.. పోటీ తీవ్రంగా ఉండటంతో ఒకటి, రెండు మార్కుల తేడాతోనూ ఎంపికలు జరిగాయని తెలిపారు. రాయలసీమ ప్రాంతం నుంచి 1,431 దరఖాస్తులు వచ్చాయని.. అర్హత సాధించిన వారిలో 172 మందికి అవకాశం లభించిందని ఆనం తెలిపారు. వేదం, సంస్కృతం, ఆగమ పరిజ్ఞానం వంటి అంశాల ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక జరిగిందని అన్నారు. నియామక ప్రక్రియను వీడియో రికార్డింగ్‌తో అత్యంత పారదర్శకంగా నిర్వహించామని పేర్కొన్నారు. ఇంటర్వ్యూల రికార్డింగ్‌ను అభ్యర్థులకు కూడా చూపించే విధంగా పారదర్శకత పాటించామని అన్నారు. కృష్ణ యజుర్వేదం, శుక్ల యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేద నియామకాల్లోనూ అర్హత, వేద పరిజ్ఞానం, మెరిట్ ఆధారంగానే ఎంపికలు జరిగాయని చెప్పారు.

రాయలసీమ జోన్4 పరిధిలో ప్రధాన దేవాలయాల్లో 440 పోస్టులు ఉన్నాయని.. ప్రస్తుతం జోన్4 పరిధిలో 245 మంది పనిచేస్తున్నారని.. 147 పోస్టులు ఖాళీగా ఉన్నాయని మంత్రి అన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను నిబంధనల ప్రకారం త్వరలో భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రధాన దేవాలయాల్లో భక్తులకు శాస్త్రోక్తంగా, ఆగమబద్ధంగా సేవలు అందించేందుకు నైపుణ్యం కలిగిన అర్చకులు, వేద, ఆగమ పండితులు అవసరమన్నారు. రాయలసీమతో సహా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అర్హులకు పూర్తి పారదర్శకతతో, మెరిట్ ఆధారంగా న్యాయం జరిగేలా నియామకాలు జరిగాయని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.



(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో కూటమికి మంచి విజయాన్ని అందించిన ప్రజలకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి ఫలాలను అందించడానికి కూటమి ఏర్పాటైందని వివరించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరుగుతున్నాయని అన్నారు.

అంధ్రప్రదేశ్‌పై ప్రధాన మోదీ ప్రత్యేక దృష్టి పెట్టారని గుర్తు చేశారు. తమ కలలను సాకారం చేసే పార్టీని ప్రజలు గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. అనేక ప్రాజెక్టులు ద్వారా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి డబల్ ఇంజిన్ సర్కార్ పని చేస్తుందని అన్నారు. దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని

# అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తున్నారు

ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. విపక్షం కాంగ్రెస్ పార్టీ అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తుందని మండిపడ్డారు. దీనిని తిప్పి కొట్టాలని బీజేపీ శ్రేణులకు సూచించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బాధ్యతారహిత్యంగా ప్రధాని మోదీపై వ్యాఖ్యలు చేస్తున్నారని గుర్తు చేశారు. వాటిని ఖండించాలని పార్టీ శ్రేణులకు నేషనల్ బీజేపీ చీఫ్ స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యల్లో నిరాశ కనపడుతోందని వ్యాఖ్యానించారు. విపక్షం వాడే భాష.. దేశాన్ని అస్థిర పరిచేలా ఉందన్నారు. దేశం ముందుకెళ్తుంటే సహించలేక పోతున్నారని కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతల వైఖరిని ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. ప్రస్తుత రాజకీయాల్లో విపక్షాలు, పార్ట్ టైం నాయకుల్లా తయారయ్యారని వ్యంగ్యంగా అన్నారు. యువతను ప్రభుత్వం మీద రాళ్లు విసిరేందుకు వాడితే.. మనం దేశ నిర్మాణానికి వాడుతున్నామని చెప్పారు. దేశంలోని యువతతో మమైకం కావాలని ఈ సందర్భంగా పార్టీ కేడర్‌కు సూచించారు. బీజేపీ జాతీయ వాదంతో ముందుకెళ్లాల్సి ఉందన్నారు. అన్ని వర్గాల వద్దకు వెళ్లి పార్టీని ముందుకు తీసుకెళ్లి.. బలోపేతం చేయ్యాలని పార్టీ శ్రేణులను ఆయన దిశా నిర్దేశం చేశారు.

వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రాప్రదేశ్ దిశగా పనిచేయాలని శ్రేణులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏపీలో ఈ ఏడాదిలో జరిగిన అభివృద్ధిపై పుస్తకాన్ని జాతీయ బీజేపీ చీఫ్
నితిన్ నబిన్ ఆవిష్కరించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ నుంచి బీజేపీ జాతీయ కమిటీలో పదవులు పొందిన దగ్గుబాటి పురందేశ్వరి, విష్ణువర్ధన్ రెడ్డిని ఈ సందర్భంగా నితిన్ నబిన్ సన్మానించారు.

# 2014 నుంచి రాజ్యాంగ సంస్థలు నిర్వీర్యం



(మొదటి పేజీ తరువాయి)

ఈసీ ఉదాసీనంగా చూడటం కరెక్ట్ కాదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ 3.38 కోట్ల ఓట్లు ఉన్నాయని గుర్తు చేశారు. ఎఎస్‌బీడీల పేరుతో 22 శాతం ఓట్లు తొలగించారని చెప్పారు. ఓట్ల తొలగింపునకు ప్రధాని మోదీతోపాటు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని అన్నారు. పేద ప్రజల ఓట్లు తొలగిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలను 35 వేల మందిని నియమించిందని తెలిపారు. కానీ ఈసీ మాత్రం13,100 మందిని ఇచ్చినట్లు చూపిస్తుందని చెప్పారు. సామాన్యుడి ఓటు తొలగించే ప్రయత్నం చేస్తున్నారంటూ ఈ సందర్భంగా ఈసీపై నిప్పులు చెరిగారు. 2002లో ఓటు వేసి ఉండాలని కండిషన్‌తో చాలా మంది ఎనుమరేషన్ పామ్స్ ఇవ్వలేక పోయారని చెప్పుకొచ్చారు. దీంతో వారిని కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని వివరించారు. అన్ మ్యాపుడ్ ఓట్లు 32,37000 ఉన్నాయని అన్నారు. అలాగే 60,50,000 ఓట్లు సందేహంగా ఉన్నాయని చూపిస్తున్నారని పేర్కొన్నారు. దాంతో 92 లక్షల ఓట్లు ప్రశ్నార్థకంగా మారాయని ఆవేదనతో అన్నారు. 1.60 కోట్ల ఓట్లు ఎందుకు క్వచ్చన్ మార్క్ పెట్టారో చెప్పాలంటూ ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. దేశంలో ఓటు హక్కును తొలగించే అధికారం మీకు ఎవరు ఇచ్చారంటూ ఈసీని ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రతి పౌరుడి ఓటు కాపాడాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తోందని అన్నారు. తెలంగాణలో ఎస్ఐఆర్‌కు ఇంకా సమయం ఇవ్వాలని ఈసీని డిమాండ్ చేశారు. అర్హులైన అందరికీ ఓటు హక్కు కల్పించాలని ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు.

# వచ్చే ఏడాది విజయ్ ప్రభుత్వం కూలిపోతుంది

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 18, అనంతజనశక్తి న్యూస్**

ప్రముఖ జ్యోతిషుడు వేణుస్వామి జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలపై ఆసక్తికర జోస్యం చెప్పారు. ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. తమిళనాడులో కొనసాగుతోన్న విజయ్ ప్రభుత్వం వచ్చే జూన్‌లో కూలిపోవచ్చని సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు, మరో నాలుగు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు మారే అవకాశం ఉందని, విదేశాల్లోని భారతీయ విద్యార్థులు పెద్ద సంఖ్యలో స్వదేశానికి తిరిగొచ్చే అవకాశం ఉందని ఆయన అన్నారు. అలాగే, ప్రధాని మోదీ జాతకంలో కొన్ని సమస్యలు వచ్చే అవకాశం ఉందని, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, నితిన్ గడ్కరీలు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటారని ఆయన అంచనా వేశారు.

**త్రిషతోనే విజయ్‌కు సమస్యలు**

''తమిళనాడులో విజయ్‌కు వచ్చే జూన్ తర్వాత సమస్యలు స్టార్ట్ అవ్వొచ్చు. నూరు శాతం ప్రభుత్వం పడిపోతుంది. అందులో అనుమానం లేదు. విజయ్ జాతకంలో సమస్యలు కనిపిస్తున్నాయి. విజయ్ గెలుస్తాడని చెప్పిన జ్యోతిష్కుడే ఆయనకు పదవీ గండం ఉందని కూడా చెప్పాడు. విజయ్ పదవిని కోల్పోవద్దు, జాగ్రత్త పడాలనే చెబుతున్నాను. విజయ్, త్రిష కాంబినేషన్ బాగోలేదు. త్రిష దగ్గర ఉంటే విజయ్‌కు ప్రాబ్లం వస్తుంది. త్రిష రాజకీయాల్లోకి రాదు. ఆమెకు రాజకీయ యోగం లేదు. అతడు సినిమా సమయంలో త్రిషతో మాట్లాడాను.

2027 జూన్‌లో శని మేషరాశిలోకి ప్రవేశిస్తుంది. దీని ప్రభావం ప్రపంచంపై ఉంటుంది. ఆగస్టులో రవి, కేతువులు కలిసి సింహ రాశిలో ఉండబోతున్నాయి. ఇది చాలా డేంజరెస్. చాలా సంచలనాలకు అవకాశం ఉంది. ఇటీవల జరిగిన గ్రహణాల కాంబినేషన్ కూడా విచిత్రంగా ఉంది. సెప్టెంబర్ 2026 నుంచి డిసెంబర్ 2027 వరకు 16 నెలల కాలానికి మాత్రమే ప్రిడిక్షన్ చెబుతున్నాను.

**పలు రాష్ట్రాల్లో సీఎంల మార్పు**

2026 సెప్టెంబర్ నుంచి మధ్యప్రదేశ్, బిహార్, రాజస్థాన్, ఢిల్లీ, మహారాష్ట్ర సీఎంల జాతకం దృష్ట్యా మూడు రాష్ట్రాల్లో మూడు రాష్ట్రాల సీఎంలు మారే అవకాశం ఉంది. మధ్యప్రదేశ్ సీఎం ఆరోగ్యపరమైన ఇబ్బందులతో తన పదవిని కోల్పోవాల్సి వస్తుంది. ఈ ఏడాది నవంబర్‌లో అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్ దేశాల్లోని భారతీయ విద్యార్థులు తీవ్ర సమస్యలకు గురై పెద్ద సంఖ్యలో స్వదేశానికి తిరిగొచ్చే అవకాశం ఉంది.

ఈ ఏడాది నితిన్ గడ్కరీ, అమిత్ షా జాతకంలో మూడోసారి ఏలినాటి శని నడుస్తోంది. కాబట్టి ఆరోగ్యపరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తుంది. ప్రస్తుతం నరేంద్ర మోదీ దేశాన్ని ఎలా పరిపాలిస్తున్నారో..దేశాన్ని ఒంటరిగా ఉండే వ్యక్తి పాలించే అవకాశం కనిపిస్తోంది. అది యోగి ఆదిత్యనాథ్ లేదా రాహుల్ గాంధీ కావచ్చు. అమిత్ షా కూడా ప్రధాని రేసులో ఉండే అవకాశం ఉంది.

**మోదీ జాతకంలోనూ..**

సెప్టెంబర్ నుంచి ప్రధాని మోదీ జాతకంలో కొన్ని సమస్యలు ఏర్పడతాయి. 1997లో మోదీ పరిస్థితి ఎలా ఉందో.. ఇప్పుడు కూడా 2027 జూన్ నుంచి పదవి రీత్యా అలాంటి పరిస్థితి ఏర్పడొచ్చు. ఆయన చాలా జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. హీరో సల్మాన్ ఖాన్ సెప్టెంబర్ తర్వాత పెద్ద ఆరోగ్య సమస్య బారిన పడే అవకాశం ఉంది.

ఉత్తర ప్రదేశ్ ఎన్నికలు కొద్దిగా ముందుకు జరిగే అవకాశం 6070 శాతం ఉంది. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి ఒడిశాలో లేదా ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ సంచలనం నమోదయ్యే అవకాశం ఉంది. రాజకీయంగా లేదా ధార్మిక ప్రదేశాల్లో గానీ ఒక సంచలనం జరిగే అవకాశం ఉంది. జనం గుమికూడే ప్రదేశాల్లో జాగ్రత్తగా ఉండాలి. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి 2027 డిసెంబర్ మధ్య ఇలా జరగొచ్చు. 2027 డిసెంబర్ లోపు రైలు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. గ్రహణాల ప్రభావంతో దేశంలో అతిపెద్ద భూకంపం లేదా ఉత్తరాఖండ్ లాంటి ప్రాంతంలో కొండచరియలు విరిగిపడటం లేదా ప్రపంచంలో పెద్ద భూకంపం లేదా సునామీ హెచ్చరికలు జారీ చేసే అవకాశం ఉంటుంది.

**సెప్టెంబరులో ఇంటర్నెట్ నిలిచేపోయే ఛాన్స్**

సెప్టెంబర్ నుంచి పలు ఆసియా దేశాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయే అవకాశం ఉంది, అందులో భారత్ కూడా ఉండొచ్చు. చైనా అకస్మాత్తుగా తమ దేశంలో ఇంటర్నెట్ బ్యాన్ చేసే అవకాశం ఉంది. 20262028 మధ్య ఇలా జరగొచ్చు. రాబోయే 12 ఏళ్లలో మూడు నాలుగు నెలలపాటు కరెంట్ ఆగిపోవచ్చు, దానికి యుద్ధం కారణం కావచ్చు. ఇంటర్నెట్ లేకపోవడం కూడా జరగొచ్చు. 2027లో దేశ ప్రజల దగ్గర డబ్బులు ఉండకపోవచ్చు. గత 20 ఏళ్లుగా ఖర్చు చేసినట్టు డబ్బు ఖర్చు చేయొద్దు. విలాసాలకు దూరంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు బంగారం, వెండి కొనుగోలు చేయాలి, నగదు నిల్వలను దగ్గర ఉంచుకోవాలి.

2026 సెప్టెంబర్ తర్వాత షేర్ మార్కెట్ క్రాష్ అయ్యే అవకాశం కనిపిస్తోంది. రానున్న రోజుల్లో బంగారం, వెండి, పెట్రోల్, వంట నూనెల ధరలు విపరీతంగా పెరిగే అవకాశం ఉంది. బంగారం తులం రూ.2 లక్షలు అయ్యే అవకాశం ఉంది. దేశంలో పెద్ద రాజకీయ నాయకుడికి సంబంధించిన అతిపెద్ద స్కామ్ ఈ నాలుగైదు నెలల్లో బయటకు రావచ్చు. అతి పెద్ద నాయకుడు జైలుకెళ్లే అవకాశం ఉంది. 2027లో ఇరాన్, అమెరికా యుద్ధం పెద్ద స్థాయిలో తిరిగి మొదలయ్యే అవకాశం ఉంది. దేశంలో ఏదో ఒక రాష్ట్రంలో ప్రభుత్వం పడిపోయే అవకాశం ఉంది.

యూరప్ దేశాల్లో చాలా సమస్యలు ఉండే అవకాశం ఉంది. రాబోయే కాలంలో యూరప్‌లో ముస్లింల ప్రాబల్యం ఉండే అవకాశం ఉంది. 2032 నాటికి ప్రపంచం చాలా ఎఫెక్ట్ అవుతుంది. చాలా మంది ప్రజలు ప్రభావితం అవుతారు.

డొనాల్డ్ ట్రంప్ జాతకంలో పెద్ద సంచలనం కనిపిస్తోంది. ట్రంప్ జాతకంలో చంద్ర మహర్దశ నడుస్తోంది. ఆయనకు ప్రాణగండం కనిపిస్తోంది. అది కూడా కాంట్రవర్సియల్ కావచ్చు. కారణం ఏదైనా గానీ అమెరికా ప్రజలు రోడ్ల మీదకు వచ్చి ఆందోళనలు చేయొచ్చు. అమెరికాలో అవకాశాలు లేకపోతే భారతీయ విద్యార్థులు వెనక్కి వచ్చేయాలి.

**దేశాన్ని కమాండ్ చేయనున్న సీజేపీ**

కాక్రోచ్ జనతా పార్టీ రాబోయే కాలంలో భారతదేశాన్ని కమాండ్ చేస్తుంది. కొంత మందిని నష్టపరుస్తుంది, కొంత మందికి లాభిస్తుంది. నా ఉద్దేశంలో 60 శాతం భారతదేశంలో కాబోయే ప్రధానిని సీజేపీ కమాండ్ చేసే అవకాశం ఉంది. కాక్రోచ్ పార్టీ నార్త్ ఇండియాలోని ఇతర రాష్ట్రాలకు పాకే అవకాశం ఉంది. అభిజీత్ దీప్కే ప్రాణాలకు ముప్పు కనిపిస్తోంది. కేజ్రీవాల్‌ను దగ్గరకు రానిస్తే సీజేపీ పని క్లోజ్. సీజేపీ వాళ్లు ముగ్గురు జైలుకు వెళ్లే అవకాశం ఉంది. దాని ఇంపాక్ట్ భారతదేశంపై తీవ్రంగా ఉంటుంది. రాహుల్ గాంధీ జాతకంలో ప్రధాన మంత్రి యోగం, పెళ్లి యోగం కనిపించలేదు. 201718లో చెన్నైలో రాహుల్ గాంధీని కలిసి మాట్లాడాను'' అని తెలిపారు.

# 2027 జూన్ నుంచి జగన్‌కు సమస్యలు

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 18, అనంత జనశక్తి న్యూస్**

వేణు స్వామి.. ప్రముఖ జ్యోతిష్యుడు.. తెలుగు రాజకీయాలు, సినిమాలను ఫాలో అయ్యేవారికి ఈ పేరు గురించి పెద్దగా పరిచయం చేయనక్కర్లేదు. సినీ, రాజకీయ ప్రముఖుల భవిష్యత్ గురించి జోస్యాలు, పూజలతో ఈయనకంటూ ఓ ప్రత్యేకత ఉంది. అయితే తెలుగు రాష్ట్రాలలో, మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాబోయే రోజులలో ఏం జరగనుంది.. 2029 ఎన్నికల ముఖచిత్రం ఎలా ఉంటుంది.. కూటమి పార్టీల మధ్య ఐక్యత ఇలాగే కొనసాగుతుందా.. వైఎస్ జగన్, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ పొలిటికల్ ఫ్యూచర్ ఎలా ఉండబోతోంది.. ఇలాంటి అనేక విషయాలను ఓ ఇంటర్వ్యూలో తాజాగా వేణు స్వామి వెల్లడించారు.

వైఎస్ జగన్ గురించి..

వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి.. 2027 జూన్ తర్వాత కొన్ని ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని వేణుస్వామి అంచనా వేశారు. "హైదరాబాద్ నుంచి విజయవాడకు విమానంలో వెళ్తుంటే జగన్ కనిపించారు. మన పరిస్థితి ఎలా ఉంటుందని ఆయన అడిగారు. 'మీది ఆరుద్ర నక్షత్రం, మిథున రాశి. మీ జాతకంలో 2027 జూన్ నుంచి బుధుడిలో కుజుడు ప్రవేశిస్తున్నాడు. 8 నెలలపాటు ఉంటాడు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. వెన్ను నొప్పి, కాళ్ల నొప్పులు లేదా న్యాయపరమైన ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది. పాత కేసులు తిరగదోడే అవకాశం ఉంది. 2029లో గెలిస్తే ఉత్తర భారతదేశంలోని ఒక రెండు దేవాలయాలకు వెళ్లొచ్చిన తర్వాత ప్రమాణ స్వీకారం చేయండి. దాని కోసం ఎన్నికల్లో గెలిచాక ప్రమాణ స్వీకారానికి పది రోజుల గ్యాప్ పెట్టండి'' అని జగన్‌కు సూచించాను" అని వేణుస్వామి తన జోస్యం చెప్పారు.

మరోవైపు వైఎస్ జగన్ 2027 నుంచి పాదయాత్ర చేపట్టాలని భావిస్తున్నారు. అప్పటి నుంచి ఎన్నికల సమయం వరకూ ప్రజాక్షేత్రంలోనే ఉంటానని ఇప్పటికే పలుమార్లు చెప్పిన సంగతి తెలిసిందే. ఇలాంటి సమయంలో వేణుస్వామి ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

**నారా లోకేష్ గురించి..**

ఇక నారా లోకేష్ విషయానికి వస్తే లోకేష్‌కు ప్రమోషన్ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయని వేణుస్వామి అంచనా వేశారు. " ఆగస్టు 12న ఏర్పడిన గ్రహణం కర్కాటక రాశిలో ఏర్పడింది. చంద్రబాబు, కేసీఆర్‌ది ఇదే రాశి. 2027 జూన్ 2న నారా లోకేష్ జాతకంలో జన్మశని ప్రవేశిస్తుంది. దీని వల్ల తండ్రికి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. కావున చంద్రబాబు ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవాలి. గురు మహర్దశలో ఉన్న లోకేష్‌కు ప్రమోషన్ వచ్చే అవకాశం ఉంది. బహుశా డిప్యూటీ సీఎం పదవి కావచ్చు." అని వేణుస్వామి జోస్యం చెప్పారు.

**పవన్ కళ్యాణ్‌కు సంబంధించి..**

మరోవైపు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గురించి కూడా వేణుస్వామి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఏపీలో 2027 జూన్ తర్వాత కూటమిలో విభేధాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని అంచనా వేశారు. 2029 వరకు తెలుగుదేశం ప్రభుత్వంలో ఉంటుందన్నారు. 2027 జూన్ వరకు పవన్ కళ్యాణ్ జాతకం తిరుగులేదని.. అప్పటి నుంచి అర్ధాష్టమ శని మొదలవుతుందని వేణుస్వామి జోస్యం చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఏపీలో వార్ వన్‌సైడ్ అవుతుందని.. ఏ పార్టీ గెలిచినా 80 శాతానికపైగా సీట్లు వస్తాయన్నారు. ఎన్నికల వరకు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారవని.. కానీ సంచలనాలు ఉంటాయని ఓ ఇంటర్వ్యూలో తన విశ్లేషణ వినిపించారు. ఏపీలో ట్రయాంగిల్ ఫైట్ ఉంటుంది కానీ మూడో పక్షం పెద్ద ప్రభావం చూపకపోవచ్చని అభిప్రాయపడ్డారు.



(మొదటి పేజీ తరువాయి)

# ఆ భూములను లాక్కుంటే.. చూస్తూ ఊరుకోం

విజయశాంతి లాంటి ఉద్యమకారులను పక్కన పెట్టారు..

విజయశాంతి లాంటి ఉద్యమకారులను పక్కన పెట్టి.. మంత్రి పదవి ఇవ్వకుండా ఎమ్మెల్సీ పదవితో సరిపెట్టారని కవిత పేర్కొన్నారు. ప్రభుత్వం నియమించిన అడ్వైజర్ల జీతాల విషయంలోనే సామాజిక న్యాయం ఎందుకు కనిపించట్లేదని నిలదీశారు. రేవంత్‌రెడ్డి చెప్పేది సామాజిక న్యాయం.. కానీ ఆచరణలో మాత్రం ఆటవికా న్యాయమా..? అని ప్రశ్నించారు. అప్పర్ క్లాస్ మాట్లాడితే ఓ రకమైన చర్యలు.. లో క్లాస్ మాట్లాడితే మరో రకమైన చర్యలు తీసుకుంటారా..? ఇదేనా రేవంత్‌రెడ్డి సామాజిక న్యాయం.? అని ప్రశ్నల వర్షం కురిపించారు.

రేవంత్‌రెడ్డికి భూమి అంటే కమర్షియల్ ట్రాన్సాక్షన్..

రేవంత్‌రెడ్డికి భూమి అంటే కమర్షియల్ ట్రాన్సాక్షన్‌గా మారిపోయిందని కవిత ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో కూడా మూడు వేల ఎకరాల భూమిని పేదలకు ఇచ్చారని.. ఆ తర్వాత ఆపేశారని అన్నారు. ప్రభుత్వ ఆధీనంలోని, అన్యాక్రాంతమైన భూములను సేకరించి పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఒక్కో కుటుంబానికి ఎకరం భూమి ఇవ్వడం సాధ్యమేనని చెప్పుకొచ్చారు. రేవంత్‌రెడ్డి పదేపదే గతంలో జరిగిన విషయాలనే ప్రస్తావిస్తూ.. చేయాల్సిన పనులను పక్కన పెట్టకూడదని కవిత హితవు పలికారు.

అన్యాక్రాంతమైన భూములతోపాటు.. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూములను సేకరించి నిరుపేదలకు పంపిణీ చేయాలని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. రాష్ట్రంలో భూమి పంపిణీ చేయాల్సిన అవసరం ఉందని.. పేదలకు భూమిపై హక్కులు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇక.. రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల పేరుతో ముందుగా అసైన్డ్ భూములనే తీసుకుంటున్నారని కవిత ఆరోపించారు. సుమారు 30 వేల అసైన్డ్ భూములను ప్రభుత్వం లాక్కుందని విమర్శించారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా పేదల అసైన్డ్ భూములపై వారికి యాజమాన్య హక్కులు కల్పించాలని కవిత డిమాండ్ చేశారు. పేదల భూములను లాక్కుంటే చూస్తూ ఊరుకోబోమని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి భూమిని కేవలం వాణిజ్య లావాదేవీగా చూస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో కూడా పేదలకు భూమి పంపిణీ జరిగిందని.. ఆ తర్వాత ఆ ప్రక్రియ నిలిచిపోయిందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆధీనంలోని భూములను గుర్తించి పేదలకు పంపిణీ చేయడం సాధ్యమేనని కవిత తేల్చి చెప్పారు. సామాజిక న్యాయం గురించి కాంగ్రెస్ ప్రభుత్వం మాట్లాడుతున్నప్పటికీ అది ఆచరణలో కనిపించడం లేదని కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలకు ప్రభుత్వంలో తగిన ప్రాధాన్యం దక్కడం లేదని విమర్శించారు. ప్రభుత్వ సలహాదారుల నియామకాలు, వారి జీతాల్లోనూ సామాజిక న్యాయం కనిపించడం లేదని పేర్కొన్నారు. ఆర్టీఐ కమిషన్‌లో బీసీలకు ప్రాతినిధ్యం లేదని ఆరోపించారు.

రేవంత్‌రెడ్డి చెప్పేది సామాజిక న్యాయం అయితే.. ఆచరణలో మాత్రం అటవిక న్యాయం కొనసాగుతోందని కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఉన్నత వర్గాలకు ఒక న్యాయం.. పేదలకు మరో న్యాయం అన్నట్టుగా రాష్ట్ర ప్రభుత్వ తీరు కొనసాగుతోందని ఆరోపించారు. ఉద్యమకారులకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని కూడా విమర్శించారు. కాగా, పేదలకు భూమి పంపిణీతో పాటు అసైన్డ్ భూములపై హక్కుల అంశాన్ని కూడా కవిత తన రాజకీయ కార్యాచరణలో ప్రధానంగా ప్రస్తావించారు.



# ఎన్నికల సమయంలో పట్టుబడిన నల్లధనంపై ఏడాదిలోగా దర్యాప్తు పూర్తి చేయాలి



ఎన్నికల్లో నల్లధనం ప్రభావం ప్రజాస్వామ్యానికి, చట్టబద్ధ పాలనా ప్రక్రియకు తీవ్ర ప్రమాదకరమని సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఎన్నికల సమయంలో జప్తు చేసిన నల్లధనం, అక్రమార్జనలకు సంబంధించిన క్రిమినల్ కేసులపై సత్వరమే దర్యాప్తు జరగాలంటూ జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్.కె.సింగ్‌ల ధర్మాసనం పలు మార్గదర్శకాలు జారీ చేసింది. ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే బాహ్య అంశాలు ప్రజాస్వామ్య మూలతత్వాన్నే దెబ్బతీసే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని తెలిపింది. ఎన్నికల సమయంలో నమోదయ్యే ఇటువంటి కేసుల్లో ఏడాదిలోపే అధికారులు దర్యాప్తు పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఆ గడువులోగా దర్యాప్తు పూర్తికాకపోతే కారణాలను రికార్డు చేసి ఎన్నికల కమిషన్‌కు తెలియజేయాలని పేర్కొంది. 2014 లోక్‌సభ ఎన్నికల సమయంలో బళ్లారిలో పట్టుబడిన భారీ నల్లధనానికి సంబంధించి కర్ణాటక ప్రభుత్వం దాఖలు చేసిన కేసులో ధర్మాసనం ఈ ఆదేశాలిచ్చింది.

**సత్వర విచారణ బాధితుడి విలువైన హక్కు**

కుటుంబ సభ్యుడిని కోల్పోయిన బాధితులకు సత్వర విచారణను కోరే హక్కు ఉంటుందని, అది వారికెంతో విలువైన హక్కని సుప్రీం కోర్టు పేర్కొంది. ఒక హత్య కేసులో విచారణను నిలిపివేసిన అలహాబాద్ హైకోర్టు నిర్ణయాన్ని రద్దు చేస్తూ జస్టిస్ కె.వి.విశ్వనాథన్, జస్టిస్ అరుణ్ పల్లి ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

**ఏనుగులు సంచరించే ప్రాంతాల్లో అవరోధాలు సృష్టించరాదు**

ఏనుగులు సంచరించే ప్రాంతాల్లో వాటి రాకపోకలను అడ్డుకునేలా రాష్ట్రాలు ఎలాంటి కట్టడాలను నిర్మించరాదని, అవరోధాలను సృష్టించరాదని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. అలాంటి చర్యలు ఆమోదయోగ్యం కాదని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహన ధర్మాసనం పేర్కొంది. పంటలను కాపాడే పేరుతో ఏదైనా రాష్ట్రం ఇటువంటి అవరోధాలను సృష్టించిందేమో దేశవ్యాప్త సర్వే చేసి సమగ్ర నివేదిక సమర్పించాలని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పులశాఖను ఆదేశించింది.

# ఎన్‌టీఏలో 50 మందికిపైగా సిబ్బందిపై వేటు



ప్రశ్నపత్రాల లీకేజీ, పరీక్షల్లో అవకతవకలు బయటపడుతున్న నేపథ్యంలో పరీక్షల వ్యవస్థ సమూల ప్రక్షాళనకు జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 50మందికిపైగా సిబ్బందిని తొలగించింది. సంస్థలో కీలకమైన 10 స్థానాల్లో నిపుణుల నియామకానికి చర్యలు చేపట్టింది. ఈ విషయాన్ని కేంద్ర విద్యాశాఖ సోమవారం తెలిపింది.

**ప్రైవేటు రంగం నుంచి నిపుణులు**

చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్, సీఐఎస్‌వో, జీఎం (టెస్ట్ సెక్యూరిటీ), జీఎం (ఆర్‌డీసైకోమెట్రిక్స్) వంటి 10 కొత్త స్థానాల కోసం ప్రకటనలు జారీ చేసి, నియామక ప్రక్రియ చేపట్టనున్నట్లు కేంద్ర విద్యాశాఖ వెల్లడించింది. ప్రశ్నపత్రాల రూపకల్పన, ఇతర ప్రత్యేక విభాగాల కోసం ప్రైవేటు రంగం నుంచి నిపుణులను తీసుకువస్తున్నట్లు తెలిపింది.

**కేంద్ర మంత్రి జోషి సమీక్ష**

ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి, ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్, ఇతర సీనియర్ అధికారులతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పరీక్షల విధానంలో తీసుకొస్తున్న సంస్కరణలపై ఎన్‌టీఏను మంత్రి అభినందించారు. ముఖ్యంగా 50 మందికిపైగా సిబ్బందిపై వేటును ప్రశంసించారని విద్యాశాఖ 'ఎక్స్'లో తెలిపింది. ప్రశ్నపత్రాల గోప్యతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక గదులు, ఎయిర్‌గ్యాప్డ్ సిస్టమ్స్ (ఇంటర్నెట్‌తో సంబంధం లేని వ్యవస్థలు), పరికరాలను భద్రపరిచే విధానాలను పూర్తిగా పునర్ వ్యవస్థీకరించాలని ఎన్‌టీఏకు మంత్రి సూచించారు. భవిష్యత్తులో నిర్వహించే అన్ని పరీక్షలను నిష్పక్షపాతంగా, దోషరహితంగా నిర్వహించేందుకు అంతర్గత విధివిధానాలను సమీక్షిస్తున్నట్లు ఎన్‌టీఏ వర్గాలు వెల్లడించాయి. తాజాగా ప్రశ్నపత్రాల్లో పలు తప్పులు దొర్లాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో యూజీసీ నెట్ ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ సబ్జెక్టులకు మళ్లీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆదివారం ఎన్‌టీఏ ప్రకటించింది. మరుసటి రోజే ఏజెన్సీలో ప్రక్షాళన చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# భట్టీ ఉగ్ర నెట్‌వర్క్ భూస్థాపితం

**దాడుల ప్రణాళిక భగ్నం చేశాం: అమిత్ షా**

ఐఎస్‌ఐ మద్దతు కలిగిన షహజాద్ భట్టీ నెట్‌వర్క్ ఉగ్రవాద ముఠాను భూస్థాపితం చేసినట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే.. ఆ గ్రూప్‌నకు చెందిన 200 మందికిపైగా సభ్యుల్ని అరెస్టు చేసినట్లు 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. తద్వారా దాని విధ్వంసకర దాడుల ప్రణాళికలను భగ్నం చేసినట్లు తెలిపారు. ఉగ్రవాదం విషయంలో భారత్ కఠిన వైఖరికి ఇదొక ఉదాహరణ అని పేర్కొన్నారు. "షహజాద్ భట్టీ నెట్‌వర్క్‌కు అనేక ఉగ్ర కార్యకలాపాల్లో ప్రమేయం ఉంది. ఈ క్రమంలోనే భారత భద్రతా దళాలు ఇటీవల 14 రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో సమన్వయంతో కూడిన ఆపరేషన్లు నిర్వహించాయి. 200 మందికిపైగా ఆపరేటివ్‌లను అరెస్టు చేసి.. భట్టీ నెట్‌వర్క్‌ను నాశనం చేశాయి. ఐఎస్‌ఐ నిధులతో నడిచే ఈ గ్రూప్ నుంచి ఐఈడీలు, పాకిస్థాన్ ఆయుధ ఫ్యాక్టరీ గుర్తులున్న గ్రెనేడ్లు, పిస్టళ్లు, తూటాలు, గూఢచర్యం కోసం ఉపయోగించిన సీసీటీవీ కెమెరాలు సహా పెద్ద ఎత్తున సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి'' అని అమిత్ షా తెలిపారు.

**హజాద్‌పై ఎన్ఐఏ కేసులు**

గత నెలలో మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) రాష్ట్రవ్యాప్తంగా ఓ భారీ ఆపరేషన్‌ను చేపట్టింది. ఇందులో భాగంగా పాకిస్థాన్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్ షహజాద్ భట్టీతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలపై 112 మందిని అధికారులు ప్రశ్నించారు. గ్యాంగ్‌స్టర్ భట్టీ సోషల్ మీడియా ప్లాట్‌ఫాంల ద్వారా దేశ వ్యతిరేక కార్యకలాపాలవైపు యువతను ఆకర్షించడానికి, వారిని ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు ఏటీఎస్ అధికారి ఒకరు తెలిపారు. ప్రభుత్వ వివరాల ప్రకారం.. షహజాద్ భట్టీ నెట్‌వర్క్.. పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఒక ఉగ్రవాద గ్రూప్. భారత్‌లో పలు బాంబు దాడులు, హత్యల వెనుక దీని హస్తం ఉంది. పోలీస్, రక్షణ, మతపరమైన ప్రదేశాలను రెక్కీ చేసేందుకు, గూఢచర్యం కోసం సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు స్థానిక మధ్యవర్తులకు డబ్బు చెల్లిస్తోంది. భట్టీపై ఎన్ఐఏ పలు కేసులను దర్యాప్తు చేస్తోంది.



## అయోధ్య రామాలయ విరాళాల చోరీ కేసు..

## చంపత్ రాయ్‌కు క్లీన్ చిట్..!






**అయోధ్య రామ మందిర విరాళాల చోరీ కేసులో ముమ్మర దర్యాప్తు జరుగుతోంది. ఈ క్రమంలో శ్రీరామ జన్మభూమి ట్రస్టు మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తో పాటు ట్రస్ట్ మాజీ సభ్యుడు అనిల్ మిశ్రాకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) క్లీన్‌చిట్ ఇచ్చినట్లు సమాచారం. సిట్ నివేదిక ఇప్పటికే యూపీ ప్రభుత్వానికి అందగా.. దానిని ట్రస్‌ట్‌కు అప్పగించారు. విరాళాల లెక్కింపు సమయంలో చోరీ జరిగిందని ఆరోపణలు రావడంతో జూన్ నెలలో చంపత్ రాయ్, అనిల్ మిశ్రా తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ ఆరోపణలపై రాయ్ గతంలో స్పందించారు. తనపై వస్తోన్న ఆరోపణలు నిరాధారమన్నారు. సిట్ నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన తర్వాతే ఈ వ్యవహారంపై స్పందిస్తానని వెల్లడించిన సంగతి తెలిసిందే.**

# చట్టాలను ఉల్లంఘిస్తే..రక్షణ ఉండదు

**- మెటాకు కేంద్రం హెచ్చరిక**




ఇన్‌స్టాగ్రామ్ ప్రకటనల్లో చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్‌ని వ్యాప్తి చేస్తుండడంపై కేంద్ర ఐటీశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సహా పలు అధికారుల బృందం మెటా అధికారులతో చర్చలు కొనసాగిస్తోం
ది. ఈ క్రమంలో బాలలపై లైంగిక వేధింపులకు సంబంధించిన ఏ పోస్ట్‌ను సహించబోమని సంస్థకు తేల్చిచెప్పినట్లు కేంద్రం వెల్లడించింది. అంతే కాకుండా కంటెంట్ రూపొందించే విషయంలో దేశంలోని విభిన్న భాషలు, సాంస్కృతిక సున్నితత్వాలను దృష్టిలో ఉంచుకోవాలని సూచించింది. కంటెంట్‌లో బాలలపై లైంగిక వేధింపుల మెటీరియల్ (CSAM)కు సంబంధించిన ఉల్లంఘనల విషయంలో సోషల్ మీడియా వేదికలు, వ్యక్తులు చట్టపరమైన రక్షణ కోల్పోతారని స్పష్టం చేసింది.
బాలలపై లైంగిక వేధింపుల మెటీరియల్‌ను భారత్ సహా ఇతర ప్రపంచ దేశాలు కూడా వ్యతిరేకిస్తున్నాయని కేంద్రం పేర్కొంది. ప్లాట్‌ఫామ్ నియమాలను అమలు చేసేటప్పుడు మోడరేషన్ వ్యవస్థలు వివిధ దేశాల సంస్కృతుల్లో ఉన్న వ్యత్యాసాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. వాక్ స్వాతంత్ర్యం ముఖ్యమైనదే అయినప్పటికీ, సాంస్కృతిక.. సామాజిక పరిస్థితులు దేశాన్ని బట్టి మారుతుంటాయని తెలిపింది. అదే సమయంలో సోషల్ మీడియా మాధ్యమాల్లో
ఏఐ వీడియోలపైనా కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. ప్లాట్‌ఫామ్‌లలో ఉన్న కంటెంట్ ఏఐ జనరేట్ చేసిందా లేదా మనుషులు రూపొందించారా అనే విషయం తెలుసుకోవడానికి వాటికి లేబుల్ ఏర్పాటు చేయాలని సూచించింది.

**సోషల్ మీడియాలు దేశంలోని నిబంధనలు పాటించాల్సిందే..**

**ఏ ఖాతాను అయినా కేంద్రం తొలగించాలని సూచిస్తే.. ఆ సూచనను బహిర్గతం చేసేలా సోషల్ మీడియా మాధ్యమం 'ఎక్స్' (X) కొత్తరూల్ తీసుకువచ్చింది. దీంతో తమ అకౌంట్‌ను బ్లాక్ చేయాలని ఎవరు కోరారనే విషయాన్ని వినియోగదారులు తెలుసుకునే అవకాశం ఉంటుంది. అటువంటి చర్యలు తీసుకోవడానికి గల చట్టపరమైన కారణాలు కూడా అందుబాటులో ఉంటాయి. దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పందిస్తూ.. ఏ సోషల్ మీడియా మాధ్యమాలైనా దేశంలోని చట్టాలను పాటించాల్సి ఉంటుందని పేర్కొంది.**

## ఝార్ఖండ్‌లో సీజీఎల్ పరీక్ష రద్దు



**- 2014 నుంచి ప్రైవేటు సంస్థ నిర్వహించిన ప్రభుత్వ పరీక్షలన్నీ కూడా..**

**- ఝార్ఖండ్ ప్రభుత్వ సంచలన నిర్ణయం**

నియామక పరీక్షల్లో అవకతవకలపై నిరుద్యోగులు ఉద్యమిస్తున్న వేళ ఝార్ఖండ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఝార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జేఎస్ఎస్‌సీ) నిర్వహించిన కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ (సీజీఎల్) పరీక్షను రద్దు చేస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అధ్యక్షతన సుదీర్ఘంగా కొనసాగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. 'ఉద్యమిస్తున్న విద్యార్థుల ప్రధాన డిమాండ్లలో ఇదొకటి. దీంతోపాటు పొరుగు సేవల ప్రాతిపదికన టీఎస్ఆర్ డేటా ప్రాసెసింగ్ ప్రై.లి. (టీడీపీఎల్) 2014 నుంచి ఇప్పటివరకూ నిర్వహించిన అన్ని పరీక్షలను, వాటి ఫలితాలను రద్దు చేయాలనీ నిర్ణయించాం. పరీక్షల సంస్కరణలకు సీనియర్ ఐఏఎస్ అధికారి అమితాబ్ కౌశల్ నేతృత్వంలో ఒక కమిటీని నియమిస్తున్నాం' అని సోరెన్ విలేకరులకు తెలిపారు. నియామక పరీక్షల్లో అక్రమ పద్ధతుల్ని నివారించే చట్టాన్ని ఇప్పటికే చేసినట్లు చెప్పారు. సీఐడీ, ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణలో అనేక విస్మయకర అంశాలు వెలుగుచూశాయని, ప్రస్తుత తరుణంలో వాటిని వెల్లడించలేనని తెలిపారు. పరీక్షల కుంభకోణంలో అనేక కంపెనీల ప్రమేయం ఉందని చెప్పారు.

**ఆందోళన విరమించాలని పిలుపు**

ప్రధాన డిమాండ్లు తీరినందువల్ల విద్యార్థులు ఆందోళన విరమించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. పరీక్షలు రద్దయిన పరిణామంపై న్యాయస్థానాలను ఆశ్రయించే స్వేచ్ఛ అభ్యర్థులకు ఉందని మంత్రి సుదివ్య కుమార్ చెప్పారు. మరోవైపు జేఎస్ఎస్‌సీజీఎల్ పరీక్ష ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు పొందినవారు సోమవారం రాత్రి ఝార్ఖండ్ సచివాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. పరీక్షల్ని రద్దు చేస్తే సుమారు 2,000 మంది ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. సీబీఐ విచారణ జరపాలనే ప్రధాన డిమాండు నెరవేరే వరకు ఉద్యమం కొనసాగుతుందని 'జేపీఎస్‌సీజేఎస్ఎస్‌సీ సంస్కరణల మంచ్' ప్రకటించింది. 16 రోజులుగా ఆమరణ దీక్ష చేస్తున్న దేవేంద్ర మహాతో తాను త్వరలోనే దానిని విరమిస్తానని తెలిపారు.

## ఘోర రోడ్డు ప్రమాదం.. 8 మంది కూలీల మృతి



ఘోర రోడ్డు లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో 8 మంది కూలీలు ప్రాణాలు కోల్పోగా.. 32 మంది గాయాలపాలయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖింపూర్‌ఖేరీకి చెందిన కూలీలు గ్వాలియర్‌లో వరి నాట్లు పూర్తి చేసుకుని సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత తమ గ్రామానికి ట్రాలీ వాహనంలో బయల్దేరారు. రహదారిపై వెళ్తున్న పశువులను తప్పించబోయి డ్రైవర్ ఎదురుగా వస్తున్న ట్రక్కును ఢీకొట్టాడు).
ప్రమాదం ధాటికి కూలీలు ప్రయాణిస్తున్న వాహనం నుజ్జునుజ్జయ్యింది. పలువురు కూలీలు బయటకు ఎగిరిపడగా.. మరికొందరు అందులోనే చిక్కుకుపోయారు. ఘటనా స్థలిలో ఐదుగురు మృతి చెందగా.. ఆస్పత్రికి తరలిస్తుండగా మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించారు.
pడు పాక్‌కు వ్యతిరేకంగా బిష్ణోయ్ వ్యాఖ్యలు చేయడమే అందుకు కారణం.

## ఎయిర్‌లైన్స్ పైలట్లందరికీ డ్రగ్స్ పరీక్షలు..!



**wఏవియేషన్ (DGCA) కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని దేశీయ విమానయాన సంస్థలకు చెందిన పైలట్‌లకు డ్రగ్స్ పరీక్షలు నిర్వహించనుంది. ఇటీవల పుకెట్ నుంచి దిల్లీకి వస్తున్న ఎయిరిండియా విమానం కుదుపులకు లోనైన విషయం తెలిసిందే. తాజాగా ఆ సంస్థకు చెందిన మరో ఇద్దరు పైలట్లు కూడా డ్రగ్స్ టెస్ట్‌లో ఫెయిల్ కావడంతో ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ గ్రూప్‌లు తమ పైలట్లందరికీ స్క్రీనింగ్ తప్పనిసరి చేశాయి. ఇదే విధానాన్ని అన్ని విమానయాన సంస్థలు పాటించేలా డీజీసీఏ చర్యలు చేపట్టింది. ఇందుకోసం డోపింగ్ పరీక్షలకు సంబంధించిన సివిల్ ఏవియేషన్ రిక్వైర్‌మెంట్స్ (సీఏఆర్), ఇతర నిబంధనల సవరణలపై దృష్టి సారించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పైలట్లకు పరీక్షలు నిర్వహించడానికి అన్ని విమానయాన సంస్థలలో సైకోయాక్టివ్ పదార్థాల స్క్రీనింగ్ కోసం ఒక ఫ్రేమ్‌వర్క్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ విషయంపై డీజీసీఏ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.**

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
బుధవారం | అనంతపురం
19.08.2026
ఎడిటోరియల్ EDITORIAL NEWS



## భూతాపం కట్టడికి కొత్త మార్గాలు

వాతావరణ మార్పులు ప్రపంచవ్యాప్తంగా అత్యుష్ణ పరిస్థితులకూ; భారీ వర్షపాతాలు, అనావృష్టి, వరదల వంటి వైపరీత్యాలకూ దారితీస్తున్నాయి. దీనంతటికీ కర్బన ఉద్గారాలే ప్రధాన కారణం. గడచిన వందేళ్లలో భారతదేశంలో వర్షపాతం పెద్దగా పెరగకపోయినప్పటికీ, దాని సరళి మాత్రం మారుతోంది. రుతుపవనాల కాలంలో భారీ వర్షా లు, పొడి వాతావరణం మార్చిమార్చి సంభవిస్తున్నాయి. ఇవి వరదలకూ ఆ తరవాత అనావృష్టికీ దారితీస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పెరిగేకొద్దీ వర్షపాతంలో మార్పులు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో వాతావరణ మార్పులకు శాస్త్రీయ పరిష్కారాలు కనుగొనేందుకు దేశదేశాల్లో పరిశోధనలు ఊపందుకుంటున్నాయి.

పారిశ్రామికీకరణకు తోడు మానవ చర్యల మూలంగా కర్బన ఉద్గారాలు పెచ్చుమీరుతున్నాయి. దాంతో వాతావరణ మార్పులు ఉద్ధృతంగా సంభవిస్తున్నాయి. ఇవి ప్రపంచ వాయు ప్రసరణను ప్రభావితం చేస్తున్నట్లు పరిశోధకులు తేల్చారు. కర్బన ఉద్గారాల పెరుగుదల ఉత్తరార్ధగోళంలో ఒకవైపు వర్షపాతాన్ని పెంచితే, మానవ జనిత ఏరోసోల్స్ ప్రభావం వర్షపాతాన్ని తగ్గిస్తుందని ప్రపంచ వాతావరణ నమూనాలు చూపుతున్నాయి. భవిష్యత్తులో నైరుతి రుతుపవనాల కాలంలో భారతదేశంలో కుండపోత వర్షా లు పెరుగుతాయనీ హెచ్చరిస్తున్నాయి. అదే సమయంలో ఎల్‌నినో ప్రభావం భారతీయ వర్షపాతాన్ని తగ్గిస్తుంది. 2002, 2004, 2015 ఎల్‌నినో సంవత్సరాల్లో ఇలాగే దేశంలో అనేకచోట్ల కరవు సంభవించింది. పెద్దయెత్తున పునరుత్పాదక ఇంధనాలకు మారడం ద్వారా కర్బన ఉద్గారాల కట్టడికి ఇండియా గట్టి కృషి చేస్తోంది. జాతీయ సౌరమిషన్, ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన వంటి వాటి ద్వారా కేంద్రం సౌర విద్యుదుత్పాదనకు నడుంకట్టింది. నిరుడు జులై నాటికి దేశీయ విద్యుదుత్పాదనలో అత్యధిక వాటా పునరుత్పాదక ఇంధనాలదే. మొత్తం కరెంటు డిమాండ్ సుమారు 203 గిగావాట్లు కాగా, అందులో 51.5 శాతాన్ని పునరుత్పాదక ఇంధన వనరులే తీరుస్తున్నాయి.

### ఘనరూపంలో కార్బన్ డయాక్సైడ్!

వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించాలంటే ఉద్గారాలను, ముఖ్యంగా కార్బన్ డయాక్సైడ్‌ను బాగా కట్టడి చేయాలి. ఇందుకోసం, ప్రపంచవ్యాప్తంగా కొత్త సాంకేతికతలు రూపుదిద్దుకుంటున్నాయి. వీటిలో ఒక సాంకేతికత- కార్బన్ డయాక్సైడ్ వాయు తొలగింపు(సీడీఆర్) పద్ధతి. దీన్ని డైరెక్ట్ ఎయిర్ క్యాప్చర్(డీఏసీ) అంటారు. ఈ పద్ధతిలో కొన్ని రసాయన ప్రతిచర్యల ద్వారా గాలి నుంచి కార్బన్ డయాక్సైడ్‌ను తొలగిస్తారు. ఆపై దాన్ని భూగర్భంలోకి పంపడం లేదా కాంక్రీట్ వంటి ఇతర దీర్ఘకాలిక ఉత్పత్తుల్లో బంధించడం చేస్తారు. అయితే, ఈ పద్ధతి చాలా ఖరీదైనది, ఎక్కువ మొత్తంలో విద్యుత్ అవసరమవుతుంది.

కార్బన్ మినరలైజేషన్ అనేది మరో పద్ధతి. ఇందులో ఖనిజాలు వాతావరణంలోని కార్బన్ డయాక్సైడ్‌తో రసాయన చర్య జరిపి, వాయురూపంలోని సీవో2ను ఘనపదార్థంగా మారుస్తాయి. ఆ ఘనీకృత సీవో2ను వాతావరణం నుంచి వేరు చేయవచ్చు. ఈ పద్ధతిని తక్కువ ఖర్చుతో చేయడానికి మరింత పరిశోధన అవసరం. కార్బన్ డయాక్సైడ్ తొలగింపు(సీడీఆర్) పద్ధతుల్లో బయోమాస్ కర్బన తొలగింపు- నిల్వ విధానం, సముద్రాల సాయంతో కర్బన తొలగింపు విధానాలు కూడా ఉన్నాయి.

శాస్త్రవేత్తలు సోలార్ రేడియేషన్ మోడిఫికేషన్ వంటి ప్రయోగాలనూ ప్రతిపాదిస్తున్నారు. వీటి ద్వారా ఉష్ణోగ్రతల్లో పెరుగుదలను తాత్కాలికంగా ఆపవచ్చు. వీటిని సోలార్ జియో ఇంజినీరింగ్ పద్ధతులు అంటారు. ఇవి కర్బన ఉద్గారాలను తగ్గించడం, వాటి మూలాలను పరిమితం చేయడంకన్నా సౌర వికిరణాన్ని మార్చడంపై ప్రధానంగా దృష్టి పెడతాయి. సోలార్ జియోఇంజినీరింగ్‌లో స్ట్రాటోస్పిరిక్ ఏరోసోల్ ఇంజెక్షన్, మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్, సిర్రస్ క్లౌడ్ థిన్నింగ్ మొదలైన సాంకేతికతలు ఉన్నాయి. 1991లో సంభవించిన మౌంట్ పినాటోబో అగ్నిపర్వత విస్ఫోటనం నుంచి సౌర వికిరణాన్ని మార్చాలన్న భావన ఉద్భవించింది. ఈ ఘటన తరవాత విడుదలైన బూడిద వాతావరణంలో రెండో పొర అయిన స్ట్రాటోస్పిరిక్ పొరకు(భూ ఉపరితలానికి 16-25 కి.మీ. ఎత్తుకు) చేరుకుంది. అక్కడ ఈ బూడిద కణాలు సూర్యుడి నుంచి భూ వాతావరణంలోకి వచ్చే సౌర వికిరణాన్ని అంతరిక్షంలోకి పరావర్తనం చెందించాయి. దాంతో భూమికి చేరే సౌర వికిరణం మందగించి, ఉపరితల ఉష్ణోగ్రతలు తగ్గాయి. విమానాలను ఉపయోగించి స్ట్రాటోస్పియర్‌లో గంధక కణాలను కలిపే ప్రక్రియే- స్ట్రాటోస్పిరిక్ ఏరోసోల్ ఇంజెక్షన్. ఈ గంధక కణాలు వాతావరణంలోకి వ్యాపించి, భూమికి చేరే సౌర వికిరణాన్ని బాగా తగ్గించేస్తాయి. అయితే, ఈ పద్ధతులు రుతుపవనాల ప్రసరణతోపాటు మొత్తం ప్రపంచ వాతావరణ సరళిలో ఎలాంటి మార్పులు తీసుకువస్తాయనే అంశంపై మరిన్ని అధ్యయనాలు నిర్వహించాలి.

### అవగాహన పెంచుకోవాలి

మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్ సాంకేతికత సైతం సౌరశక్తిని అంతరిక్షంలోకి పరావర్తనం చెందిస్తుంది. దీనిలో సముద్ర జలాల్లోని ఉప్పు కణాలను సాగరాలపై ఉండే మేఘాల్లోకి పంపుతారు. దీనివల్ల మేఘాలు మరింత ప్రకాశవంతంగా మారి, సూర్యరశ్మిని తిరిగి అంతరిక్షంలోకి ప్రతిఫలింపజేస్తాయి. తద్వారా భూ ఉపరితలాన్ని చల్లబరచడానికి తోడ్పడతాయి. దీనికి అయ్యే ఖర్చు, సాంకేతిక సవాళ్లపై మరిన్ని పరిశోధనలు జరగాల్సి ఉంది. సిర్రస్ మేఘాలను పలచబరచడమనేది మరో సాంకేతికత. వాతావరణంలో ఆరు కిలోమీటర్ల ఎత్తున, ఎగువ ట్రోపోస్ఫియర్‌లో ఉండే మేఘాలే సిర్రస్ మేఘాలు. వీటిని బాగా పలచబడేట్లు చేయడం ద్వారా భూమిపై ఉష్ణోగ్రతను తగ్గిస్తారు. ఈ పద్ధతిలో కొన్ని రసాయనాలతో సిర్రస్ మేఘాల్లో పెద్ద మంచు స్ఫటికాలు తయారయ్యేలా చేస్తారు. అవి త్వరగా కిందికి పడిపోవడం లేదా కరిగిపోవడం వల్ల ఆ మేఘాల సాంద్రత తగ్గుతుంది. అలా పలుచబడిన మేఘాల వల్ల భూమి చల్లబడుతుంది. ఈ ప్రయోగాల అమలు విషయమై అంతర్జాతీయ వేదికలపై తరచూ చర్చలు జరుగుతున్నాయి. వీటి గురించి అవగాహన పెంచుకోవడం భారతదేశ విధాన రూపకర్తలకూ చాలా అవసరం. ఈ ప్రయోగాల్లో భారత్‌కు అనువైన వాటిని ఎంచుకుని, మరింత అధ్యయనం సాగించాలి. మన పరిశోధకులు ఇప్పటికే అటువంటి ప్రయోగాలు చేపడుతుండటం శుభపరిణామం.



# బ్యూరోక్రసీ సంస్కరణలు

## వలస పరిపాలన నుంచి సేవా ప్రభుత్వం వైపుగా!

**1947లో బ్రిటిష్ వారు భారత్ నుంచి నిష్క్రమిస్తూ "స్టీల్ ఫ్రేమ్" (ఉక్కు చట్రం) అనే ఒక పదాన్ని వదిలివెళ్లారు. నాడు బ్రిటిష్ రాజ్ తన అధికారాన్ని నిలబెట్టుకోవడానికి రూపొందించుకున్న పరిపాలనా వ్యవస్థే 'ఇండియన్ సివిల్ సర్వీస్'. ఉక్కు సులభంగా వంగదు; ఒక సామ్రాజ్యాన్ని తమ అదుపులో ఉంచుకోవడానికే దాన్ని రూపొందించారు తప్ప, పాలితుల ఆకాంక్షలను వినడానికి కాదు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా దశాబ్దాల పాటు మనం అదే చట్రాన్ని వారసత్వంగా స్వీకరించాం. దానికి కొత్త పేరు పెట్టి, ఖాదీ దుస్తులు తొడిగించి మనదిగా భావించాం. కానీ అణచివేత కోసం నిర్మించిన వ్యవస్థ, దానికదిగా సేవ చేసేదిగా మారిపోదు. అందుకే, స్వతంత్ర భారతంలో కూడా చాలా ఏళ్ల పాటు వలస పాలనా వ్యవస్థలోనే జీవించాం. ఒకే ఫారమ్ను మూడు కాపీలలో నింపడం, అధికారుల కోసం గంటల తరబడి క్యూలలో నిలబడటం, మన భవిష్యత్తును నిర్ణయించే "సాహెబ్" కోసం వేచి చూడటానికే ప్రాధాన్యత దక్కింది.**







రచయిత ; డాక్టర్ జితేంద్ర సింగ్ (కేంద్ర శాస్త్ర & సాంకేతిక విజ్ఞాన, భూ విజ్ఞాన శాస్త్రాల సహాయ మంత్రి (స్వతంత్ర హోదా); ప్రధానమంత్రి కార్యాలయం, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణుశక్తి మరియు అంతరిక్ష శాఖల సహాయ మంత్రి, భారత ప్రభుత్వం)

ఈ వ్యవస్థను నేను పౌరుడిగా, వృత్తి నిపుణుడిగా, కేంద్ర ప్రభుత్వంలో సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ బాధ్యతలను నిర్వహించిన మంత్రిగా నిశితంగా పరిశీలించాను. "భారత బ్యూరోక్రసీలో సంస్కరణలు వచ్చాయా?" అనే ప్రశ్నకు నా సమాధానం కేవలం వ్యవస్థను సమర్థించుకోవడమో లేదా నిరాశావాదంతో మాట్లాడటమో కాదు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఎలాంటి మార్పులకు నోచుకోని ఒక వ్యవస్థను గత పన్నెండేళ్లుగా అత్యంత నిశ్శబ్దంగా, దృఢ సంకల్పంతో పునర్నిర్మిస్తున్న తీరును లోపలి నుంచి గమనించిన వ్యక్తిగా నేను ఇస్తున్న సమాధానం ఇది. ఒకవేళ వినూత్న ఆలోచనలకు పేరొందిన శ్రీ నరేంద్ర మోదీ, దేశానికి 15వ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించకపోతే, ఈ వ్యవస్థ ఇప్పటికీ మారకుండా అలాగే ఉండిపోయేదేమో.

మనం ఎక్కడి నుంచి ప్రయాణం ప్రారంభించామో ఒకసారి పరిశీలిస్తే పరిస్థితి అర్థమవుతుంది. 2014 నాటికి, కేంద్ర ప్రభుత్వానికి పౌరుడు ఇచ్చే ఫిర్యాదు పరిష్కారమయ్యేందుకు సగటున 157 రోజులు పట్టేది. దేశమంతటికీ కలిపి కేవలం పదివేల మంది ఫిర్యాదుల పరిష్కార అధికారులు మాత్రమే ఉండేవారు; వారిని సంప్రదించడం కష్టం, పైగా కాలపరిమితి అనే బాధ్యత ఉండేది కాదు. ఉద్యోగం కోసం ఆఫీసుల చుట్టూ తిరిగే యువకుడైనా, భర్త పెన్షన్ ఫైలు కోసం నిరీక్షించే వితంతువైనా, పంటల బీమా క్లెయిమ్ ఏ ఆఫీసు అలమరాలో మాయమైందో తెలియక తల్లడిల్లే రైతు అయినా.. అందరికీ ఒకే రకమైన నిర్దయైన వ్యవస్థ ఎదురయ్యేది. ఇది కేవలం పనికిరానితనం మాత్రమే కాదు, పౌరులు తమ హక్కుల కోసం అధికారులను సంప్రదించాలంటే భయపడేలా చేసిన వలస పాలనా వ్యవస్థకు చివరి చిహ్నం.

నేటి గణాంకాలు ఈ మార్పును స్పష్టంగా చెబుతున్నాయి. ఒకప్పుడు 157 రోజులు పట్టిన ఫిర్యాదుల పరిష్కార సమయం ఇప్పుడు 15 రోజులకు తగ్గింది. ఏడాదికి నమోదయ్యే ఫిర్యాదుల సంఖ్య 3 లక్షల నుంచి ఏకంగా 27 లక్షలకు (తొమ్మిది రెట్లు) పెరగగా, పరిష్కరించే అధికారుల సంఖ్య లక్ష దాటింది. ఈ ఏడాది మార్చి నెలలోనే సెంట్రల్ సెక్రటేరియట్ వరుసగా 45వ నెలలో కూడా లక్ష కంటే ఎక్కువ ఫిర్యాదులను పరిష్కరించి రికార్డు సృష్టించింది. మేము అభివృద్ధి చేసిన 'CPGRAMS' డిజిటల్ వేదిక ఇప్పుడు 22 భాషల్లో సేవలందిస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో ఫిర్యాదులను సరిగ్గా పరిశీలించి తగిన విభాగానికి పంపడమే కాక, మారుమూల గ్రామీణ రైతు కూడా 'సమాధాన్ దీదీ' చాట్‌బాట్ ద్వారా తన సొంత భాషలోనే ఫిర్యాదు చేసే వెసులుబాటు కల్పించాం. పంచాయతీల్లోని కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా గ్రామీణులు సేవలు పొందుతున్నారు; ఈ ఫలాలు ఆఖరి పౌరుడికి అందాలనే లక్ష్యంతో ప్రతీ నెల 20వ తేదీని 'CSCCPGRAMS Day'గా నిర్వహిస్తున్నాం.

అయితే, డిజిటల్ వ్యవస్థల కంటే అతిపెద్ద సంస్కరణ—అధికారుల ఆలోచనా దృక్పథంలో తెచ్చిన మార్పు! డెబ్బై ఏళ్లుగా మన ప్రభుత్వం "నిబంధనల ఆధారిత" సంస్కృతిపై నడిచింది; అంటే అధికారి పౌరుడి సమస్యను తీర్చాడా? లేదా? అనేదానికంటే సరైన విధానాన్ని అనుసరించాడా? లేదా? అనేదే ప్రామాణికంగా ఉండేది. దీనిని "పాత్రల ఆధారిత" సంస్కృతిగా మార్చడానికి 2020లో "మిషన్ కర్మయోగి"ని ప్రారంభించాం. పాత కాలపు రూల్ బుక్ లెక్కింపులు కాకుండా, విధి నిర్వహణకు ఏం కావాలో దానిపైనే శిక్షణ ఇస్తున్నాం. ప్రస్తుతం గ్రామ స్థాయి క్లర్క్ నుంచి కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి వరకు సుమారు 1.65 కోట్ల మంది ఉద్యోగులు 'iGOT కర్మయోగి' వేదికపై శిక్షణ పొందుతున్నారు. ఇందులో హిందీతో పాటు మరిన్ని భారతీయ భాషల్లో 5,000 కంటే ఎక్కువ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అంతేకాకుండా, ఈ అభ్యసనాన్ని అధికారుల వార్షిక పనితీరు మూల్యాంకన నివేదిక (APAR) తో అనుసంధానించాం. తద్వారా నిరంతర నేర్చుకోవడం అనేది కేవలం పేరుకు చేసే పని కాకుండా, ఉద్యోగోన్నతికి నేరుగా ముడిపడిన కొలమానంగా మారింది.

అధికారుల ఎంపిక, శిక్షణల్లో ఉన్న వలస రాజ్యాల గుర్తులను తొలగించేందుకు పట్టుదలతో పనిచేశాం. 2016 నుంచి గ్రూప్ సీ, నాన్‌గెజిటెడ్ గ్రూప్ బీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలను రద్దు చేశాం. గతంలో ఇంటర్వ్యూల పేరిట జరిగే పక్షపాతం, అవినీతికి దీనితో అడ్డుకట్ట పడింది. కేంద్రంతో పాటు 24 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలు కూడా దీనిని అమలు చేశాయి. ప్రతి చిన్న ఫారమ్పై గెజిటెడ్ అధికారి ధృవీకరణ సంతకం ఉండాలనే పాత నిబంధనను రద్దు చేసి, పౌరులపై నమ్మకాన్ని ఉంచాం. పోలీస్ వెరిఫికేషన్ పూర్తయ్యే వరకు వేచి చూడకుండా తాత్కాలికంగా ఉద్యోగంలో చేరే వెసులుబాటు ఇచ్చాం. ప్రయోజనం లేని 1,600 కంటే ఎక్కువ పాత చట్టాలను రద్దు చేశాం. "మన మనస్సుల్లో ఉన్న వలస రాజ్యాల ఆలోచనా విధానాన్ని వదులుకోవడమే అసలైన సంస్కరణ" అని నేను యువ అధికారులకు స్పష్టం చేస్తుంటాను. వలస పాలనా చిహ్నమైన 'నార్త్ బ్లాక్' భవనం నుంచి మంత్రిత్వ శాఖను కొత్త 'కర్తవ్య భవన్' కు మార్చడం కేవలం చిరునామా మార్పు మాత్రమే కాదు; పాలన అంటే నియంత్రణ కాదని, 'కర్తవ్యం' అని చాటి చెప్పడమే.

అలాగే, కార్యాలయాలను నడిపిస్తున్న మహిళా ఉద్యోగుల కోసం నిశ్శబ్దంగా మరొక సంస్కరణ అమలవుతోంది. గతంలో ప్రభుత్వ ఉద్యోగం చేసే మహిళకు ప్రసవ సమయంలో బిడ్డను కోల్పోతే అధికారికంగా ఎలాంటి సెలవు ఉండేది కాదు. కానీ నేడు ఆమెకు 60 రోజుల ప్రత్యేక ప్రసూతి సెలవు లభిస్తోంది; 2022లో తెచ్చిన ఈ మార్పును సరోగసీ ద్వారా పిల్లలను పొందే తల్లులకు కూడా వర్తింపజేశాం. 'చైల్డ్ కేర్ లీవ్'ను ఎక్కడికైనా బదిలీ చేసుకునేలా, విదేశీ ప్రయాణాలకు కూడా వాడుకునేలా సరళీకృతం చేశాం; ఒంటరి తల్లులకైతే ఏడాదికి 6 సార్లు వాడుకునే వెసులుబాటు కల్పించాం. లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేసిన మహిళలకు విచారణ సమయంలో సొంత సెలవుల ఖాతాతో సంబంధం లేకుండా 90 రోజుల సెలవు పొందే హక్కును ఇచ్చాం. వైకల్యం ఉన్న మహిళా అధికారులకు శిశు సంరక్షణ అలవెన్స్ ఇవ్వడమే కాక, దివ్యాంగ పిల్లల విద్యా అలవెన్సును రెట్టింపు చేశాం. ఇవన్నీ జీడీపీ చార్టుల్లో కనిపించకపోవచ్చు కానీ, మహిళలు ఉద్యోగాల్లో కొనసాగేలా చేయడంలో, సివిల్ సర్వీసెస్లో లింగ సమానత్వాన్ని ఆచరణలో చూపించడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి.

ఏ సంస్కరణ అయినా సాధారణ పౌరుడి జీవితంలో మార్పు తెచ్చినప్పుడే దానికి విలువ ఉంటుంది. గడిచిన కొన్నేళ్లలో 'రోజ్గార్ మేళాల' ద్వారా ఎలాంటి సిఫార్సులు లేకుండా పారదర్శకంగా అందించిన 12 లక్షలకు పైగా నియామక పత్రాల్లో ఈ మార్పు కనిపిస్తోంది. మస్సోరీలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కలిసి ఒకే విధమైన ప్రాథమిక శిక్షణను పొందుతున్నారు. దీంతో వారు పాలనలో భాగమై ఓ పౌరుడిని కలిసినప్పుడు వేరువేరు విభాగాలుగా కాక ఉమ్మడి ప్రభుత్వంగా స్పందించేందుకు వీలవుతుంది. ఇంట్లోనే డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ పొందుతున్న పెన్షనర్లలో, యూపీఎస్సీ పోర్టల్లో ఒన్‌టైమ్ రిజిస్ట్రేషన్ ద్వారా సులభంగా దరఖాస్తు చేసుకుంటున్న యువతలో, ప్రభుత్వ ఉద్యోగాల్లో 19 నుంచి 27 శాతానికి పెరిగిన బిసి (OBC)ల ప్రాతినిధ్యంలో ఈ మార్పు స్పష్టమవుతోంది. బ్రిటిష్ వారు వదిలివెళ్లిన ఈ ఉక్కు చట్రం రాత్రికి రాత్రే కనుమరుగు కాదు, అలా అని దాన్ని తొలగించాల్సిన అవసరం లేదు. ఈ పన్నెండేళ్లలో మేం చేసింది దాన్ని నిశ్శబ్దంగా పునర్నిర్మించడమే. ఫలితంగా, ఒకప్పుడు సామ్రాజ్య అధికారాన్ని నిలబెట్టిన ఆ చట్రం.. నేడు మన రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెడుతూ, పాలించే ప్రభుత్వం నుంచి 'సేవా ప్రభుత్వంగా' రూపాంతరం చెందింది.

## రియల్ ఎస్టేట్ గృహ సంక్షోభం:

# ఆగిపోయిన సామాన్యుడి సొంతింటి కల

**వర్తమాన ఆర్థిక వ్యవస్థలో గృహనిర్మాణ రంగం ఒక అపూర్వమైన, సంక్లిష్టమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఆర్థిక విశ్లేషకులు దీనిని "రియల్ ఎస్టేట్ మార్కెట్ నిశ్చలత" (జెనరేషనల్ ఫ్రీజ్) గా అభివర్ణిస్తున్నారు. దశాబ్దాలుగా సొంత ఇల్లు అనేది ఒక కుటుంబ ఆర్థిక స్థిరత్వానికి, ప్రగతికి ప్రతీకగా నిలిచేది. కానీ నేడు, తక్కువ వడ్డీ రేట్ల "లాక్-ఇన్ ప్రభావం", ఆకాశాన్నంటుతున్న ఇళ్ల ధరలు, మరియు ఊహించని రీతిలో పెరుగుతున్న భీమా రుసుములు ఏకమై నూతన తరాన్ని, ముఖ్యంగా తొలిసారి ఇల్లు కొనాలనుకునే యువతను ఆస్తి మార్కెట్ నుండి పూర్తిగా వేరు చేస్తున్నాయి.ఈ విపత్కర పరిస్థితికి ప్రధాన మూలం గతంలో లభించిన తక్కువ వడ్డీ రుణాలు. గతంలో అతి తక్కువ వడ్డీ రేట్లకు (3 శాతం నుండి 4 శాతం) గృహ రుణాలు పొందిన పాత యజమానులు, ఇప్పుడు తమ ఇళ్లను విక్రయించడానికి ఏమాత్రం సిద్ధంగా లేరు. ప్రస్తుత మార్కెట్లో రుణాలు 6.5 శాతానికి పైగా ఉండటమే ఇందుకు కారణం. ఒకవేళ పాత ఇల్లు విక్రయించి కొత్తది కొనాల్సి వస్తే, వారి నెలవారీ కిస్తీ భారం రెట్టింపు అవుతుంది.**

అమెరికా ఫెడరల్ రిజర్వ్ గణాంకాల ప్రకారం, కేవలం ఈ వడ్డీ రేట్ల వ్యత్యాసం కారణంగానే దాదాపు ఎనిమిది లక్షలకు పైగా గృహ విక్రయాలు నిలిచిపోయాయి. చలామణిలో ఉన్న రుణాలలో 60 శాతానికి పైగా 4 శాతం కంటే తక్కువ వడ్డీకే పరిమితమై ఉండటంతో, పునర్విక్రయ (రీసేల్) మార్కెట్లో గృహాల లభ్యత క్షీణించింది.

సరఫరా కొరత కారణంగా ఇళ్ల ధరలు ఆకాశాన్నంటుతుండగా, వాతావరణ మార్పుల ముప్పుతో గృహ భీమా రుసుములు 20 నుండి 35 శాతం వరకు పెరిగాయి. 'నేషనల్ అసోసియేషన్ ఆఫ్ రియల్టర్స్' గణాంకాల ప్రకారం, తొలిసారి ఇల్లు కొనుగోలు చేసేవారి భాగస్వామ్యం చారిత్రాత్మక కనిష్టానికి పడిపోయింది.

ప్రస్తుతం ఒక సగటు ఇంటి నెలవారీ కిస్తీ, పన్నులు మరియు భీమా భారం, యువ ఉద్యోగుల సగటు ఆదాయంలో 30 నుండి 40 శాతానికి పైగా హరించివేస్తోంది. ఈ నిశ్చలత కేవలం ఆస్తి రంగానికే పరిమితం కాకుండా, శ్రామిక శక్తి కదలికలను (లేబర్ మోబిలిటీ) తీవ్రంగా దెబ్బతీస్తోంది. మెరుగైన వేతనం, ఉన్నత అవకాశాలు లభించినప్పటికీ ఇతర నగరాలకు మారడానికి ఉద్యోగులు సంకోచిస్తున్నారు. అక్కడ కొత్త ఇల్లు కొనడం లేదా అద్దె చెల్లించడం వల్ల అయ్యే అదనపు ఖర్చు, లభించే వేతన పెరుగుదల కంటే చాలా ఎక్కువగా ఉండటమే దీనికి కారణం. ఈ ప్రభావంతో ప్రాంతాంతర మార్పిడి చేసుకునే శ్రామికుల సంఖ్య 16 శాతం తగ్గింది.

ఈ జెనరేషనల్ ఫ్రీజ్‌ను అధిగమించేందుకు ప్రభుత్వాలు, బ్యాంకింగ్ రంగం మరియు విధానకర్తలు తక్షణమే వ్యూహాత్మక చర్యలు చేపట్టాలి. ముందుగా నగరాల్లో కఠినమైన జోనింగ్ నిబంధనలను సవరించి, బహుళ అంతస్తుల మరియు అందుబాటు ధరల గృహాల నిర్మాణ అనుమతులను వేగవంతం చేయడం ద్వారా సరఫరాను పెంచి ధరలను అదుపులోకి తీసుకురావాలి. అలాగే ప్రస్తుతం ఉన్న తక్కువ వడ్డీ రుణాన్ని యజమానులు కొత్త ఇంటికి మార్చుకునే (మోర్ట్‌గేజ్ పోర్టబిలిటీ) అవకాశాన్ని బ్యాంకులు కల్పిస్తే, పాత యజమానులు ఇళ్లను అమ్మడానికి ముందుకు వస్తారు. మరోవైపు యంగ్ ప్రొఫెషనల్స్ కోసం తక్కువ డౌన్ పేమెంట్, వడ్డీ రేట్లపై ప్రత్యేక సబ్సిడీలు లేదా పన్ను మినహాయింపులు అందించే ప్రభుత్వ పథకాలను విస్తరించాలి. చివరిగా, ప్రకృతి విపత్తుల వల్ల పెరిగిన భీమా భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ కంపెనీలకు రిస్క్ షేరింగ్ సపోర్ట్ ఇవ్వడం ద్వారా ప్రీమియంలను అదుపు చేయవచ్చు. ఈ విధమైన సమగ్ర మార్పులు చేపడితే తప్ప ఈ ఆర్థిక జడత్వం తొలగిపోవడం అసాధ్యం.

(హెచ్. ప్రతాప్)

# స్వచ్ఛ ఇంధన బాటలో ముందడుగు

**జోరందుకున్న పట్టణీకరణ, పరిశ్రమల విస్తరణ, డేటా సెంటర్ల ఏర్పాటు తదితరాలతో మన దేశంలో విద్యుత్‌కు గిరాకీ నానాటికీ అధికమవుతోంది. రాబోయే నాలుగైదేళ్లలో ఏటా అది ఆరు శాతం మేర పెరగవచ్చునని అంచనా. ఇదే సమయంలో బొగ్గు, చమురు, గ్యాస్ వంటి శిలాజ ఇంధనాల విచ్చలవిడి వినియోగంతో పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతోంది. దిగుమతుల భారమూ తడిసి మోపెడవుతోంది. యుద్ధాలూ అంతర్జాతీయ ఉద్రిక్తతల సమయంలో ఇంధన ధరలు, సరఫరాలు ఒడుదొడుకులకు లోనవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రత్యామ్నాయ ఇంధనాల ద్వారా ఈ సమస్యల్లోంచి గట్టెక్కాలని, కాలుష్య విపరిణామాలను తగ్గించడానికి 2070నాటికి కర్బన ఉద్గారాల తటస్థతను సాధించాలని ఇండియా నిశ్చయించింది. ఒకవైపు ప్రకృతిని కాపాడుకుంటూనే- దేశ ప్రగతికి ప్రాణసమానమైన విద్యుత్‌ను పునరుత్పాదక మార్గాల్లో విరివిగా ఉత్పత్తి చేసుకోవాలని సంకల్పించింది. 2030 నాటికి ఆర్ఈలో 500 గిగావాట్ల స్థాపిత సామర్థ్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కిందటి నెలాఖరు నాటికి 300 గిగావాట్ల శిలాజేతర ఇంధన ఉత్పాదక సామర్థ్యాన్ని ఒడిసిపట్టి కీలక మైలురాయికి చేరుకుంది. ప్రస్తుతం భారతదేశ మొత్తం విద్యుదుత్పత్తి సామర్థ్యంలో పునరుత్పాదక వనరుల వాటా 54శాతానికి చేరడం హర్షణీయం. అయినప్పటికీ స్వచ్ఛ ఇంధన బాటలో భారత్ వడివడిగా దూసుకుపోవాలంటే అధిగమించాల్సిన సవాళ్లూ ఎన్నో ఉన్నాయి!**

పీఎం సూర్యఘర్, కుసుమ్ వంటి పథకాల దన్నుతో సౌర విద్యుత్ రంగంలో ఇండియా గడిచిన కొన్నేళ్లలో వేగంగా పురోగతి సాధించింది. 2014లో సోలార్ ఎనర్జీ స్థాపిత సామర్థ్యం దాదాపు మూడు గిగావాట్లు ఉంటే, ప్రస్తుతం అది 164 గిగావాట్లకు చేరింది. మొత్తం పునరుత్పాదక ఇంధన శక్తిలో సగానికి పైగా వాటా సౌర విద్యుత్తుదే. ఇది స్వాగతించదగిన ప్రగతే కానీ, ఇక్కడే విధాన నిర్ణేతలు దృష్టిసారించాల్సిన కీలకాంశం ఒకటి ఉంది. సోలార్ మాడ్యూళ్ల రూపకల్పనలో ముందున్న భారత్ విడిభాగాల తయారీలో మాత్రం బాగా వెనకబడింది. మనకు కావాల్సిన సోలార్ సెల్స్‌లో 90శాతాన్ని చైనా నుంచి తెప్పించుకోవాల్సి వస్తోంది. సరిహద్దు ఘర్షణలు ఉన్న డ్రాగన్‌పై ఇంతలా ఆధారపడటం దీర్ఘకాలంలో క్షేమదాయకం కాదు. చైనా వాటితో పోలిస్తే ఇండియాలో తయారైన సోలార్ మాడ్యూళ్ల ధరలూ ఎక్కువగా ఉంటున్నాయి. నాణ్యమైన చవకైన సోలార్ ఉపకరణాల్లో స్వావలంబన సాధించాలంటే పవన శక్తి వనరుల తరహాలో దేశీయంగా సంబంధిత సరఫరా గొలుసులను బలోపేతం చేసుకోవాలి. అందుకోసం పరిశ్రమలకు రుణాలు, రాయితీపై విద్యుత్ వంటి ప్రోత్సాహకాలు విస్తృతంగా కల్పించాలి. ఆర్అండ్‌డీకి కేటాయింపులు పెంచి ఆవిష్కరణలకు ఊతమివ్వాలి!

సౌర, పవనశక్తి వంటివి ఎప్పుడూ ఒకేలా లభించవు. ఉత్పత్తి ఎక్కువగా ఉన్నప్పుడు నిల్వ చేసుకుని కావాల్సినప్పుడు వినియోగించుకోవడానికి, గ్రిడ్ స్థిరత్వాన్ని కాపాడుకోవడానికి స్టోరేజీ సదుపాయాల్ని పెంచుకోవాలి.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
బుధవారం | అనంతపురం | 19.08.2026 | 01

## రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మాంటిస్సోరి ఎలైట్ విద్యార్థులు



శ్రీ ప్రణవి | భవిత | అఖిలేశ్వర్ | విష్ణువర్ధన్ రెడ్డి

**రాప్తాడు ఆగస్టు 18 అనంత జనశక్తి న్యూస్**

అనంతపురం జిల్లా రాప్తాడు మండలం గొల్లపల్లి సమీపంలోని మాంటిస్సోరి ఎలైట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం అనంత పురంలోని ప్రభుత్వ కళాశాలలో బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్, సబ్ జూనియర్ విభాగాల ఎంపిక పోటీల్లో పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. జూనియర్ విభాగంలో శ్రీ ప్రణవి, భవిత, అఖిలేశ్వర్, సబ్ జూనియర్ విభాగంలో విష్ణువర్ధన్ రెడ్డి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఎం.డీ. కృష్ణ భరత్, కరస్పాండెంట్ కృష్ణ సమీర, ప్రిన్సిపల్ ప్రతాప్ రెడ్డి అభినందించారు. విద్యార్థులకు శిక్షణ అందించిన కోచ్ కోతే పద్మావతిని కూడా వారు అభినందించారు. రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రకాశం జిల్లా మార్కాపురంలో సెప్టెంబర్ 10 నుంచి 12వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పోటీల్లో మాంటిస్సోరి ఎలైట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ తరఫున ఎంపికైన విద్యార్థులు పాల్గొననున్నారు.

## నోటీసులు అందుకున్న ఓటర్లందరూ
# తప్పనిసరిగా విచారణకు హాజరు కావాలి

- కేటాయించిన తేదీన సరైన రికార్డులతో హాజరు కాకపోతే, సంబంధిత వ్యక్తులు ఓటు హక్కును కోల్పోతారు..
- నోటీసులు అందుకున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తగిన ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలి
- జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్..



**అనంతపురం, ఆగస్టు 18 :అనంత జనశక్తి న్యూస్**

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లందరూ తప్పనిసరిగా విచారణకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ పేర్కొన్నారు. కేటాయించిన తేదీన సరైన రికార్డులతో హాజరు కాకపోతే, సంబంధిత వ్యక్తులు ఓటు హక్కును కోల్పోతారన్నారు. నోటీసులు అందుకున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తగిన ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు.

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో భాగంగా 31.07.2026న డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేయడం చేయగా, 31.07.2026 నుండి 30.08.2026 వరకు క్లెయిమ్ మరియు అభ్యంతరాలను దాఖలు చేయడానికి కాలపరిమితి ఉండగా, 31.07.2026 నుండి 28.09.2026 వరకు నోటీసు దశ/క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాల పరిష్కారం చేయడం, 03.10.2026న చివరి ప్రచురణ ఉంటుందని తెలిపారు. ఇందులో ఈఆర్ఓ (ERO) / ఏఈఆర్ఓ (AERO) కార్యాలయం నుండి నోటీసులు అందుకున్న ఓటర్లందరూ తప్పనిసరిగా విచారణకు హాజరు కావాలని, నోటీసు పొందిన ఓటర్లు నిర్ణీత తేదీన తగిన సరైన ఆధారాలు తీసుకొని కార్యాలయానికి వెళ్లి సమర్పించాల్సి ఉంటుందని, లేకపోతే ఓటు హక్కు ఉండదన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్క ఓటర్లు గమనించాలన్నారు.

నోటీసులు అందుకున్న ఓటర్లు తీసుకురావాల్సిన ఏదేని పత్రాల జాబితా.. :

1. కేంద్ర ప్రభుత్వం / రాష్ట్ర ప్రభుత్వం / ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేసే రెగ్యులర్ ఉద్యోగి / పింఛనుదారునికి జారీ చేయబడిన ఏదైనా గుర్తింపు కార్డు /పింఛను చెల్లింపు ఉత్తర్వు.
2. 01.07.1987కు ముందు ప్రభుత్వం / స్థానిక అధికార యంత్రాంగం / బ్యాంకులు /పోస్టాఫీసు / ఎల్ఐసి/ ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా భారతదేశంలో జారీ చేయబడిన ఏదైనా గుర్తింపు కార్డు / ధృవీకరణ పత్రం /డాక్యుమెంట్.
3. సమర్థ అధికార యంత్రాంగం ద్వారా జారీ చేయబడిన జనన ధృవీకరణ పత్రం.
4. పాస్‌పోర్ట్.
5. గుర్తింపు పొందిన బోర్డులు / విశ్వవిద్యాలయాల ద్వారా జారీ చేయబడిన మెట్రిక్యులేషన్/ విద్యా ధృవీకరణ పత్రం.
6. రాష్ట్ర సమర్థ అధికార యంత్రాంగం ద్వారా జారీ చేయబడిన శాశ్వత నివాస ధృవీకరణ పత్రం..
7. అటవీ హక్కుల ధృవీకరణ పత్రం.
8. సమర్థ అధికార యంత్రాంగం ద్వారా జారీ చేయబడిన ఓబిసి / ఎస్.సి/ ఎస్ టి లేదా ఏదైనా కుల ధృవీకరణ పత్రం,
9. జాతీయ పౌర పట్టిక (ఎక్కడైతే ఉందో అక్కడ).
10. ఏదైనా చట్టబద్ధమైన / పరిపాలనా నిబంధనల క్రింద ప్రభుత్వ అధికారులచే నిర్వహించబడే కుటుంబ రిజిస్టర్..
11. ప్రభుత్వం ద్వారా జారీ చేయబడిన ఏదైనా భూమి / ఇంటి కేటాయింపు ధృవీకరణ పత్రం.
12. ఆధార్ కోసం, 09.09.2025 తేదీ గల లేఖ నెం. 23/2025ERS/Vol.II ద్వారా జారీ చేయబడిన కమిషన్ ఆదేశాలు (అనుబంధం. II) వర్తిస్తాయి. ఈ రకమైన పత్రాలను నోటీసులు అందుకున్న ఓటర్లు తీసుకురావచ్చన్నారు

## స్లీపర్ బస్సులు, భారీ వాహనాలపై
# కఠిన నిఘా



**అమరావతి, ఆగస్టు 18:అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్రంలో స్లీపర్ బస్సుల అగ్ని ప్రమాదాల నివారణతో పాటు భారీ వాహనాల ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్లు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. మంగళవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, మహమ్మద్ నజీర్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు.రాష్ట్రంలో ప్రస్తుతం 16 ప్రభుత్వ, 835 ప్రైవేట్ స్లీపర్ బస్సులు నమోదై ఉన్నాయని మంత్రి వెల్లడించారు. స్లీపర్ బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ కేంద్ర మోటారు వాహనాల నిబంధనల్లోని రూల్ 128ను కచ్చితంగా అమలు చేస్తున్నామని చెప్పారు. అగ్ని ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టడంతో పాటు మానవ తప్పిదాలతో జరిగే ప్రమాదాలను అరికట్టేందుకు కఠిన నిబంధనలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఎలాంటి రాజీ లేకుండా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.భారీ వాహనాలకు రిఫ్లెక్టివ్ టేపులు, వెనుక లైట్లు తప్పనిసరిగా ఉండేలా తనిఖీలు నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ల ద్వారా వాహనాల ఫిట్‌నెస్‌ను పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా ఉన్న వాహనాలకే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నామని పేర్కొన్నారు.2025లో రాష్ట్రవ్యాప్తంగా 2,44,604 వాహనాలను తనిఖీ చేయగా, 2026 జూలై వరకు 1,04,543 వాహనాలను తనిఖీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలోని 24 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లలో ఫిట్‌నెస్ పునరుద్ధరణ సమయంలో 30 విజువల్, 19 ఫంక్షనల్ పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. వాహనాల్లో లోపాలు గుర్తిస్తే ఫిట్‌నెస్ ధ్రువపత్రం జారీ చేయడం లేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రమాదాల నివారణే లక్ష్యంగా స్లీపర్ బస్సులు, భారీ వాహనాల తనిఖీలను మరింత పటిష్టం చేస్తున్నామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.

# కోనసీమ కొబ్బరి రైతులకు అండగా ప్రభుత్వం

- దెబ్బతిన్న ప్రతి కొబ్బరి చెట్టు స్థానంలో కొత్త మొక్క నాటడమే లక్ష్యం
- ఒక్కో మొక్కకు రూ.1,000 సాయం..
- కాలువల్లో పూడికతీతతో ఉప్పునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- కొబ్బరి తోటల్లో అంతర పంటలతో రైతులకు అదనపు ఆదాయం
- శాసనసభలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**అమరావతి/వెలగపూడి, ఆగస్ట్ 18:అనంత జనశక్తి న్యూస్**



కోనసీమలో కొబ్బరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు తాత్కాలిక ఉపశమనం కాకుండా శాశ్వత పరిష్కారం చూపే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ, బండారు సత్యానందరావులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, దెబ్బతిన్న ప్రతి కొబ్బరి చెట్టు స్థానంలో కొత్త మొక్క నాటించడంతో పాటు కాలువలు, డ్రెయిన్ల పూడికతీత ద్వారా సమస్య మూలాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు. రాష్ట్రంలో 1.18 లక్షల హెక్టార్లలో కొబ్బరి సాగు జరుగుతుండగా, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోనే 0.36 లక్షల హెక్టార్లలో కొబ్బరి సాగవుతోందని మంత్రి తెలిపారు. కోనసీమ జిల్లాలో సుమారు 10 వేల హెక్టార్లలో కొబ్బరి తోటలు కౌలు రైతుల ద్వారా సాగవుతున్నాయని వివరించారు.గత ఐదేళ్లుగా కాలువల్లో సక్రమంగా పూడికతీత చేపట్టకపోవడంతో సముద్రపు ఉప్పునీరు బ్యాక్ వాటర్ రూపంలో వెనక్కి వచ్చి నేలలో లవణీయత పెరిగిందని మంత్రి పేర్కొన్నారు. దీని ప్రభావంతో పైకి ఆరోగ్యంగా కనిపించే కొబ్బరి చెట్లు కూడా అకస్మాత్తుగా కుంగిపోయి చనిపోతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సమస్యను తాను స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించానని, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ఆయా ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. దెబ్బతిన్న ప్రతి కొబ్బరి మొక్క స్థానంలో కొత్త మొక్క నాటేందుకు ఒక్కో మొక్కకు రూ.1,000 చొప్పున ఆర్థిక సహాయం అందించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశామని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. కొత్త మొక్కలు నాటడంతోనే సమస్య పరిష్కారం కాదని మంత్రి స్పష్టం చేశారు. కాలువలు, డ్రెయిన్లలో పూడిక తొలగించకుండా ఎన్ని మొక్కలు నాటినా, ఎంత పెట్టుబడి పెట్టినా ఆశించిన ఫలితం ఉండదన్నారు. అందుకే సమస్యకు మూలమైన డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మొదటి విడతలో శంకరగుప్తం కాలువ పనులకు నిధులు కేటాయించామని, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇప్పటికే శంకుస్థాపన చేశారని తెలిపారు. ఈ పనులు పూర్తయితే రెండు, మూడు నియోజకవర్గాల్లో ఉప్పునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. మిగిలిన కాలువలను కూడా ఒక సమగ్ర ప్రాజెక్టుగా చేపట్టి శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.కొబ్బరి రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. కొబ్బరి అభివృద్ధి మండలి (CDB) సహకారంతో 201718 నుంచి 202425 వరకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 5,250 హెక్టార్లను పథకం పరిధిలోకి తీసుకొచ్చినట్లు వివరించారు. కొత్త కొబ్బరి తోటల విస్తరణకు హెక్టారుకు రూ.56 వేల సబ్సిడీని రెండేళ్లలో రూ.28 వేల చొప్పున రెండు సమాన వాయిదాల్లో అందిస్తున్నామన్నారు. ఉద్యానవన తోటల విస్తరణకు సంబంధించిన కార్యక్రమం కింద గుంటలు తవ్వడం, మొక్కలు నాటడం, సాగు పరికరాలు తదితరాలకు మూడు సంవత్సరాల పాటు హెక్టారుకు రూ.2,47,950 వరకు ఆర్థిక సహాయం అందించే అవకాశం ఉందన్నారు. కోనసీమలో కొబ్బరి రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక ప్రాంతీయ కొబ్బరి బోర్డు కార్యాలయం ఏర్పాటు చేయాలని 2024లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ కేంద్ర మంత్రికి లేఖ రాశారని మంత్రి గుర్తుచేశారు. కేంద్రంలోని కొబ్బరి బోర్డు సహకారంతో కొత్త ప్లాంటేషన్లను ప్రోత్సహించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.కొబ్బరి రైతుల ఆదాయాన్ని పెంచేందుకు అంతర పంటల సాగును పెద్దఎత్తున ప్రోత్సహిస్తామని అచ్చెన్నాయుడు చెప్పారు. పామాయిల్ తోటల్లో మాదిరిగానే కొబ్బరి తోటల్లో కోకో, అరటి, కూరగాయలు వంటి అంతర పంటలు సాగు చేస్తే రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. ఈ దిశగా వ్యవసాయ, ఉద్యానవన శాఖల ద్వారా రైతులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. కోనసీమలో దెబ్బతిన్న ప్రతి కొబ్బరి చెట్టు స్థానంలో కొత్త మొక్క నాటించాలన్నదే మా లక్ష్యం. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా దీనికి ఒక నిర్దిష్ట కాలపరిమితి పెట్టుకుని పనిచేస్తాం. కొత్త మొక్కలు నాటించడంతో పాటు ఉప్పునీటి సమస్యకు కారణమైన కాలువలు, డ్రెయిన్ల సమస్యను కూడా పరిష్కరించి కొబ్బరి రైతులకు శాశ్వత భరోసా కల్పిస్తాం అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## ఇరిగేషన్ శాఖలో ఇంజనీర్ల ప్రమోషన్ల
# సమస్యలను పరిష్కరించాలి

- అసెంబ్లీ వేదికగా ప్రత్యేక జీరో అవర్‌లో ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చిన పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి

**పుట్టపర్తి : ఆగస్టు 18, అనంత జనశక్తి న్యూస్**



రాష్ట్రవ్యాప్తంగా నీటిపారుదల శాఖలో పనిచేస్తున్న డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల (AEE) ప్రమోషన్లకు సంబంధించి నెలకొన్న సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి కోరారు.విజయవాడ-అమరావతిలో జరుగుతున్న 16వ శాసనసభ సమావేశాల రెండో రోజు మంగళవారం ప్రత్యేక జీరో అవర్‌లో ఎమ్మెల్యే సింధూర రెడ్డి ఈ అంశాన్ని అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు.2010లో జారీ చేసిన జీఓ ఎంఎస్ నం.32 కారణంగా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా నియమితులైన సుమారు 3,000 మంది ఇరిగేషన్ ఇంజనీర్ల ప్రమోషన్ల విషయంలో సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆమె సభ దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా ఏఈఈలుగా విధులు నిర్వహిస్తున్న ఇంజనీర్లు అదే శాఖలో డీఈలుగా పదోన్నతులు పొందే విషయంలో నిబంధనల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఇరిగేషన్ శాఖలో ఎన్నో సంవత్సరాలుగా సేవలందిస్తున్న ఇంజనీర్లకు వారి సీనియారిటీ, అర్హతలకు అనుగుణంగా ప్రమోషన్లు లభించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే తరహా సమస్య తెలంగాణలో పరిష్కారమైనప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో ఇంకా కొనసాగుతుండటం వల్ల ఇంజనీర్లలో ఆందోళన నెలకొందని పేర్కొన్నారు.గత వైసీపీ ప్రభుత్వం 2023లో ఈ అంశంపై ఒక కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని ఎమ్మెల్యే సింధూర రెడ్డి సభ దృష్టికి తీసుకువచ్చారు.ఇరిగేషన్ శాఖలో పనిచేస్తున్న ఏఈఈల ప్రమోషన్లకు సంబంధించిన నిబంధనలను ప్రభుత్వం పునఃపరిశీలించి, న్యాయపరమైన మరియు పరిపాలనా సమస్యలను పరిష్కరించి, అర్హులైన ఇంజనీర్లకు పదోన్నతులు కల్పించేలా తగిన నిర్ణయం తీసుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.ఇంజనీర్లకు న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఈ సమస్యపై సానుకూలంగా స్పందించి, త్వరితగతిన పరిష్కారం చూపుతుందని ఆశిస్తున్నట్లు పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి తెలిపారు.

## మున్సిపల్ కార్యాలయంలో
# ఎస్టీ మహిళపై వేధింపుల ఆరోపణలు



- ఉద్యోగ విధుల్లోనే కాకుండా భద్రతపైనా ఆందోళన..
- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితురాలు.....
- పోలీసుల నుంచి స్పందన లేదని ఆరోపణ....
* మానవ హక్కుల సంఘాలు, కుల సంఘాల నాయకులను ఆశ్రయించిన వనిత....

**పెనుగొండ ఆగష్టు 18, అనంత జనశక్తి న్యూస్ :**

శ్రీ సత్యసాయి జిల్లా పెనుగొండ పురపాలక కార్యాలయంలో మెప్మా విభాగంలో జూనియర్ అసిస్టెంట్ హెచ్ 1గా పనిచేస్తున్న సాకే. వనిత అనే ఎస్టీ మహిళపై వేధింపులు, కుల వివక్ష, బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ ఆమె ఆరోపించారు. కార్యాలయంలో తనను మానసికంగా వేధించడంతో పాటు, తనను భయభ్రాంతులకు గురిచేసే విధంగా వ్యవహరిస్తున్నారని వనిత ఆవేదన వ్యక్తం చేశారు.

వనిత తెలిపిన వివరాల ప్రకారం.. మెప్మా విభాగానికి చెందిన సీవో సాధిక, కంప్యూటర్ ఆపరేటర్ నరేష్ తదితరులు తనను చులకనగా చూస్తూ, హేళనగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. కార్యాలయంలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని తనపైకి రెచ్చగొట్టి బెదిరింపులకు పాల్పడేలా చేస్తున్నారని పేర్కొన్నారు. తన కులాన్ని ఉద్దేశించి వివక్ష చూపుతూ మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు.

అలాగే కార్యాలయ విధులు ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో కార్యాలయం పక్కన ఉన్న గేటు వద్ద కట్టెలతో కూర్చొని భయపెట్టేలా వ్యవహరించారని వనిత ఆరోపించారు. కంప్యూటర్ ఆపరేటర్ నరేష్ తన కుమార్తె పాఠశాలలో ఉందా? బయటకు వెళ్తుందా? అంటూ ప్రతిరోజూ పదేపదే ప్రశ్నిస్తూ భయాందోళనలకు గురిచేస్తున్నారని తెలిపారు.

ఈ పరిణామాలతో తనకు, తన కుమార్తెకు ప్రాణహాని ఉందని పేర్కొంటూ శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీకి వనిత ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎస్పీ కార్యాలయం నుంచి ఫిర్యాదును పెనుగొండ పోలీస్ స్టేషన్‌కు రిఫర్ చేసినప్పటికీ, అక్కడ తన ఫిర్యాదుపై తగిన చర్యలు తీసుకోలేదని ఆమె ఆరోపించారు.

తనకు, తన కుమార్తెకు రక్షణ కల్పించాలని కోరుతూ పెనుగొండ ఎస్ఐను సంప్రదించినా స్పందన లేకపోయిందని వనిత వాపోయారు. ఫిర్యాదు తీసుకోవాలని ఎంతగా కోరినా నిర్లక్ష్యంగా వ్యవహరించి, దురుసుగా మాట్లాడారని ఆరోపించారు. దీంతో తాను తీవ్ర భయాందోళనలకు గురవుతున్నానని తెలిపారు.

**న్యాయం చేయాలని వేడుకోలు....**

తన సమస్యపై ప్రభుత్వ అధికారులు, పోలీసులు తక్షణమే స్పందించి విచారణ జరిపించాలని వనిత కోరుతున్నారు. తనకు, తన కుమార్తెకు రక్షణ కల్పించడంతో పాటు, తనపై వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పరిస్థితుల్లో దిక్కుతోచని స్థితికి చేరుకున్న వనిత పీపుల్స్ హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు, ఎస్టీ సంఘాల నాయకులను సంప్రదించి తనకు న్యాయం చేయాలని వేడుకున్నట్లు తెలిపారు. అధికారుల విచారణలో వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది. బాధితురాలు చేసిన ఆరోపణలపై సంబంధిత అధికారులు, పోలీసులు అధికారికంగా స్పందించాల్సి ఉంది.

## బాల్ బ్యాడ్మింటన్ లో
## రాష్ట్రస్థాయికి విద్యార్థులు ఎంపిక.

- బాల్ బ్యాడ్మింటన్లో గోట్లూరు ఉన్నత పాఠశాల విద్యార్థుల ఎంపిక ..
- హెడ్మాస్టర్ జగన్నాథం.

**ధర్మవరం ఆగస్టు 18, అనంత జనశక్తి న్యూస్:**

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ లో ధర్మవరం మండల పరిధిలోని గొట్లూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం జరిగిందని హెడ్మాస్టర్ జగన్నాథం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఇటీవల అనంతపురం జూనియర్ కాలేజ్ గ్రౌండ్స్ నందు జరిగిన బాల్ బ్యాడ్మింటన్ అండర్ 16 అండర్ 19 బాల బాలికల ఎంపిక పోటీలలో గోట్లూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్ 16 విభాగంలో విజయ్ కుమార్ అండర్ 16 బాలికల విభాగంలో కమలాక్షి అండర్ 19 బాలుర విభాగంలో వినయ్ కుమార్ ఎంపికయ్యారు అని తెలిపారు. వీరు వచ్చే నెలలో జరిగే రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారు అని తెలిపారు. వీరు ఎంపిక పట్ల పాఠశాల హెడ్మాస్టర్ జగన్నాథం, పిడి రమేష్ బాబు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు.



# చరిత్రలో బీసీలు మరిచిపోలేని రోజు

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పనపై హర్షం
- గ్రామీణ ప్రాంతాల్లో 34 శాతం, పట్టణ ప్రాంతాల్లో 33.33 శాతం అమలు
- సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కు, మంత్రి నారా లోకేశ్ కు ధన్యవాదాలు
- బీసీలకిచ్చిన మరో హామీని నిలబెట్టుకున్న కూటమి
- రిజర్వేషన్లతో బీసీలకు మరిన్ని పదవులు
- బీసీలపై కక్షగట్టిన జగన్
- బీసీ రిజర్వేషన్లకు 10 శాతం కోత
- వైసీపీ నిర్వాకంతో 16,800 పదవులకు దూరమైన బీసీలు
- బీసీలకు రాజకీయ గుర్తింపునిచ్చిన టీడీపీ
- సీఎం చంద్రబాబు రాకతో మరోసారి మంచిరోజులు ప్రారంభం

* సంక్షేమ దన్నుతో బీసీలకు ఆర్థిక భరోసా : మంత్రి సవిత

**అమరావతి ఆగస్టు 18, అనంత జనశక్తి న్యూస్**

'చరిత్రలో ఈరోజు బీసీలు మరిచిపోలేని రోజు... స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది... గ్రామీణ ప్రాంతాల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు, పట్టణ ప్రాంతాల్లో 33.33 శాతం అమలు కాబోతున్నాయి...' అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత సంతోషం వ్యక్తంచేశారు. బీసీలకు ఎన్నికల ముందు ఇచ్చిన మరో హామీని నిలబెట్టుకున్నందుకు సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు, మంత్రి నారా లోకేశ్ కు ధన్యవాదాలు తెలియజేశారు స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు జగన్ ప్రభుత్వం కోత పెట్టడం వల్ల 16 వేలకు పైగా పదవులకు బీసీలు దూరమయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. వర్షాకాల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంగళవారం శాసనసభలో స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల బిల్లు చర్చ సందర్భంగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మాత్యులు ఎస్.సవిత మాట్లాడారు. బీసీల పక్షపాత్రి ప్రభుత్వం తమదని మరోసారి రుజువైందన్నారు. బీసీలకు ఎన్నికల్లో ఇచ్చిన మరో హామీని నిలబెట్టుకుంటున్నామన్నారు. స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పించాలని నిర్ణయించామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 34 శాతం, పట్టణ ప్రాంతాల్లో 33.33 శాతం మేర రిజర్వేషన్లు అమలు చేయబోతున్నామన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పనపై మంత్రిమండలిలో ఆమోదించామన్నారు. అసెంబ్లీలో కూడా ఆమోదిస్తున్నామన్నారు. బీసీల అభ్యున్నతి కోసం ఆనాడు అన్న ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు బీసీలకు మొట్టమొదటిసారిగా 1994లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేశారన్నారు. ఇప్పుడు మరోసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్ల కల్పనతో బీసీలకు రాజ్యాధికారంలో అవకాశం కలుగుతుందన్నారు. తమను తాము పాలించుకునే అవకాశం కలుగుతుందని, చరిత్రలో నేడు మరిచిపోలేని రోజు అని మంత్రి సవిత ఆనందం వ్యక్తం చేశారు.



**బీసీలను ప్రోత్సహించిన టీడీపీ**

బీసీలను రాజకీయంగా ప్రోత్సహించిన పార్టీ టీడీపీయేనని మంత్రి సవిత తెలిపారు. నేడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఉన్న కీలకమైన బీసీ నాయకులందరూ టీడీపీ ప్రోత్సహించనవారేనన్నారు. కింజరాపు ఎర్రన్నాయుడు, దేవేందర్ గౌడ్, కేఈ కృష్ణమూర్తి, యనమల రామకృష్ణుడు, తన తండ్రి ఎస్.రామచంద్రారెడ్డి వంటి ఎందరో బీసీ నేతలు అన్న ఎన్టీఆర్, సీఎం చంద్రబాబు ప్రోత్సహంతో రాజకీయాల్లో తమదైన ముద్ర వేశారని మంత్రి సవిత తెలిపారు.

**బీసీ రిజర్వేషన్లకు జగన్ కోత**

సీఎం చంద్రబాబు అధికారంలో ఉన్న ప్రతిసారీ బీసీలకు మేలు చేసేలా పాలన సాగిస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. బీసీలు ఎప్పుడూ టీడీపీ పక్షపాతమేనని జగన్ కక్షగట్టారన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లలో కోత పెట్టి 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించిందన్నారు. రిజర్వేషన్లలో కోత వల్ల 16,800 పదవులకు బీసీలు దూరమయ్యారన్నారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని మంత్రి నారా లోకేశ్ తన పాదయాత్రలో గుర్తించారన్నారు. అధికారంలోకి రాగానే బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఆనాడే హామీ ఇచ్చారన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో సీఎం చంద్రబాబునాయుడు సైతం బీసీలకు రిజర్వేషన్లను పునరుద్ధరిస్తామని భరోసా ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్ల కల్పిస్తూ బిల్లును రూపొందించామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయనున్నామన్నారు. బీసీలకు మరోసారి రాజకీయ పట్టం కల్పిస్తున్న సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు, మంత్రి నారా లోకేశ్ కు మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు.

**కూటమి రాకతో బీసీలకు సంక్షేమ దన్ను**

సీఎం చంద్రబాబు రాకతో బీసీలకు మరోసారి మంచిరోజులు వచ్చాయని మంత్రి సవిత తెలిపారు. సంక్షేమ పథకాలు అమలుచేస్తూ, బీసీలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత బీసీలకు మొదటి బడ్జెట్ లో రూ.39 వేల కోట్లు, రెండో బడ్జెట్ లో రూ.47 వేలు కోట్లు, మూడో బడ్జెట్ లో రూ.51 వేల కోట్లు కేటాయించామన్నారు. బీసీల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శమన్నారు. చట్టసభలలో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడానికి అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రప్రభుత్వ తదుపరి చర్యకు పంపించామని గుర్తు చేశారు. నామినేటెడ్ పోస్టుల భర్తీలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామన్నారు. గీత కార్మికులకు మద్యంషాపులు, బార్లు కేటాయింపుల్లోనూ 10 శాతం మేర కేటాయించామన్నారు. మద్యం షాపుల లైసెన్స్ లో 50 శాతం రాయితీ ఇచ్చామన్నారు. వడ్డెరలకు క్వారీల కేటాయింపుల్లో 33 శాతం మేర రిజర్వేషన్లు, 50 శాతం మేర సినరేజీ మినహాయింపు ఇచ్చామన్నారు. చేపల వేట నిషేధకాలంలో మత్స్యకారులకు ఆర్థిక సాయం రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచామన్నారు. 62,541 నేతన్నలకు 200లు, 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. 85,940 మంది నేతన్నలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఇస్తున్నామన్నారు. 71,536 మంది చేనేతలకు నేతన్నల సేవలో పథకం వర్తింప జేశామన్నారు. ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా చేనేతలకు మేలు కలుగజేయాలన్న సంకల్పంతో నేతన్నల సేవలో పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కింద 202426 మధ్య 15.67 లక్షల బీసీ లబ్ధిదారులకు రూ.15,588.64 కోట్లు చెల్లించామన్నారు. తల్లికి వందనం పథకం కింద రూ.15 వేల చొప్పున 10.46 లక్షల మంది బీసీ విద్యార్థులకు రూ.1,360.61 కోట్లు అందజేశామన్నారు. ఆటో డ్రైవర్ సేవలో పథకంలో భాగంగా 40,610 మంది ఆటో డ్రైవర్లకు రూ.60.91 కోట్లు కేటాయించామన్నారు. స్త్రీ శక్తి పథకం వల్ల ఆటో డ్రైవర్లకు నష్టం కలుగకూడదన్న ఉద్దేశంతో ఈ పథకాన్ని సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారన్నారు. పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకునే బీసీలకు కూటమి ప్రభుత్వం అదనంగా రూ. 20 వేలు రాయితీ అందజేస్తోందన్నారు. తల్లికివందనం, ఫ్రీ బస్, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, ఉచిత ఇసుక, పెన్షన్లు ఇలా ప్రభుత్వ పథకాలన్నింటిలోనూ ఎక్కువగా లబ్ధి పొందేది బీసీలేనని మంత్రి సవిత తెలిపారు.

# వసతులు కరువు... ఆరుబయటే చదువులు..!!

- శాంతినగర్ ఉన్నత పాఠశాల దయనీయ స్థితి.
- పాఠశాలల్లో దాహం... మూలన పడిన ఆక్వా ప్లాంట్లు..
- చదువుకు గూడు లేదు... మధ్యాహ్నం భోజనానికి వంట గది లేదు.
- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం..
  . కనీస వసతులు కరువు.
- వంటశాలకు సొంత భవనం కరువు... అసంపూర్తి భవనమే దిక్కు.
- విద్యార్థుల సంఖ్య గణనీయం... సౌకర్యాలు మాత్రం శూన్యం.
- పాఠశాలకు ప్రహరీ గోడ, గేట్లు లేవు... దొంగలకు మాత్రం దారులు బహుళం.

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి,**
**ఆగస్టు 18, అనంత జనశక్తి న్యూస్:**





**శాంతినగర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కరువై దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. త్రాగునీటి సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతుండగా, నిర్మాణ భవనమే వంటగదిగా మారింది. మరోవైపు ఆరుబయటే చదువులు కొనసాగుతున్నాయి. విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన ఆక్వా ప్లాంట్లు పనిచేయని స్థితిలో ఉండడంతో త్రాగునీటి సమస్య మరింత తీవ్రమైంది. పాఠశాలల్లో భద్రతా చర్యలు కూడా లోపించడంతో విద్యార్థుల భద్రతపై ఆందోళన వ్యక్తం అవుతోంది. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన పాఠశాల దయనీయ స్థితికి చేరుకోవడం పై అధికారులు తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది.**

ధర్మవరం పట్టణంలోని శాంతినగర్ ఉన్నత పాఠశాల దయనీయ పరిస్థితులకు అద్దం పడుతోంది. విద్యార్థులకు అందాల్సిన కనీస మౌలిక వసతులు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా తాగునీటి సౌకర్యం లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆక్వా ప్లాంట్లు పనిచేయకపోవడంతో నీటి సమస్య మరింత తీవ్రంగా మారింది.

పాఠశాలలో వంటగదికి ప్రత్యేక వసతులు లేక నిర్మాణంలో ఉన్న భవనాన్నే వంటగదిగా వినియోగిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణంలో మధ్యాహ్న భోజనం అందించాల్సి ఉండగా ఇలాంటి పరిస్థితులు నెలకొనడం ఆందోళన కలిగిస్తోంది.

**ఆరుబయటే చదువులు.....**

పాఠశాలలో సరైన తరగతి గదులు, అవసరమైన మౌలిక వసతులు లేక కొన్ని సందర్భాల్లో విద్యార్థులు ఆరుబయటే చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఎండ, వర్షం వంటి ప్రతికూల పరిస్థితుల్లో విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగే అవకాశం ఉంది. విద్యార్థులకు అనుకూలమైన అభ్యాస వాతావరణం కల్పించాల్సిన పాఠశాలలో ఇలాంటి దుస్థితి నెలకొనడంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల భద్రతకు అవసరమైన చర్యలు కూడా పూర్తిస్థాయిలో కనిపించకపోవడం ప్రశ్నార్థకంగా మారింది. విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు వచ్చే నేపథ్యంలో భద్రతా ప్రమాణాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**నీటి కోసం విద్యార్థుల అవస్థలు... నిధులు ఉన్న ప్రయోజనం శూన్యం...!**

శాంతినగర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల దాహం తీరని దుస్థితి నెలకొంది. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఏర్పాటుచేసిన ఆక్వా ప్లాట్లు మూలన పడటంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది. వేల రూపాయలు వెచ్చించి ఏర్పాటుచేసిన పరికరాలు పని చేయకపోవడం, వాటి నిర్వహణపై పట్టింపు లేకపోవడం అధికారుల పర్యవేక్షణ తీరుకు అద్దం పడుతోంది.

**బోరు నీరు ఉన్న... ఆక్వా ప్లాంట్లు పనిచేయలేదు.**

పాఠశాల ప్రాంగణంలో ఆక్వా ప్లాంట్లు ఉన్నప్పటికీ విద్యార్థుల దాహం మాత్రం తీరడం లేదు. బోరు నీరు ఉన్నప్పటికీ పని చేయని యంత్రాలు అలంకారప్రాయంగా మారడంతో విద్యార్థులు త్రాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. కనీసం మంచినీటి వసతి కల్పించలేని పరిస్థితి నెలకొనడం పాఠశాల నిర్వహణపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. ఆక్వా ప్లాంట్లను ఏర్పాటు చేయడమే బాధ్యతగా భావించి, వాటి నిర్వహణను గాలికొదిలేస్తే ప్రభుత్వ నిధులు వృథా కావడమే కాకుండా విద్యార్థులకు ఉపయోగం లేకుండా పోతోంది. ప్లాంట్లు ఎందుకు పనిచేయడం లేదు? నిర్వహణ బాధ్యత ఎవరిది? అనే ప్రశ్నలు తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతున్నాయి. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సురక్షితమైన త్రాగునీరు అందించడం కనీస బాధ్యత. నీటి సౌకర్యం సక్రమంగా లేకపోతే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. సమస్యను గుర్తించి వెంటనే ఆక్వా ప్లాంట్లను మరమ్మత్తు చేసి, నిరంతర తాగునీటి సౌకర్యం అందుబాటులోకి తీసుకురావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థులకు దాహం... మూలన ప్లాంట్లు... అధికారుల నిర్లక్ష్యం మాత్రం ఎప్పుడు తీరుతుంది? అనే ప్రశ్న శాంతినగర్ పాఠశాల పరిస్థితిని చూస్తున్న ప్రతి ఒక్కరిలో మెదులుతోంది.

**చదువుకు గూడు లేదు... మధ్యాహ్నం భోజనానికి వంటగది లేదు.**

ధర్మవరం పట్టణంలోని శాంతినగర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారింది. విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణం లో చదువుకోవాల్సిన తరగతి గదులు, అవసరమైన మౌలిక వసతులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఆరుబయటే చదువులు సాగించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు విద్యార్థులకు ప్రతిరోజు అందించే మధ్యాహ్నం భోజనం సిద్ధం చేసేందుకు ప్రత్యేక వంటగది లేక నిర్మాణంలో ఉన్న భవనాన్ని వంటకు వినియోగిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. వంటగదికి అవసరమైన సురక్షిత, పరిశుభ్రమైన వసతులు లేకపోవడం విద్యార్థుల భద్రత, ఆరోగ్యంపై ఆందోళన కలిగిస్తోంది. ఇక విద్యార్థుల దాహం తీర్చేందుకు ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంట్ల పని చేయక మూలన పడటంతో తాగునీటి సమస్య కూడా తీవ్రంగా వేధిస్తోంది. చదువుకునే గదులు సరిగ్గా లేవు... తాగేందుకు నీరు లేదు... మధ్యాహ్న భోజనం వండేందుకు ప్రత్యేక వంటగది లేదు... విద్యార్థుల భద్రతకు తగిన వసతులు లేవు... ఇలా ఒక్కొక్కటిగా సమస్యలు చుట్టుముట్టడంతో పాఠశాల దుస్థితి బహిర్గతమవుతోంది. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతున్న, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తుండటం గమనార్హం. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే ముందుగా వారికి సురక్షితమైన తరగతి గదులు, స్వచ్ఛమైన త్రాగునీరు, పరిశుభ్రమైన వంటగది, భద్రమైన పాఠశాల వాతావరణం కల్పించాలి. లేనిపక్షంలో పాఠశాల భవనాల అభివృద్ధి పేరుతో చేస్తున్న ప్రకటనలు కాగితాలకే పరిమితమవుతాయి. విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేయాల్సిన విద్యాలయంలోనే కనీస వసతులు కరువై, పిల్లలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని అధికారులు ఇకనైనా పట్టించుకోవాలి, శాంతినగర్ ఉన్నత పాఠశాల పరిస్థితిపై క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టి సమస్యలను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలి. చదువుకు గూడు లేదు... అన్నం వండేందుకు వంటగది లేక... దాహం తీర్చేందుకు పనిచేసే నీటి వసతి లేకపోవడం విద్యార్థులపై నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారకూడదు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన ఈ సమస్యపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, శాంతినగర్ పాఠశాల కు కనీస మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు మెరుగైన అభ్యస వాతావరణాన్ని అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ప్రహరీ గోడకు దిక్కులేదు... గేటుకు భద్రత లేదు... దొంగలకు మాత్రం దారులు బహుళం.**

పాఠశాల ప్రాంగణానికి రక్షణగా ఉండాల్సిన ప్రహరీ గోడలు, గేట్లు భద్రతకు నోచుకోకపోవడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఆవరణ చుట్టూ రక్షణ కవచం లేకపోవడంతో పాఠశాల ప్రాంగణంలోకి ఎవరు పడితే వారు ప్రవేశించే పరిస్థితి నెలకొంది. రాత్రి వేళల్లో అయితే పాఠశాల ప్రాంగణం దొంగలకు అనుకూలమైన ప్రాంతంగా మారే ప్రమాదం కనిపిస్తోంది. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన చోటే రక్షణ వ్యవస్థలు బలహీనంగా ఉండటం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ప్రహరీ గోడ లేకపోవడం, గేటు పటిష్టంగా లేకపోవడంతో పాఠశాల ఆస్తులు, పరికరాల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి పటిష్టమైన ప్రహరీ గోడ, భద్రమైన గేటును ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది. విద్యార్థులు చదువుకునే ప్రదేశానికి రక్షణ కల్పించడంలో జాప్యం చేస్తే చిన్న నిర్లక్ష్యమే పెద్ద సమస్యకు దారి తీసే అవకాశం ఉంది. విద్యార్థుల భద్రతను గాలికొదిలేయడం ఎంతవరకు సమంజసం....? మీదే ఆలోచించండి....!






**వంటశాలకు సొంత భవనం కరువు... అసంపూర్తి భవనమే దిక్కు.**

**శాంతినగర్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు కనీస వసతులు లేక దయనీయ పరిస్థితి నెలకొంది. విద్యార్థులకు భోజనం సిద్ధం చేసేందుకు ప్రత్యేక వంటశాల భవనం లేకపోవడంతో అసంపూర్తిగా ఉన్న నిర్మాణ భవనాన్ని వంటకు వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వంటకు అనువైన సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణం లేకపోవడం విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ఆందోళన కలిగిస్తోంది. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించడం ప్రభుత్వ బాధ్యత కాగా, భోజనం సిద్ధం చేసే వంటశాలకే సరైన భవనం లేకపోవడం అధికారుల పర్యవేక్షణ పై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. అసంపూర్తి భవనంలోనే వంట నిర్వహించడం ఎంతవరకు సురక్షితం అన్నది అధికారులు ఆలోచించాల్సిన అవసరం ఉంది. వంటశాలకు ప్రత్యేక భవనం నిర్మించి అవసరమైన నీరు, భద్రతా సదుపాయాలు కల్పించాల్సి ఉంది. విద్యార్థుల ఆరోగ్యంతో ముడిపడిన మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్లక్ష్యం చేయకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థులకు అన్నం పెట్టే వంటశాలలకే దిక్కులేని పరిస్థితి ఇకనైనా మారాల్సిన అవసరం ఉంది.**







# పెనుకొండ బసవన్న బావిలో జలనిధి శాసనం

**- విశ్లేషించిన మైనాస్వామి.....**

**పెనుకొండ; ఆగస్టు 18 అనంత జన శక్తి న్యూస్.**



విజయనగర సామ్రాజ్య ద్వితీయ రాజధానిగా చారిత్రక ప్రాధాన్యత కలిగిన పెనుకొండకోట పరిధిలోని కాశీవిశ్వేశ్వర ఆలయానికి ఎదురుగా ఉన్న 'బసవన్న బావి' (మెట్లబావికోనేరు) లోపలి రాతిపై అరుదైన 'శ్రీత్రయంబక శరణు' సంస్కృత ఏకవాక్యాన్ని జలనిధి శాసనంగా చరిత్రకారుడు మైనాస్వామి విశ్లేషించారు. విజయనగర సామ్రాజ్య చక్రవర్తులైన శ్రీక్రిష్ణదేవరాయలు, అచ్యుతదేవ రాయల పాలనాకాలపు జలసంస్కృతి, నిర్మాణనైపుణ్యం మరియు శైవ సంప్రదాయాలకు ఈ శాసనం బలమైన ఆధారంగా నిలుస్తోంది. బావి లోపలి రాతి నిర్మాణంపై 'శ్రీత్రయంబక శరణు' అని రెండు వరుసలలో కన్నడ లిపిలో ఏకవాక్య శాసనం చెక్కబడి ఉంది. శాసనం చివరలో అక్షరాల పక్కన సూర్యుడు, అర్ధచంద్రుడు మరియు వీటి మధ్య అధోముఖంగా (కిందికి తిరగేసి) ఉన్న చిన్నఖడ్గం రాజముద్రగా చెక్కబడి ఉన్నాయి. ఆ పక్కనే చిన్న శివలింగాన్ని శిల్పి సుందరంగా మలిచారని చరిత్రకారుడు మంగళవారంనాడు పాత్రికేయులకు వివరించారు. శ్రీక్రిష్ణదేవరాయలు మరియు అచ్యుతదేవరాయల హయాంలో కోనేరులు, మెట్లబావులు నిర్మించేటప్పుడు,ఆ నీరు ఎప్పటికీ ఎండిపోకుండా, తాగునీరు ఉపయోగించే ప్రజలకు ఆయురారోగ్యాలు కలగాలని మహా మృత్యుంజయుడైన త్రయంబకేశ్వరుని శరణు వేడుతూ ఇలాంటి మంగళవాక్యాలను పొందుపరిచేవారని మైనాస్వామి తెలిపారు. శాసనాల్లో సాధారణంగా పైకి ఉండే ఖడ్గం యుద్ధానికి సంకేతమైతే, ఇక్కడ కిందికి దించబడిన ఖడ్గం రక్షణ,శాంతి మరియు ఆత్మసమర్పణకు ప్రతీకగా నిలుస్తోంది.రాజశక్తి కంటే దైవశక్తి మిన్న అని భావిస్తూ, ఆ త్రయంబకుని పాదాలచెంత ఖడ్గాన్ని ఉంచి శరణాగతి కోరడాన్ని ఇది సూచిస్తుంది. 'ఆచంద్రార్కం'గా (సూర్యచంద్రులు ఉన్నంతకాలం) ఈ జలాశయం అక్షయమైన జలనిధితో వర్ధిల్లాలని, విజయనగర రాజవంశం మరియు దైవిక రక్షణ ఈ ధర్మకార్యానికి తోడుగా ఉంటుందని ఈ ముద్ర స్పష్టం చేస్తోంది. కాశీ విశ్వేశ్వర ఆలయం, బసవన్న బావి పేరు మరియు 'శ్రీత్రయంబక శరణు' శాసనం కలసి పెనుకొండలోని శైవ సాంప్రదాయ వైభవానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. విజయనగర పాలకుల జలసంరక్షణ దృక్పథాన్ని, వారి కళాపోషణను తెలిపే ఇలాంటి ప్రాచీన దిగుడు బావులను, శాసనాలను రక్షించి భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మైనాస్వామి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

దైవిక శిల్పాలు:
బసవన్న బావిగా పిలవబడుతున్న సుందరమైన మెట్ల బావిలో తూర్పుముఖంగా గోడపై వివిధ దైవిక శిల్పాలు సుందరంగా ఉన్నాయని చరిత్రకారుడు చెప్పారు. పైభాగంలో నటరాజస్వామి, దిగువనే వినాయకుడు ఆ కింద గజలక్ష్మి అట్టడుగున శివునివాహనమైన నంది శిల్పాలు సుమనోహరంగా విజయనగర శిల్పులు చెక్కారని, మెట్లబావి ఒక ఆలయాన్ని తలపిస్తున్నదని మైనాస్వామి తెలియజేశారు.

# క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన

**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 18**

**అనంత జన శక్తి న్యూస్.**



క్షయ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులు డాక్టర్ సురేష్, ప్రభాకర్ తెలిపారు. పుట్టపర్తి మండల పరిధిలోని వెంగళమ్మ చెరువు గ్రామంలో
టీబీ ముక్త్ భారత్ 2.0 లో భాగంగా జిల్లా వైద్య శాఖ అధికారుల ఆదేశాల మేరకు హ్యాండ్ హెల్డ్ ఎక్స్రే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎక్స్ రే తీసినట్లు తెలిపారు.ఇది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా రిపోర్టును రెండు నిమిషాలలోనే తెలియజేయబడునని దీని ముఖ్య ఉద్దేశం త్వరితగతిన టీబీ నిర్ధారణ చేయడానికి నేరుగా ప్రజల వద్దకే వెళ్లి ఎక్స్రే పరీక్ష చేసి వెంటనే రిపోర్టు ను తెలియజేయవచ్చునని టీబీ ముఖ్య లక్షణాలు రెండు వారాల మించి దగ్గు ఉన్న దగ్గినప్పుడు గళ్ళతోపాటు రక్తం పడడం సాయంత్రం పూట తరచుగా జ్వరం రావడం చెమటలు పట్టడం ఆకలి మందగించడం బరువు తగ్గడం చక్కెర వ్యాధిగ్రస్తులకు 60 ఏళ్ల పైబడిన వారికి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ధూమపానం పొగాకు సేవించు వారికి ఇటుక బట్టి లో పనిచేసే వారికి పరిశ్రమల్లో పనిచేసే వారికి కంకర పని చేయు వారికి ఎక్కువ టీబీ ఉండవచ్చని ఇలాంటివారు ప్రభుత్వ ఆసుపత్రి నందు ఉచితంగా గళ్ళపరీక్ష చేయించుకుని టీబీ నిర్ధారణ అయినచో ఆరు నెలల చికిత్స ఉచితంగా అందజేస్తారు అలాగే కేంద్ర ప్రభుత్వం ఈ రోగం ఉన్న వాళ్లకు నెలకు వెయ్యి చొప్పున ఆరు నెలల చికిత్స కాలానికి ఆరువేల, అందించనున్నారని, ఇది వారి పౌష్టికాహారం కొరకు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా టీబి యూనిట్ సూపర్వైజర్ అబిద్ భాష, ఎం పి హెచ్ రమణ, సిహెచ్ఓ హరిత, గౌతమి ఏఎన్ఎములు లలితమ్మ సుకన్య ఆశాలు కృష్ణవేణి మహేశ్వరి ఎం శివమ్మ సి సివమ్మా, తదితరులు పాల్గొన్నారు.

## సుగాలి పార్వతికి వీల్ చైర్ పాదయాత్రకు

# రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలి

**- వైసీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి**

**పుట్టపర్తి రూరల్ ఆగస్టు 18**

**అనంత జన శక్తి న్యూస్.**

సుగాలి ప్రీతి తల్లి సుగాలి పార్వతి చేపట్టనున్న వీల్ చైర్ పాదయాత్రకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అనుమతి ఇవ్వాలని వైసీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ నాయక్ డిమాండ్ చేశారు. పాదయాత్రకు అనుమతి కోరుతూ సుగాలి పార్వతి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినప్పటికీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతిని తిరస్కరించడంపై ఆయన తీవ్రంగా స్పందించారు.
ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ సుగాలి పార్వతికి తన నిరసనను శాంతియుతంగా వ్యక్తం చేసే ప్రజాస్వామ్య హక్కు ఉందన్నారు. వీల్ చైర్ పాదయాత్రకు అనుమతి నిరాకరించడం గిరిజనుల గొంతును అణచివేసే చర్యగా భావించాల్సి వస్తుందని అన్నారు. సుగాలి ప్రీతి ఘటనకు సంబంధించి బాధిత కుటుంబానికి న్యాయం, భరోసా కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు.
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గిరిజనులను అణగదొక్కే విధంగా వ్యవహరించరాదని, గిరిజనుల హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తే సహించేది లేదని శ్రీనివాస్ నాయక్ తెలిపారు. ప్రభుత్వం వెంటనే పునరాలోచించి సుగాలి పార్వతి వీల్ చైర్ పాదయాత్రకు అనుమతి ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళనలను మరింత బలోపేతం చేసి ఉధృతం చేస్తామని వైసీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ నాయక్ స్పష్టం చేశారు.



## పేకాట స్థావరంపై పోలీసులు దాడులు.. ఎస్సై సుమతి..

**గాండ్లపెంట, ఆగస్ట్,18, అనంత జనశక్తి న్యూస్,**

మండల పరిధిలోని కటారుపల్లి క్రాస్ గ్రామ పొలాల్లో పేకాట స్థావరంపై పోలీసులు మంగళవారం మెరుపు దాడి నిర్వహించారు. పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో ఎస్సై సుమతి తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని దాడి చేపట్టారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారు పోలీసులు పట్టుకున్న ముగ్గురు వ్యక్తుల వద్ద నుంచి రూ.5,800 నగదు, స్వాధీనం చేసుకున్నారు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.
ఈ సందర్భంగా ఎస్సై సుమతి మాట్లాడుతూ మండల పరిధిలో పేకాట, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతరం నిఘా కొనసాగుతుందని హెచ్చరించారు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..



## ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు..

**-వన్టౌన్ సీఐ రెడ్డప్ప**

**ధర్మవరం ఆగస్టు 18, అనంత జనశక్తి న్యూస్:**

పట్టణంలో అంజుమాన్ సర్కిల్ పిఆర్టి సర్కిల్ కళాజ్యోతి సర్కిల్ యందు ట్రాఫిక్కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని, అధిక మొత్తములో జరిమానా విధించబడును పోలీస్ స్టేషన్ సిఐ రెడ్డప్ప తెలిపారు. ఈ సందర్భంగా వారు పట్టణంలో పలుచోట్ల షాపుల ముందు ఉంచిన ద్విచక్ర వాహనాలు, నేమ్ బోర్డు లేని వాహనాలు, అనవసరంగా పలుచోట్ల పార్కింగ్ చేసిన వాహనాలను గుర్తించి వారికి జరిమానాలు విధించారు. ట్రాఫిక్కు అంతరాయం కలిగించే చోట తప్పకుండా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కావున షాపుల ముందు ఎవరు కూడా ద్విచక్ర వాహనాలను ఉంచరాదని వారు తెలిపారు. కావున వాహనదారులు పోలీసులతో సహకరించాలని తెలిపారు.



## మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు

**రాప్తాడు ఆగస్టు 18 అనంత జనశక్తి న్యూస్**

మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, వారికి వాహనాలు అప్పగిస్తే తల్లిదండ్రులు, వాహన యజమానులపై చట్టపరమైన చర్యలు తప్పవని రాప్తాడు సీఐ వెంకటేష్ హెచ్చరించారు. అనంతపురం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం రాప్తాడు పోలీసుల ఆధ్వర్యంలో జాతీయ రహదారి NH44 పై ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనం నడుపుతున్న ఓ మైనర్ బాలుడిని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బాలుడి తల్లిదండ్రులను పోలీస్స్టేషన్కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల అతివేగం, ప్రమాదకరంగా ఓవర్టేక్ చేయడం, రహదారిని సరిగా గమనించకుండా దాటడం వంటి కారణాలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని సీఐ వెంకటేష్ తెలిపారు. పిల్లల భద్రతతో పాటు ఇతర వాహనదారుల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడే అవకాశం ఉన్నందున తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇకపై మైనర్లకు వాహనాలు అప్పగించినట్లు గుర్తిస్తే తల్లిదండ్రులు, వాహన యజమానులపై కేసులు నమోదు చేయడానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు. జాతీయ రహదారిపై ప్రయాణించే ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.
ముఖ్యంగా జంక్షన్ల వద్ద సిగ్నల్స్ను గౌరవిస్తూ వాహనాలను నిదానంగా నడపాలని, రహదారి భద్రతా నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సీఐ కోరారు. పిల్లల భద్రతను దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించి మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా చూడాలని పోలీసులు సూచించారు.



## పశుగ్రాస అభివృద్ధికి మరో ముందడుగు



**- గొట్లూరు చెరువులో సామూహిక పశుగ్రాస క్షేత్రం పెంపకం....**

**ధర్మవరం ఆగష్టు 18 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పశుసంపద అభివృద్ధి, రైతుల సంక్షేమమే లక్ష్యంగా పశుగ్రాస అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచనల మేరకు ధర్మవరం నియోజకవర్గ ఇన్చార్జ్ హరీశ్బాబుతో కలిసి వీబీజీ రామ్ పథకం కింద గొట్లూరు చెరువులో సామూహిక పశుగ్రాస క్షేత్ర పెంపక కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా గొట్లూరు చెరువులో పెల్లెట్ సీడ్ ద్వారా పశుగ్రాస విత్తనాలను చల్లి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పశువులకు అవసరమైన నాణ్యమైన పచ్చిమేతను స్థానికంగా అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పాడి రైతులకు ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. పశుసంపద అభివృద్ధితో పాటు రైతుల ఆదాయాన్ని పెంచడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం కోసం ఇటువంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.
రైతు సంక్షేమం పశుసంపద అభివృద్ధి – గ్రామీణ ప్రగతే లక్ష్యం అని నిర్వాహకులు తెలిపారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎంపీడీవో



**రాప్తాడు ఆగస్టు 18 అనంత జనశక్తి న్యూస్**

రాప్తాడు: మండలంలోని పలు గ్రామాల్లోని ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో బి. విజయలక్ష్మి మంగళవారం సందర్శించి పరిశీలించారు. హంపాపురం, గొల్లపల్లి, గాండ్లపర్తి, కొత్తపల్లి, బుక్కచెర్ల, బొమ్మపర్తి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.
ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన మౌలిక వసతులు, విద్యుత్ సౌకర్యం, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై సంబంధిత సిబ్బందితో వివరాలు తెలుసుకున్నారు.
ఈ కార్యక్రమంలో సీఐ సి. వేంకటేశులు, డిప్యూటీ ఎంపీడీవో బి. అశోక్ బాబు, డిప్యూటీ ఎంపీడీవో (SGSW) కె. అచ్యుతానంద బాబు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీలలో ఓటర్ల గుర్తింపునకు షెడ్యూల్ విడుదల.

**- ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు.**

**- ఎంపీడీవో ఏలూరు వెంకటేశు**

**ధర్మవరం ఆగస్టు 18, అనంత జనశక్తి న్యూస్:**



మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్లను సమగ్రంగా గుర్తించేందుకు స్పష్టమైన సమయపట్టిక (షెడ్యూలు) విడుదలైనట్లు ఎంపీడీవో ఏలూరు వెంకటేశు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ... దీనికి సంబంధించి ధర్మవరం మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, ఓటర్లు , అధికారులు అవగాహన కలిగి ఉండాలని వారు తెలిపారు.

ఆగస్టు 16 నుండి 20 వరకు: ఇంటింటి సర్వే ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు ప్రక్రియ. 21 నుండి 22 వరకు: ఓటర్ల జాబితాలో సంబంధిత వర్గాల ఓటర్లను గుర్తించి మార్కింగ్ చేయడం.

23వ తేదీన ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్లతో కూడిన ముసాయిదా (డ్రాఫ్ట్) జాబితా ప్రచురణ ఉంటుందన్నారు. ఆగస్టు 24 నుండి 26 వరకు ముసాయిదా జాబితాపై అభ్యంతరాల స్వీకరణ,

27 నుండి 31 వరకు స్వీకరించిన అభ్యంతరాలపై విచారణ చేపట్టి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు.

సెప్టెంబర్ 1 నుండి 4వ తేదీ వరకు గ్రామ సభల ద్వారా జాబితాలను ధ్రువీకరించడం,సెప్టెంబర్ 5న: సవరించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల తుది జాబితా ప్రచురిస్తామన్నారు. ప్రతి పంచాయతీకి ఎస్సీ/ఎస్టీ/బీసీ ఓటర్ల గుర్తింపు అధికారిగా సంబంధిత పంచాయతీ కార్యదర్శి లేదా మినిస్టీరియల్ సిబ్బందిని జిల్లా పంచాయతీ అధికారినియమిస్తారని తెలిపారు. అసలు ఓటర్ల జాబితాలో ఈ వర్గాల వివరాలను ఎరుపు బాల్ పాయింట్ పెన్తో స్పష్టంగా మార్కింగ్ చేస్తారని, ఇతర అధికారిక జాబితాలతో పరిశీలించిన తర్వాతే ముసాయిదా ప్రచురిస్తారని తెలిపారు.

క్లెయిమ్లు, అభ్యంతరాల సమర్పణ:

ముసాయిదా జాబితా ఆధారంగా పేర్లు చేర్చడానికి లేదా సవరణలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎస్సీ/ఎస్టీ/బీసీ ఓటరుగా పేరు చేర్చడానికి ఫారం-2, ఇతరుల పేరు చేర్చడంపై అభ్యంతరం ఉంటే ఫారం-3, తన పేరు చేర్చడంపై స్వయంగా అభ్యంతరం వ్యక్తపరిచేందుకు ఫారం-4 ద్వారా దరఖాస్తు చేయాలని సూచించారు.

# వివాహ ఆహ్వానం...



**- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ కు చిలకం దంపతుల ఆహ్వానం.**

**ధర్మవరం ఆగష్టు 18 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం ఈ నెల 30వ తేదీన బెంగళూరులో కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో జరగనున్న జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదనరెడ్డి తనయుడు చిలకం జయవర్ధన్‌రెడ్డి, శ్రావ్యరెడ్డిల వివాహ వేడుకకు పలువురు రాజకీయ ప్రముఖులను ఆహ్వానించారు.
ఈ సందర్భంగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌లను కలిసి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ ఆహ్వాన పత్రికలు అందజేశారు.
ఈ సందర్భంగా నాయకులు నూతన వధూవరులకు ముందస్తుగా శుభాకాంక్షలు తెలియజేశారు.



# భారీ అక్రమ మద్యం స్వాధీనం

**- పక్కా సమాచారంతో పట్టుకున్న పోలీసులు**
**- 450పైగా మద్యం బాటిల్లు స్వాదినం**

**తాడిపత్రి, ఆగస్టు 18, అనంత జనశక్తి న్యూస్ ;**



తాడిపత్రిలో పట్టణంలో సోమవారం రాత్రి భారీ స్థాయిలో గోవా మధ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. గోవా నుంచి తాడిపత్రికి అక్రమంగా మద్యం తీసుకవచ్చి తాడిపత్రి ప్రాంతంలో విక్రయాల జరుపుతున్నారన్న సమాచారంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణ పోలీసులు సిఐ ఆరోహణరావు, సిబ్బంది దాడులు చేసి వాహనాన్ని తనిఖీ చేయగా పుష్ప తరహాలో బాడీ క్యాబిన్లో ప్రత్యేక బాక్సులను ఏర్పాటు చేసి అందులో అక్రమంగా తరలిస్తున్న 450వందల ఫుల్ మద్యం బాటిళ్లను స్వాధీన పరుచుకున్నారు. అలాగే లారీని వాటి వెనకాల అనుసరిస్తున్న మరో కారుని కూడా స్వాధీన పరుచుకున్నారు.
వాహనానికి రెండు నెంబర్లు...
అయితే అక్రమ మద్యాన్ని తరలిస్తున్న లారీకి రెండు నెంబర్లు ఉండడంపై పోలీసులు అనేక అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు ఇందులో ఓ నెంబర్ కర్ణాటక, మరో నెంబర్ ఆంధ్రప్రదేశ్ కు చెందినదిగా ఉంది. దీనిపై పోలీసులు ఆరాతీయగా పుట్లూరు మండలం చింతపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయరెడ్డిదిగా గుర్తించారు.
గోవా నుంచి మద్యం తాడిపత్రికి ఎలా చేరింది? ఈ మద్యం ఎక్కడికి తరలిస్తున్నారు? తాడిపత్రిలో ఎవరికి సరఫరా చేయాల్సి ఉంది? అనే అంశాలపై పోలీసులు విచారణ సాగిస్తున్నారు. అయితే దీనిపై సోషల్ మీడియాలో ఇరు పార్టీలు మీ వారంటే మీ వారు అంటూ తయారుచేసిన పోస్టర్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.



# మండల పరిధిలో పలు సమస్యలను పరిశీలించిన ఆర్డిఓ సువర్ణ

**ఆమడగూరు ఆగస్టు 18 (అనంత జనశక్తి న్యూస్ )**

మండల పరిధిలోని చినగానపల్లి పంచాయతీ మారుతీపురం గ్రామ సమీపాన కదిరి రిటైర్డ్ ట్రాన్స్కొ లైన్మెన్ రమణ పొలం నుండి ఇతర పొలాలకు రహదారి కి సమస్యఉండడంతో పుట్టపర్త ఆర్డిఓ చొరవ తీసుకొని పరిశీలించి సమస్యను పరిష్కారం చేశారు అనంతరం చిన్నగానపల్లి రీ సర్వే గురించి రైతులను ఆరా తీశారు అనంతరం ఆరో ఓ ఆరు కేసుల్లో రైతులు కోర్టును ఆచరించిన వారి గురించి తెలుసుకున్నారు తుమ్మల గ్రామంలో బి ఎల్ ఓ ఓటరు నమోదు పై అధికారులను అడిగి అరా తీశారు గుండు వారి పల్లి గ్రామంలో భూ సమస్యలపై రైతులకు తగు న్యాయం జరగాలని తాసిల్దారుకు సూహించారు స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో పెండింగ్ లో ఉన్న వివిధ భూ సమస్యలను తాసిల్దార్ మారుతి ప్రకాష్‌ను అడిగి తెలుసుకున్నారు రెవిన్యూ సిబ్బంది కొరత గురించి సేకరించారు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలను ఆఫీసుల చుట్టూ పదేపదే తిరగకుండా వారికి చట్టారీత్యా న్యాయం చేయాలని తాసిల్దార్ కు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మారుతి ప్రకాష్ ఆర్ ఐ రామకృష్ణారెడ్డి విఆర్వోలు, వీఆర్ఏలు సర్వేయర్లు బాబ్జాన్ గ్రామస్తులు పాల్గొన్నారు



# సీనియర్ జర్నలిస్ట్ ఎల్లం రాజు,కి మాతృ వియోగం

**- మృదేహానికి .. నివాళులర్పించిన ప్రముఖులు పాత్రికేయులు ఫలుపార్టీల నాయకులు**

**ఆమడగూరు ఆగష్టు 18 ,అనంత జనశక్తి న్యూస్:**



అమడగూరు, మన కేంద్రంలోని, స్థానిక ఎస్సీ కాలనీలో, ఉన్నటువంటి,సీనియర్ జర్నలిస్ట్ దళిత సంఘాల ప్రతినిధి యల్లంరాజు మాతృమూర్తి మూలి ఓబులమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మండలంలోని పార్టీలకు అతీతంగా పలు పార్టీల నాయకులు , కుల సంఘాల నాయకులు, పాత్రికేయులు ప్రముఖులు ఓబులమ్మ మృతదేహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ యల్లం రాజు కు పుట్టపర్తి కదిరి ఒడిసి అమదగూరు మండలానికి చెందిన మండలాలకు చెందిన పాత్రికేయులు ఓదార్చి ... కష్ట సమయంలో ఆ దేవుడు మీ కుటుంబానికి మనో ధైర్యం ఇవ్వాలని పలువురు నాయకులు ఆకాంక్షించారు. అనంతరం ఓబులమ్మను ప్రత్యేక వైకుంఠ రథం లో ఊరేగింపుగా స్మశాన వాటికకు వైభవంగా తీసుకెళ్లి కుటుంబ సభ్యులు , తోటి మిత్రులు సమక్షంలో అంతిమ సంస్కారాలు నిర్వహించి కన్నీటి వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమంలో మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ తనకంటి జయప్ప, వైసీపీ నాయకులు సేవే నాయక్, రవీంద్ర నాయక్,, నవీన్, తెలుగుదేశం నాయకులు రాము నాయక్, నంజప్ప, మాదిగ ఉద్యోగుల సమైక్య సత్యసాయి జిల్లా అధ్యక్షులు నాగేంద్ర మాజీ జెడ్పిటిసి పొట్ట పురుషోత్తం రెడ్డి భార్య ఉమాదేవి కదిరి, ఓడి చెరువు, అమడగూరు మండలాల పాత్రి కేయులు , పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# చెత్త కనిపిస్తే వెంటనే తొలగించాలి

**- పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించిన కమిషనర్ వెంకటరమణయ్య**

**ధర్మవరం ఆగష్టు 18 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పట్టణంలో పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్టంగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం సంజయ్‌నగర్‌లోని 1వ డివిజన్ మాస్టర్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి శానిటరీ సిబ్బంది విధులను పరిశీలించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో పారిశుధ్య పరిస్థితులు, చెత్త సేకరణ, తరలింపు విధానాన్ని పరిశీలించారు. రోడ్ల వెంట, నివాస ప్రాంతాల్లో చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సేకరించిన చెత్తను ఆలస్యం చేయకుండా నిర్ణీత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. చెత్త తొలగించిన ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. పారిశుధ్య విషయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా డివిజన్‌ల వారీగా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కమిషనర్ తెలిపారు.



# మంచినీరు లేక అల్లాడుతున్న బొడ్డపాడు

**- 20 రోజులుగా పనిచేయని సోలార్ బోరు – ఊట గెడ్డ నీరే శరణ్యం**

**అనంతగిరి,ఆగస్టు 18, అనంత జనశక్తి న్యూస్**

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలోని వాలాసి పంచాయతీ పరిధిలో గల బొడ్డపాడు గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. గ్రామంలోని సుమారు 30 గిరిజన కుటుంబాలు కనీసం తాగేందుకు సురక్షితమైన మంచినీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**20 రోజులుగా నిలిచిన సోలార్ బోరు**

గ్రామానికి ప్రధాన ఆధారంగా ఉన్న సోలార్ బోరు గత 20 రోజులుగా పనిచేయడం లేదు. సోలార్ మోటార్ మొరాయించడంతో తాగునీటి కోసం గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సమస్యను స్థానిక పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



**ఊట గెడ్డ నీరే దిక్కు**

తాగునీటి కోసం వేరే మార్గం లేక గ్రామస్తులు కిలోమీటర్ల దూరం నడిచి అడవిలోని ఊట గెడ్డల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. కలుషితంగా, బురదతో ఉన్న ఆ నీటినే కాచుకుని తాగాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. దీంతో చిన్నారులు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారులు స్పందించాలి**

గ్రామంలో తాగునీటి సమస్య ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు కనీసం గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్య తీవ్రతను అధికారులు గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.సోలార్ బోరుకు వెంటనే మరమ్మతులు చేపట్టి గ్రామానికి సురక్షితమైన తాగునీటి సౌకర్యాన్ని పునరుద్ధరించాలని బొడ్డపాడు గ్రామ గిరిజనులు పాలకులు, ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు. ఇకనైనా అధికారులు యుద్ధప్రాతిపదికన స్పందించి తమ తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# యుద్ధప్రాతిపదికన ... రహదారి పనులు పూర్తి చేయాలి

**- నాలుగు నెలలుగా హామీతోనే కాలయాపన**
**- వర్షా కాలంలో కంకర - కొట్టుకుపోయే ప్రమాదం**
**- హ్యూమన్ రైట్స్ డిఫెండర్ సింహాచలం హెచ్చరిక**

**అనంతగిరి, జన శక్తి న్యూస్, ఆగస్టు 18:**

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పెద్దబిడ్డ పంచాయతీ పరిధిలోని బొడ్డగడ్డ జంక్షన్ నుంచి గున్నమామిడి జంక్షన్ వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర ఉన్న రహదారి పునర్నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి, యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని హ్యూమన్ రైట్స్ డిఫెండర్ బిడ్డ సింహాచలం డిమాండ్ చేశారు.

**2021–22లో మంజూరు.. నేటికీ అసంపూర్తే**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ట్రైబల్ వెల్ఫేర్ నిధులతో 2021-2022 ఆర్థిక సంవత్సరంలో ఈ రహదారి నిర్మాణ పనులు మంజూరయ్యాయని తెలిపారు. పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తికాకపోవడంతో పెద్దబిడ్డ, గుమ్మ పంచాయతీల పరిధిలోని గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

**కంకర వేసి వదిలేశారు**

కొన్ని నెలల క్రితం రహదారి నిర్మాణం కోసం క్రషర్ కంకరను వేసి పనులను అసంపూర్తిగా వదిలేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో కంకరపై నుంచి విపరీతంగా దుమ్ము, ధూళి లేస్తుండటంతో చెరుకుమడత, కంటిపురం గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దుమ్ము ఇళ్లలోకి చేరడంతో ప్రజలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని వాపోయారు.

**హామీ ఇచ్చి నాలుగు నెలలు**

ఈ సమస్యపై నాలుగు నెలల క్రితం అనంతగిరి మండల ఇంజనీరింగ్ అధికారి (ఏఈఈ) గణేష్‌ను సంప్రదించగా, వారంలోగా పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని సింహాచలం గుర్తు చేశారు. అయితే నాలుగు నెలలు గడిచినా పనులు ప్రారంభించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

**వర్షా కాలంలో కంకర కొట్టుకుపోయే ప్రమాదం**

ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతున్న నేపథ్యంలో రహదారిపై వేసిన క్రషర్ కంకర మొత్తం కొట్టుకుపోయే ప్రమాదం ఉందని సింహాచలం ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే రహదారి పరిస్థితి అధ్వానంగా ఉండటంతో రెండు పంచాయతీల పరిధిలోని ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.



**స్పందించకపోతే ఆందోళన**

ఇకనైనా సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు తక్షణమే స్పందించి రహదారి పనులను పునఃప్రారంభించి పూర్తి చేయాలని సింహాచలం డిమాండ్ చేశారు. అధికారులు ఇంకా కాలయాపన చేస్తే గ్రామస్తులను సమీకరించి ఇంజనీరింగ్ కార్యాలయాన్ని ముట్టడించడంతో పాటు భారీ నిరసన కార్యక్రమం చేపడతామని ఆయన హెచ్చరించారు.

# ఓబీసీ మోర్చా అధ్యక్షునిగా గోపాల శెట్టి శ్రీనివాసరావు

**- పార్టీ నేతల హర్షం**

**అనంతగిరి, ఆగస్టు 18, అనంత జనశక్తి న్యూస్**



**భారతీయ జనతా పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు అనంతగిరి మండల ఓబీసీ మోర్చా అధ్యక్షునిగా గోపాల శెట్టి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు శెట్టి రాజు ఒక ప్రకటనలో అధికారికంగా వెల్లడించారు.ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన అనంతగిరి మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గోపాల శెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతాయుతంగా పనిచేస్తానన్నారు. నిరంతరం పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు.గోపాల శెట్టి శ్రీనివాసరావు నియామకం పట్ల బీజేపీ కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు శెట్టి రాజు, అనంతగిరి మండల అధ్యక్షుడు సోమరాజు, ప్రధాన కార్యదర్శులు రామస్వామి, రామకృష్ణ, గోపాలరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన నియామకం మండలంలో ఓబీసీ మోర్చాను మరింత బలోపేతం చేసేందుకు దోహదపడుతుందని పేర్కొంటూ పార్టీ నాయకులు, కార్యకర్తలు గోపాల శెట్టి శ్రీనివాసరావుకు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.**

# మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా "జనసేన వీర మహిళల" ప్రత్యేక పాట విడుదల!

**విజయవాడ ఆగస్టు 18, అనంత జనశక్తి న్యూస్**

మహిళలు రాజకీయ రంగంలోకి అడుగుపెట్టి, క్రియాశీలక పాత్ర పోషించేలా, జనసేన పార్టీ వీర మహిళల్లో మరింత స్ఫూర్తి నింపేందుకు రూపొందించిన "కదిలింది ఇక జనసేన... కదం తొక్కు వీర మహిళ" అనే ప్రత్యేక పాటను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో విడుదల చేసి ఆసక్తిగా విన్నారు.. కృష్ణాపెన్నా రీజినల్ కోఆర్డినేటర్ రావి సౌజన్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విజయవాడ భవానీపురం 43వ డివిజన్ జనసేన పార్టీ కోఆర్డినేటర్, విజయేశ్వర స్వామి దేవాలయ బోర్డు మెంబెర్ ఆలమూరి శ్రీదేవి నిర్మించిన ఈ పాటను మంత్రి దుర్గేష్ ప్రశంసించారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. "జనసేనాని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా మహిళలు రాజకీయాల్లో మరింతగా రాణించాలనే ఉన్నతమైన లక్ష్యంతో, జనసేన పార్టీ వీర మహిళల సాహసాన్ని, ప్రజాస్వామ్య పోరాటంలో వారి కీలక పాత్రను గుర్తుచేస్తూ స్ఫూర్తిని రగిలించేలా ఈ పాటను రూపొందించడం అభినందనీయం. మహిళా శక్తికి, వారి పోరాట పటిమకు ప్రతీకగా నిలిచేలా ఈ గీతం ఎంతో అద్భుతంగా, స్ఫూర్తిదాయకంగా ఉంది" అని కొనియాడారూ



# బీసీ బిడ్డలకు ఐఐటీ జేఈఈ, నీట్ శిక్షణ

- రాష్ట్ర బీసీ సంక్షేమ సవిత
- రాష్ట్రంలో రూ.6.86 కోట్లతో 2 ఎక్స్ లెన్స్ సెంటర్ల ఏర్పాటు
- అమలాపురంలో బాలురు, తిరుపతిలో బాలికల సెంటర్లు
- ఫస్ట్ , సెకండర్ ఇంటర్ లో 160 మంది చొప్పన 320 మందికి శిక్షణ
- ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ఫస్ట్ ఇంటర్ తరగతులు ప్రారంభం
- ఎక్స్ లెన్స్ సెంటర్ల ఏర్పాటుపై మంత్రి సవిత హర్షం
- సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కు, మంత్రి నారా లోకేశ్ కు ధన్యవాదాలు

అమరావతి ఆగస్టు 18 అనంత జనశక్తి న్యూస్

బీసీ విద్యార్థులు ఐఐటీ జేఈఈ, నీట్ ప్రవేశ పరీక్షల్లో సత్తా చాటేలా కూటమి ప్రభుత్వం రెండు సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఒక్కో కేంద్రం ద్వారా 320 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. రూ.6.86కోట్లతో ఈ రెండు కేంద్రాలను ఏర్పాటు చేయడంపై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు, మంత్రి నారా లోకేశ్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీ బిడ్డల విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. బీసీ గురుకులాలు, హాస్టళ్ల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోందన్నారు. టెన్త్, ఇంటర్ లో అత్యుత్తమ మార్కులతో సత్తాచాటుతున్న బీసీ విద్యార్థులకు ఉన్నత విద్య అందించే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం రెండు సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందన్నారు. ఈ కేంద్రాల ద్వారా ఐఐటీ జేఈఈ, నీట్ ప్రవేశ పరీక్షల్లో సత్తా చాటేలా శిక్షణ ఇవ్వనున్నామన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే ఏపీ వెనుకబడిన తరగతుల సంక్షేమ నివాస విద్యాసంస్థల సంఘం ఆధ్వర్యంలో ఈ రెండు కేంద్రాలను అమలాపురం, తిరుపతిలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అమలాపురంలో ఏర్పాటు చేయనున్న సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రంలో బాలురకు, తిరుపతిలో బాలికలకు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. త్వరలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 160 మంది విద్యార్థులకు అడ్మిషన్లు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఎంపీసీలో 80 మంది, బైపీసీలో 80 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఇప్పటికే ఎంజేపీ గురుకుల విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులను ఎక్స్ లెన్స్ సెంటర్ కు ఎంపిక చేయనున్నామన్నారు.



ఈ కేంద్రాల ద్వారా బీసీ విద్యార్థులు ఐఐటీ జేఈఈ, నీట్ ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఎయిమ్స్,ఇతర ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అధిక సంఖ్యలో ప్రవేశాలు సాధించేలా అవకాశాలు కల్పించడమే ఈ శిక్షణా కేంద్రాల ఏర్పాటు ప్రధాన ఉద్దేశమని రాష్ట్ర బీసీ సంక్షేమ సవిత తెలిపారు. ఈ రెండు కేంద్రాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.6.86 కోట్లు వెచ్చించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించనున్నామన్నారు. బీసీ బిడ్డల ఉన్నత విద్యకు ప్రోత్సహిస్తున్న సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు, మంత్రి నారా లోకేశ్ కు మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు.

# ఎస్. విష్ణువర్ధన్ రెడ్డికి జాతీయ బాధ్యత

విజయవాడ ఆగస్టు 18 అనంత జనశక్తి న్యూస్

బీజేపీ జాతీయ 'ఆల్ సెల్స్ జాయింట్ కోఆర్డినేటర్'గా ఎస్. విష్ణువర్ధన్ రెడ్డికి కీలక బాధ్యతలు దక్కాయి. ఆర్ఎస్ఎస్ భావజాల కుటుంబంలో సత్యసాయి జిల్లా కదిరిలో జన్మించిన ఆయన, ఏబీవీపీ ద్వారా 1992లో ప్రజాజీవితంలోకి ప్రవేశించారు.

ఎబీవీపిలో అనేక రాష్ట్రా స్థాయి పదవులలో పనిచేశారు. అనంతరం బీజేవైఎం, బీజేపీలో వివిధ రాష్ట్ర, జిల్లా స్థాయి బాధ్యతలు చేపట్టి పార్టీ బలోపేతానికి కృషి చేశారు.2012-2016 మధ్య బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడిగా, (రెండు సార్లు) 2018-2021 మధ్య నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ వైస్ ఛైర్మన్‌గా జాతీయ స్థాయిలో సేవలందించారు. రాష్ట్ర బీజేపీలో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రెండు సార్లు, ఒక సారి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.

విద్యా, యువజన

రంగాల్లోనూ తనదైన ముద్ర వేశారు. పార్టీ విధానాలను మీడియా, టీవీ చర్చల్లో సమర్థంగా వినిపించే నేతగా గుర్తింపు పొందారు.జాతీయ కమిటీ లో నితిన్ నబీన్ జట్టు లో అఖిల భారత స్థాయిలో పార్టీ అనుబంధ విభాగాలు, సెల్స్ సమన్వయ బాధ్యతలు నిర్వహించే ఈ టీమ్‌కు విష్ణుదత్ శర్మ (మధ్యప్రదేశ్ శ్రీ రెండు సార్లు అధ్యక్షుడు) కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారు. మధ్యప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడిగా, ఖజురహో ఎంపీగా సంస్థాగతంగా విశేష అనుభవం సంపాదించిన విష్ణుదత్ శర్మ ప్రస్తుతం జాతీయ 'ఆల్ సెల్స్ కోఆర్డినేటర్'గా ఉన్నారు.సాధారణ కార్యకర్తగా ప్రారంభమైన విష్ణువర్ధన్ రెడ్డి ప్రయాణం ఇప్పుడు బీజేపీ జాతీయ నాయకత్వంలో కీలక బాధ్యత వరకు చేరడం ఆయన దశాబ్దాల సంస్థాగత కృషికి దక్కిన గుర్తింపుగా పార్టీ శ్రేణులు అభివర్ణిస్తున్నాయి.



# ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోళ్లు మరింత వేగవంతం చేయాలి

- నో-బిడ్స్ మరింత తగ్గాలి.. రైతులకు మెరుగైన ధర దక్కేలా చర్యలు చేపట్టాలి
- పొగాకు బోర్డు ఉన్నతాధికారులతో తాజా పరిస్థితిపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమీక్ష

అమరావతి, ఆగస్ట్:అనంత జనశక్తి న్యూస్

రాష్ట్రంలో ఎఫ్‌సీవీ (FCV) పొగాకు వేలాలు, కొనుగోళ్ల తాజా పరిస్థితిపై మంగళవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పొగాకు బోర్డు సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కొనుగోళ్ల వేగం పెరగడం, నోబిడ్ శాతం క్రమంగా తగ్గుతుండటం సానుకూల పరిణామమని పేర్కొన్న మంత్రి, ఇదే వేగాన్ని కొనసాగిస్తూ రైతులకు మరింత మెరుగైన ధర లభించేలా చర్యలు



చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇప్పటివరకు 117 వేలాలు పూర్తయ్యాయని, సుమారు 60 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలు జరిగిందని, ప్రస్తుతం సగటు ధర కిలోకు సుమారు రూ.210 వద్ద కొనసాగుతోందని అధికారులు మంత్రికి వివరించారు. ఇటీవల రోజుల్లో కొనుగోళ్ల వేగం పుంజుకుని రోజుకు సగటున 1.5 నుంచి 2 మిలియన్ కిలోల వరకు అమ్మకాలు జరుగుతున్నాయని తెలిపారు. అదే సమయంలో నోబిడ్ శాతం క్రమంగా తగ్గుతూ రావడం రైతులకు ఊరటనిచ్చే పరిణామమని మంత్రి పేర్కొన్నారు.పొగాకు రైతుల ప్రయోజనాలే ప్రాధాన్యంగా కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. పొగాకు కొనుగోలు కంపెనీలు, ట్రేడర్లతో మరోసారి చర్చించి కొనుగోళ్ల పరిమాణాన్ని పెంచాలని, 'నో బిడ్స్'ను మరింత తగ్గించాలని పొగాకు బోర్డు అధికారులకు సూచించారు. ముఖ్యంగా రైతులకు లభిస్తున్న సగటు ధర మరింత పెరిగేలా కంపెనీలు, ట్రేడర్లతో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పొగాకు రైతులు ఇబ్బందులు పడకుండా వేలాలు, కొనుగోళ్ల పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు మెరుగైన ధర దక్కేలా పొగాకు బోర్డు, కొనుగోలు కంపెనీలు, ట్రేడర్లతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## తగరకుంటలో రీసర్వే, గ్రౌండ్ ట్రూథింగ్ పనులను

# తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్

కనగానపల్లి,ఆగస్టు,18:అనంత జనశక్తి న్యూస్

భూ రీసర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, గడువులోగా పూర్తి చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు.తగరకుంట,కనగానపల్లి మండల పరిధిలో జరుగుతున్న రీసర్వే పనులను, గ్రౌండ్ ట్రూథింగ్ ప్రక్రియను మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్వేయర్లు, రెవెన్యూ అధికారులతో కలిసి రికార్డులను, డ్రోన్ మ్యాపింగ్ డేటాను పరిశీలించారు.

జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ...

రైతులకు ఎలాంటి వివాదాలు లేకుండా సరిహద్దులను ఖచ్చితంగా మార్కింగ్ చేయాలి. గ్రౌండ్ ట్రూథింగ్



సమయంలో భూ యజమానుల సమక్షంలోనే కొలతలు వేయాలి.సర్వే ప్రక్రియలో రైతులకు ఏవైనా అభ్యంతరాలు లేదా సందేహాలు ఉంటే వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.GNSS రోవర్లు, డ్రోన్ మ్యాపింగ్ ద్వారా లభించిన వివరాలను సరిచూసుకుంటూ రికార్డుల్లో ఎటువంటి తప్పులు దొర్లకుండా నమోదు చేయాలని స్పష్టం చేశారు.పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, నిర్దేశిత గడువులోగా ప్రక్రియ మొత్తం పూర్తి చేయాలని సర్వేయర్లను, విఆర్ఓలను ఆదేశించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీఓ రామ్ భూపాల్ రెడ్డి, స్థానిక తహశీల్దార్ మనోజ్, మండల సర్వేయర్, విఆర్ఓలు మరియు ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 12న జరిగే లోక్ అదాలత్ పై పోలీస్ అధికారులతో సమీక్ష



పల్నాడు ఆగస్టు 18, అనంత జనశక్తి న్యూస్

సెప్టెంబర్ 12వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేసేందుకు సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో లోక్ అదాలత్ ద్వారా వీలైనంత ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తులు.. పోలీస్ అధికారులకు సూచించారు.సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వి. విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ...లోక్ అదాలత్ లతో రాజీకి అవకాశం ఉన్న కేసులను ముందుగానే గుర్తించి, ఇరు వర్గాలతో సమన్వయం చేసుకుని పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని కోరారు.కేసుల పరిష్కారంతో కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు, దీర్ఘకాలంగా కొనసాగుతున్న వివాదాలకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ముఖ్యంగా ఇరు వర్గాలు పరస్పర అంగీకారంతో పరిష్కరించుకునే కేసులను గుర్తించి, లోక్ అదాలత్ కు తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.పోలీస్ అధికారులు కూడా తమ పరిధిలోని కేసులను పరిశీలించి, రాజీ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉన్న కేసుల వివరాలను న్యాయ సేవాధికార సంస్థకు అందించాలని సూచించారు.

పోలీస్ శాఖ, న్యాయ సేవాధికార సంస్థ పరస్పర సమన్వయంతో పనిచేస్తే లోక్ అదాలత్ తో మరిన్ని కేసులు పరిష్కరించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దౌసిద్దీన్, రెండవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) సుజన్ కుమార్ తో పాటు సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, కోర్టు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

# బీజేపీ ఉపాధ్యక్షులుగా పురందేశ్వరీ, రామ్ మాధవ్ నియామకంపై మంత్రి కందుల దుర్గేష్ హర్షం



అమరావతి ఆగస్టు 18

అనంత జనశక్తి న్యూస్

బీజేపీ జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్ 65 మందితో ప్రకటించిన నూతన జాతీయ కార్యవర్గంలో జాతీయ ఉపాధ్యక్షులుగా ఏపీకి చెందిన రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరీ, రామ్ మాధవ్ మరియు సంయుక్త సమన్వయకర్తగా విష్ణువర్ధన్ రెడ్డిలకు సముచిత స్థానం కల్పించడంపై మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. రాజకీయ జీవితంలో ఒక్కో మెట్టు ఎదుగుతూ కష్టపడి అత్యున్నత స్థాయికి చేరుకోవడం గొప్ప విషయమని కొనియాడుతూ వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పీఎం నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో దేశ ప్రగతికి, వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యాల సాధనకు మరింత ఉత్సాహంతో కృషి చేయాలని ఆకాంక్షించారు.

# ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎమ్మెల్సీ నాగబాబు నియామకం పట్ల మంత్రి కందుల దుర్గేష్ హర్షం

అమరావతి ఆగస్టు 18 అనంత జనశక్తి న్యూస్



ఆంధ్రప్రదేశ్‌లో పచ్చదనం పెంపు, అటవీ విస్తీర్ణం, పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ 'ఆంధ్రప్రదేశ్ సొసైటీ ఫర్ గ్రీనింగ్ అండ్ రీఫారెస్టేషన్ ఫర్ ఎకలాజికల్ ఎన్‌రిచ్‌మెంట్ (ఏపీ గ్రీన్)' ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా కేబినెట్ హోదా కల్పిస్తూ ఎమ్మెల్సీ కొణిదెల నాగేంద్రరావు (నాగబాబు) నియామకం పట్ల మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ నాగబాబు నేతృత్వంలో "పచ్చని ఆంధ్రప్రదేశ్ - ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్" ఆశయ సాధన దిశగా రాష్ట్రం వేగంగా అడుగులు వేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.ఏపీ గ్రీన్ లక్ష్యాలు, కార్యక్రమాల అమలులో వివిధ ప్రభుత్వ శాఖలు, జిల్లా స్థాయి సంస్థల మధ్య సమన్వయం సాధించడంతో వాటి పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం వంటి కీలక బాధ్యతలను ఎమ్మెల్సీ నాగబాబు సమర్థవంతంగా నిర్వహిస్తారని మంత్రి దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో అటవీ పరిరక్షణ మరియు పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే ఏపీ గ్రీన్ ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించిన నేపథ్యంలో 2047 నాటికి ఈ లక్ష్యాన్ని సమర్థవంతంగా సాధించే దిశగా నూతన చైర్‌పర్సన్ నాయకత్వంలో కార్యాచరణ కొనసాగాలని అభిప్రాయపడుతూ శుభాకాంక్షలు తెలిపారు.

# మంత్రి నారా లోకేష్ ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ , నూతన ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి



విజయవాడ ఆగస్టు 18, అనంత జనశక్తి న్యూస్

విజయవాడలోని అసెంబ్లీ ప్రాంగణంలో తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ , ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ని అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్ గవర్నర్ కోటాలో నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన దలవాయి రమాదేవి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, మంత్రి నారా లోకేష్ , రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కి, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కి దలవాయి రమాదేవి, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దలవాయి వెంకటనారాయణ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన పార్టీ అధినాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతపురం నియోజకవర్గంలోని టిడిపి క్లస్టర్ ఇంచార్జ్, వడ్డెర సామాజిక వర్గానికి చెందిన దలవాయి రమాదేవి కి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడంపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.

# తహసిల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్ ఎమ్. మౌర్య భరద్వాజ్

కనగానపల్లి,ఆగస్టు,18:అనంత జనశక్తి న్యూస్

శ్రీ సత్యసాయి జిల్లా కనగాపల్లి మండల తహసిల్దార్ కార్యాలయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎమ్. మౌర్య భరద్వాజ్ గారు ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులు, ప్రజల సమస్యల పరిష్కార ప్రక్రియ మరియు రెవెన్యూ సేవల నిర్వహణను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యాలయ హాజరు రిజిస్టర్, వెబ్‌ల్యాండ్ రికార్డులు, రీసర్వే రిజిస్టర్లు మరియు ముటేషన్ దరఖాస్తులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రజల నుండి వచ్చే వినతులను నిర్దేశిత గడువులోగా (SLA) పరిష్కరించాలని, ఎలాంటి పెండింగ్ దరఖాస్తులు ఉండకూడదని అధికారులను ఆదేశించారు.రీసర్వేలో తలెత్తిన సమస్యలు, భూముల హద్దుల వివాదాలు మరియు విస్తీర్ణంలో మార్పులపై ప్రత్యేక దృష్టి సారించి రైతులకు త్వరితగతిన న్యాయం చేయాలని సూచించారు.కార్యాలయానికి వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, విధుల్లో పారదర్శకత వహించాలని తెలిపారు. విధులలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీఓ రామ్ భూపాల్ రెడ్డి ,కనగాపల్లి తహసిల్దార్ మనోజ్ , డిప్యూటీ తహసిల్దార్, ఆర్ఐలు, సర్వేయర్లు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# 300 టన్నుల అక్రమ ఇసుక డంపులు సీజ్..



- నెల వ్యవధిలో 5 కేసులు, 9 వాహనాలు స్వాధీనం*
- జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు శింగనమల పోలీసు, రెవెన్యూ, గనుల శాఖ అధికారుల సంయుక్త దాడులు
- కఠిన చర్యలు తప్పవని శింగనమల సి.ఐ రాగిరి రామయ్య హెచ్చరిక

అనంతపురం ఆగస్టు 18 అనంత జనశక్తి న్యూస్

అక్రమ ఇసుక రవాణా, నిల్వలపై పోలీస్, రెవెన్యూ, గనుల శాఖ అధికారులు విరుచుకుపడ్డారు. ఉల్లికల్లు ఇసుక కాలువ వద్ద గుట్టుచప్పుడు కాకుండా నిల్వ ఉంచిన భారీ ఇసుక డంపులను సంయుక్తంగా దాడులు చేసి సీజ్ చేశారు.విశ్వసనీయ సమాచారంతో రంగంలోకి దిగిన సింగనమల సీఐ రాగిరి రామయ్య, ఎస్ఐ ప్రసాద్, స్థానిక తహసీల్దార్, మైన్స్ అధికారి ప్రసాద్ రెడ్డి బృందం కాలువ సమీపంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. అక్కడే నిల్వ ఉంచిన ఇసుక డంపులను స్వాధీనం చేసుకుని, స్థానిక అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించారు. అనంతరం వీటిని రెవెన్యూ, గనుల శాఖల సంయుక్త ఆధీనంలోకి అప్పగించి భద్రపరిచారు.

**నెలలోనే 5 కేసులు, 9 వాహనాలు సీజ్ :**

గత ఒక నెల రోజుల్లోనే సింగనమల పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ ఇసుక దందాపై ఉక్కుపాదం మోపినట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటివరకు 5 క్రిమినల్ కేసులు నమోదు చేసి, 9 వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్ కస్టడీలో ఉంచామని స్పష్టం చేశారు.అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపినా, నిల్వలు ఉంచినా, రవాణాకు పాల్పడినా చట్టప్రకారం అరెస్టులు తప్పవని, ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని అధికారులు తీవ్రంగా హెచ్చరించారు. ఇకపై కూడా తనిఖీలు మరింత ఉధృతం చేస్తామన్నారు.

# అమిత్ షా చిన్నపిల్లాడు



(మొదటి పేజీ తరువాయి)

దేశభక్తిపై తమకు బీజేపీ నేతలు పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదని, కాంగ్రెస్ నేతల దేశభక్తిని ప్రశ్నించే నైతిక హక్కు ఆ పార్టీకి లేదన్నారు. గోవాలో జరిగిన కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభలో ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు.

ఆగస్టు 15న కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో వందేమాతరం గీతాన్ని ఆలపించడంపై వివాదం చెలరేగింది. గీతాన్ని మధ్యలోనే ఆపాలని సోనియా గాంధీ కోరారంటూ అమిత్ షా ఆరోపణలు గుప్పించారు. దీనిపై స్పందిస్తూ ఖర్గే నిప్పులు చెరిగారు. 'మా ప్రజలు దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు చెందిన వారు ఎవరైనా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారా?' అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలను దేశభక్తి గురించి ప్రశ్నించడం మానుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఉత్తరాఖండ్‌లో తన సభ అనంతరం జరిగిన శుద్ధీకరణ అంశాన్నీ ఖర్గే ప్రస్తావించారు. సభలో తాను ప్రసంగించిన తర్వాత ఓ రైట్ వింగ్ సంస్థ.. శుద్ధీకరణ హోమం చేయడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మతాన్ని ఇలాంటి చర్యలకు పరిమితం చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. కాగా, అమిత్ షాపై ఖర్గే చేసిన తాజా వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. మరోవైపు, వందేమాతరం గీతాన్ని ఆలపించడంపై చెలరేగిన వివాదం గురించి కాంగ్రెస్ ఇప్పటికే స్పష్టత ఇచ్చింది. గీతాన్ని ఆలపిస్తున్న సమయంలో ఖర్గే కోసం కుర్చీ ఏర్పాటు చేయాలని సోనియా గాంధీ సూచించారని వివరణ ఇచ్చింది. అంతేకానీ, గీతాన్ని మధ్యలో ఆపాలని చెప్పలేదని స్పష్టం చేసింది. బీజేపీ దీనిపై రాద్ధాంతం చేయడం సమంజసం కాదని పేర్కొంది.

# చంపత్ రాయ్‌కు సిట్ క్లీన్‌చిట్..!

అయోధ్య, ఆగస్ట్ 18, అనంత జనశక్తి న్యూస్



అయోధ్య రామ మందిరం విరాళాల కేసులో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌కు యూపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) క్లీన్ చిట్ ఇచ్చినట్లు సమాచారం. ఆయనతో పాటు.. ట్రస్ట్ మాజీ సభ్యుడు అనిల్ మిశ్రాకు కూడా క్లీన్‌చిట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. చంపత్ రాయ్‌కు విరాళాల చోరీ కేసుతో ఎలాంటి సంబంధం లేదని సిట్ తన తొలి నివేదికలో పేర్కొన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. సిట్ తన నివేదికను రాష్ట్ర హోంశాఖకు ఇవ్వగా.. ఈ నివేదిక పరిశీలన అనంతరం తదుపరి చర్యల కోసం శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు అందించినట్లు సమాచారం.

యూపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ నివేదికలో చంపత్ రాయ్‌తో పాటు మాజీ ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రా పేర్లు కూడా లేవని సమాచారం. అయితే, విరాళాల వ్యవహారంలో అవకతవకల ఆరోపణల నేపథ్యంలో వీరిద్దరూ జూన్ 27న ట్రస్ట్‌లోని తమ పదవులకు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆ తరువాత జరిగిన పరిణామాల నేపథ్యంలో శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అభ్యర్థన మేరకు సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆదేశాలతో జూన్ 13న తొలి సిట్‌ను ఏర్పాటు చేశారు. లక్నో డివిజనల్ కమిషనర్ విజయ్ విశ్వాస్ పంత్ నేతృత్వంలో ఈ బృందం దర్యాప్తు చేపట్టింది.

**సుప్రీంకోర్టు పర్యవేక్షణలో మరో సిట్..**

రామ మందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో మరో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) విచారణ నిర్వహిస్తోంది. దర్యాప్తును వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సుప్రీంకోర్టు సోమవారం సిట్‌ను ఆదేశించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జయమల్య బాగ్చి, జస్టిస్ వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం.. దర్యాప్తు పురోగతిని వివరిస్తూ సీల్డ్ కవర్‌లో స్టేటస్ రిపోర్ట్ సమర్పించాలని సిట్‌ను ఆదేశించింది. ఫోరెన్సిక్ ఆడిటర్‌తో కూడిన సిట్ నివేదికను ముందుగా కోర్టు పరిశీలిస్తుందని, అనంతరం దాన్ని కేసులోని సంబంధిత పక్షాలతో పంచుకోవాలా వద్దా అనే విషయంపై నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం తెలిపింది. దర్యాప్తు నాణ్యత, పారదర్శకతను మెరుగుపరిచేందుకు పిటిషనర్లు, ఇతర ప్రజాహిత వ్యక్తులు ఇచ్చే సూచనలను నిష్పక్షపాతంగా పరిశీలించాలని సిట్‌కు కోర్టు సూచించింది.

# సీఎం ప్రోగ్రాం రద్దు ...



- పట్టించుకోని నియోజకవర్గ నేతలు
- సభ విజయవంతం కోసం సమావేశం
- సమావేశంలో సైతం తీవ్ర వాగ్వివాదం
- నేతల మధ్య సమన్వయ లోపంతో మరో ప్రాంతానికి మార్పు

అనంతపురం, ఆగస్టు 18, అనంత జనశక్తి న్యూస్;

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సింగనమల నియోజకవర్గ కార్యక్రమం రద్దయిందా....! అసలు ఈ కార్యక్రమాన్ని రద్దు చేసుకోవడానికి మూల కారణం నేతల మధ్య నెలకొన్న ఆదిపత్య ఫోరేనా...? ఏది ఏమైనా ఆయన రాకతో నియోజకవర్గ అభివృద్ధిలో సమూల మార్పులు జరుగుతాయని కలలుగన్న ప్రజల ఆశలు ఆవిరయ్యాయి. ఈనెల 22వ తారీఖున స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు, స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని సింగనమల నియోజకవర్గం లో నిర్వహించేందుకు మొదట రాష్ట్ర పార్టీ కేంద్ర కార్యాలయం నుండి ఆదేశాలు వచ్చాయి. దీనికోసం అధికార యంత్రాంగం నేతలు కూడా సభా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసేందుకు సభా ప్రాంగణాన్ని ఎంపిక చేసేందుకు సన్నద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఈ సభను విజయవంతం చేసేందుకు నియోజకవర్గ ఎమ్మెల్యే, ఏడిసిసి చైర్మన్, జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు తో పాటు మరికొందరు సమావేశం నిర్వహించారు. మొదట సభను నార్పల ప్రాంతంలో నిర్వహించేందుకు చర్చించగా ఆ మండల నేత స్పందించకపోవడంతో సభను బుక్కరాయసముద్రం ప్రాంతంలో నిర్వహించేందుకు చర్చించసాగారని, నేతల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరుతో ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వాగ్వాదానికి దిగడంతో సభ విజయవంతం కోసం సమావేశమైన నేతలు కాస్త లడాయికి దిగడంతో అక్కడి నుండి ఎమ్మెల్యే వెళ్లిపోయినట్లు సమాచారం. నియోజకవర్గ నేతలు ఎవరు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఆసక్తి చూపడం లేదన్న సమాచారంతో చేసేది ఏమీ లేక అధికారులు ఈ కార్యక్రమాన్ని మరో ప్రాంతానికి మార్పు చేశారన్న చర్చ సాగుతోంది.

**ఆశలు గల్లంతు..**

అధినేత వస్తున్నాడు అంటేనే నియోజకవర్గానికి ఎన్నో వరాల జల్లులు కురుస్తాయని, తద్వారా నియోజకవర్గం అభివృద్ధి బాటలో నడుస్తుందన్న ఉద్దేశంతో ఏ ఎమ్మెల్యే కూడా ఆయన కార్యక్రమాన్ని రద్దు చేసుకున్న దాఖలాలు లేవు. అయితే సింగనమల నియోజకవర్గంలో మాత్రం అందుకు పూర్తి భిన్న పరిస్థితులు నెలకొనడం జిల్లాలో తీవ్ర చర్చ నియాంశంగా మారింది. ఎన్నికల ముందు నుండి టికెట్ల కేటాయింపులు వరకు జరిగిన ఆదిపత్యపోరు నేటికీ కొనసాగుతూనే ఉంది అని చెప్పేందుకు ప్రస్తుత పరిస్థితి అద్దం పడుతోంది. అధినేత కార్యక్రమానికే ఇలాంటి పరిస్థితి ఉంటే ఇక నియోజకవర్గంలో కార్యకర్తల పరిస్థితి ఏంటి అన్నది శతకోటి ప్రశ్న. ముఖ్యమంత్రి పర్యటన రద్దవడంతో నియోజకవర్గంలోని ప్రజలు వరాలజల్లు పై పెట్టుకున్న ఆశలు గల్లంతయాయనే చెప్పవచ్చు.

# తాగునీటితో పాటు సాగునీటికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలి

- తుంగభద్ర నీటి విడుదలపై జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటి విజ్ఞప్తి
- రైతు సమస్యలను ఇరిగేషన్ మంత్రి దృష్టికి తీసుకెళ్లిన దగ్గుపాటి

అనంతపురం ఆగస్ట్ 18, అనంత జనశక్తి న్యూస్



తాగునీటితోపాటు రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సాగుకు కూడా నీరు విడుదల చేయాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి గారు చేశారు. విజయవాడలో జలవనరుల శాఖ మంత్రి కార్యాలయంలో మంగళవారం సాయంత్రం తుంగభద్ర నీటి విడుదలకు సంబంధించి కీలక సమావేశం జరిగింది. జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గారి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారితో పాటు వివిధ నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. సమావేశంలో అనంతపురం నియోజకవర్గ రైతుల ప్రయోజనాలకు సంబంధించి తుంగభద్ర నీటి విడుదల అంశాన్ని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు మంత్రి నిమ్మల రామానాయుడు గారి దృష్టికి తీసుకెళ్లారు. సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన స్థాయిలో నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా అనంతపురం నగర ప్రజల తాగునీటి అవసరాలను కూడా సమావేశంలో ప్రస్తావించారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు తాగునీటి కొరత లేకుండా చూడాలని ఎమ్మెల్యే కోరారు. ఎల్ నినో నేపథ్యంలో జిల్లాలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని దీనిని దృష్టిలో ఉంచుకొని రైతులకు సాగునీరు ఇవ్వాలని కోరారు. సమావేశ అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు మాట్లాడుతూ రైతుల ప్రజల ప్రయోజనాల విషయంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తుంగభద్ర నీటి విడుదలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు తెలిపారు.

# తెలుగు సినిమా పరిశ్రమభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- విజయవాడ ఏ ప్లస్ కన్వెన్షన్ లో వైభవంగా 'వెండితెర - ఓటీటీ అవార్డ్స్ 2025-26'.. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్

విజయవాడ, ఆగస్టు 18 అనంత జనశక్తి న్యూస్



రాష్ట్రంలో కళలను, కళాకారులను ప్రోత్సహించడంతో పాటు చిత్ర పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. విజయవాడలోని ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో 'విబి ఎంటర్‌టైన్‌మెంట్స్' ఆధ్వర్యంలో 'సేవ్ ఆర్టిస్ట్ - సేవ్ టాలెంట్' పేరుతో నిర్వహించిన "వెండితెర మరియు ఓటీటీ అవార్డ్స్ 202526" కార్యక్రమానికి సినిమాటోగ్రఫీ మంత్రి దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పురస్కారాలు అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... విజయవాడ మొదటి నుంచీ సాంస్కృతిక, సినీ వ్యాపార రంగానికి అనుకూల ప్రాంతమని, ఇక్కడి నుంచి ఎందరో గొప్ప నటులు, సాంకేతిక నిపుణులు చిత్రసీమకు వెళ్లి ఉన్నత స్థానాలకు చేరుకున్నారని కొనియాడారు.ఆంధ్రప్రదేశ్‌లో షూటింగ్‌లు జరుపుకునే చిత్రాలకు ఉచితంగా, సింగిల్ విండో విధానం ద్వారా వేగంగా అనుమతులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో అద్భుతమైన లొకేషన్లు ఉన్నాయని, ఇక్కడ డబ్బింగ్ థియేటర్లు, రికార్డింగ్ థియేటర్లు, రీ రికార్డింగ్ థియేటర్ల ఏర్పాటుకు నిర్మాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే టాలీవుడ్ నిర్మాతలను ఈ విషయమై చర్చలు జరిపామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, స్వయాన కళాకారుడైన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో సినీ పరిశ్రమను విస్తరింపజేస్తామని చెప్పారు. మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ముందుకు వచ్చే వారికి భూ కేటాయింపులు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. హైదరాబాద్ తరహాలోనే విజయవాడలోనూ తరచూ సినీ ఈవెంట్లు, అవార్డు వేడుకలు నిర్వహించాలని, ప్రతి ఏటా ఈ అవార్డుల కార్యక్రమాన్ని దిగ్విజయంగా కొనసాగించాలని నిర్వాహకులకు సూచించారు.మంత్రి కందుల దుర్గేష్ పట్టుదల, చొరవ వల్ల ఆంధ్రప్రదేశ్‌లో చిత్ర పరిశ్రమకు మళ్లీ మంచి రోజులు వచ్చాయని వేడుకకు హాజరైన సినీ ప్రముఖులు ప్రశంసించారు. మన సంస్కృతిని పరిరక్షిస్తూ, యువ కళాకారుల కలలకు ప్రాణం పోయడమే ఈ అవార్డుల ప్రధాన ఉద్దేశమని విబి ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో భాగంగా రామకృష్ణ నిర్మాతగా, శరత్ దర్శకత్వంలో విక్రమ్, శ్రీ గాయత్రి నటీనటులుగా పల్లెటూరి ప్రేమ కథగా తెరకెక్కిన "ఉత్తరం"సినిమా సాంగ్ ను లాంచ్ చేశారు..

మ్యూజిక్ డైరెక్టర్ మహిమదన్ మ్యూజిక్ బాగుందని కొనియాడుతూ సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు...ఈ కార్యక్రమంలో ఏపీ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యులు కే.ఎస్. రామారావు, ప్రముఖ హీరో వడ్డే నవీన్, సంగీత దర్శకులు రఘు కుంచె, సినీ నటులు దివ్య వాణి, అనిత, రాజీవ్ కనకాల, సమీర భరద్వాజ్, ఆట సందీప్, జ్యోతి,బింబిసార మూవీ ఫేమ్ బేబీ శ్రీదేవి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ అంబికా కృష్ణా, కార్యక్రమ నిర్వాహకులు విష్ణు బొప్పన, రవికుమార్, అనిత తదితరులు పాల్గొన్నారు

# తుంగభద్ర నీటిపై సమగ్ర సమీక్ష

- రాయలసీమ ప్రాంత ఎమ్మెల్యేలు, సిఈలతో సమావేశం.
- 2027 జూలై వరకు సీమ ప్రజలకు తాగునీటి కొరత రాకుండా చర్యలు.
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.

విజయవాడ ఆగస్టు 18, అనంత జనశక్తి న్యూస్



తుంగభద్ర డ్యాంలో నీటి లభ్యత, రాయలసీమ ప్రాంత తాగునీటి అవసరాలు, ఎల్ఎల్‌సీ, హెచ్ఎల్‌సీ నీటి కేటాయింపులు, వినియోగంపై విజయవాడ క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష నిర్వహించారు. రాయలసీమ ప్రాంత ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, సిఈలు, తుంగభద్ర డ్యాం ఇంజనీర్ల తో జరిగిన ఈ సమీక్షలో ఎల్‌నినో వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రాయలసీమలో తాగునీటి అవసరాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. 2027 జూలై వరకు రాయలసీమ ప్రాంతంలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారని చెప్పారు. తుంగభద్ర డ్యాంలో నీటి లభ్యత, రాష్ట్రాల వాటాలపై చర్చించారు. తుంగభద్ర నీటిలో కర్ణాటక వాటా 65.56 శాతం, ఆంధ్రప్రదేశ్ వాటా 31.36 శాతం, తెలంగాణ వాటా 3.07 శాతంగా ఉందని తెలిపారు. ప్రస్తుత అంచనాల ప్రకారం ఈ ఏడాది తుంగభద్ర డ్యాంకు సుమారు 105 టీఎంసీల నీరు మాత్రమే వచ్చే అవకాశం ఉందని అధికారులు వివరించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ వాటాగా సుమారు 32.9 టీఎంసీలు అందుబాటులో ఉండే అవకాశం ఉందని తెలిపారు.ఆంధ్రప్రదేశ్ వాటాలో హెచ్ఎల్‌సీకి 11.88 టీఎంసీలు, ఎల్ఎల్‌సీకి 16.09 టీఎంసీలు, కే.సీ. కెనాల్‌కు 4.95 టీఎంసీలు కేటాయింపుగా ఉంటాయని అధికారులు వివరించారు. పరిమితంగా లభించే నీటి వనరులను అత్యంత పొదుపుగా వినియోగించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వాటాగా లభించే స్వల్ప నీటి నిల్వలను ప్రధానంగా తాగునీటి చెరువులు నింపడానికి మాత్రమే వినియోగించాలి అని స్పష్టం చేశారు.ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి లభ్యతపై అనిశ్చిత పరిస్థితులు ఉండే అవకాశం ఉన్నందున ప్రతి నీటి చుక్కను సమర్థవంతంగా వినియోగించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. తాగునీటికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ నీటి నిర్వహణ చేపట్టాలని అధికారులకు సూచించారు.చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సమర్థవంతమైన వాటర్ మేనేజ్‌మెంట్‌తో రాయలసీమ ప్రజలకు తాగునీటి భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మాదిరిగా ముందుచూపు లేకుండా నీటిని వినియోగిస్తే రిజర్వాయర్లలో నిల్వలు ఉండవని అన్నారు. కరువు పరిస్థితుల్లో ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించి అప్రమత్తం చేయాల్సిన బాధ్యత ప్రతిపక్షాలపై కూడా ఉందని మంత్రి అన్నారు. అయితే ప్రజలను తప్పుదోవ పట్టించేలా రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం సరికాదని సూచించారు. ఎల్‌నినో నేపథ్యంలో 2027 జూలై వరకు తాగునీటికే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్రం సూచించిన పరిస్థితుల్లో, రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో నీటి నిర్వహణ చేపడుతోందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. రాయలసీమ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందని, అందుబాటులో ఉన్న నీటిని ప్రాధాన్యతా క్రమంలో వినియోగిస్తూ ప్రజలకు తాగు నీటి భద్రత కల్పిస్తామని మంత్రి స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యే లు కాల్వ శ్రీనివాసులు, పరిటాల సునీత, జే సి అస్మిత్ రెడ్డి, బండారు శ్రావణి, బొగ్గుల దస్తగిరి, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, జయ నాగేశ్వర రెడ్డి, ఎమ్మెల్సీ బి టి నాయుడు, ఆలూరు ఇంచార్జి వైకుంఠం జ్యోతి, మంత్రాలయం ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి, ఆధోని టిడిపి ఇంఛార్జ్ మీనాక్షి నాయుడు, ఇరిగేషన్ సలహాదారులు ఎం. వెంకటేశ్వర రావు, ఈఎన్సి లు నరసింహ మూర్తి, వర ప్రసాద్, కర్నూలు సిఈ కబీర్ భాషా, తుంగభద్ర డ్యాం సిఈ నారాయణ నాయక్, కడప సిఈ బాల చంద్ర రెడ్డి, మరియు ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

# షుగర్ వ్యాధిని తగ్గించడానికి మన వంటింట్లో ఉండే మూలికలు, సుగంధ ద్రవ్యాలను ఎలా ఉపయోగించాలి?



మధుమేహం నేడు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందిని వేధిస్తున్న ఒక వ్యాధి. దీనిని అదుపులో ఉంచడానికి సరైన ఆహారం, వ్యాయామం, మందులు ఎంత ముఖ్యమో మనందరికీ తెలుసు. చాలా మందికి తెలియని విషయం ఏంటంటే.. మన వంటింట్లో నిత్యం ఉపయోగించే కొన్ని సుగంధ ద్రవ్యాలు, ప్రకృతి ప్రసాదించిన కొన్ని మూలికలు కూడా మధుమేహాన్ని నియంత్రించడంలో సహాయపడగలవు. ఈ సహజమైన పదార్థాలు రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో, ఇన్సులిన్ పనితీరును మెరుగుపరచడంలో, మధుమేహం వల్ల వచ్చే ఇతర సమస్యలను తగ్గించడంలో చాలా బాగా సహాయపడతాయని కొత్త పరిశోధనలు చెబుతున్నాయి.




## ఇన్సులిన్ బాగా పనిచేయడానికి:

మన శరీరంలో ఇన్సులిన్ అనే హార్మోన్ ఉంటుంది. ఇది మనం తిన్న ఆహారంలోని చక్కెరను కణాల్లోకి పంపిస్తుంది. మధుమేహం ఉన్నవాళ్లలో ఈ ఇన్సులిన్ సరిగ్గా పనిచేయదు. ఇలాంటి వారు ఇంట్లో ఎప్పుడూ ఉండే దాల్చిన చెక్క, పసుపు (కుర్కుమిన్), అల్లం, మెంతి వంటి కొన్ని సుగంధ ద్రవ్యాలను తరచుగా తీసుకోవాలి. ఇవి ఇన్సులిన్ బాగా పనిచేయడానికి సహాయపడతాయి.

## రక్తంలో చక్కెర స్థాయి తగ్గించడానికి:

కొన్ని మూలికలు, సుగంధ ద్రవ్యాలు తిన్న తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా చూస్తాయి. ఖాళీ కడుపుతో ఉన్నప్పుడు కూడా చక్కెర స్థాయిలను తగ్గించగలుగుతాయి. దాల్చిన చెక్క, పసుపు, అల్లం, నల్ల జీలకర్ర, మెంతి వంటివి ఇందుకు బాగా ఉపయోగపడతాయి.



## వాపు, ఒత్తిడి తగ్గించడానికి:

మధుమేహం ఉన్నవాళ్లలో తరచుగా వాపు, ఒత్తిడి ఎక్కువగా ఉంటాయి. పసుపు, అల్లం, దాల్చిన చెక్క వంటి వాటిలో వాపును తగ్గించే గుణాలు ఉంటాయి.

## కొవ్వును తగ్గించడానికి:

మెంతి, దాల్చిన చెక్క వంటి కొన్ని కొవ్వును కూడా తగ్గించగలవని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి.కొవ్వు తగ్గితే డయాబెటీస్ ప్రమాదాలు కూడా తగ్గుతాయి.



## ఏ మూలికలు ఎలా సహాయపడతాయి:

దాల్చిన చెక్క: ఇది ఇన్సులిన్ బాగా పనిచేయడానికి, రక్తంలో చక్కెర, కొవ్వు తగ్గించడానికి సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు.

పసుపు: దీనిలోని కుర్కుమిన్ వాపును తగ్గించే, ఒత్తిడిని తగ్గించే లక్షణాలు కలిగి ఉంటుంది. ఇది రక్తంలో చక్కెరను కూడా తగ్గించగలదు.

అల్లం: రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడానికి అల్లం చాలా బాగా సహాయపడుతుంది. ఇన్సులిన్ పనితీరును కూడా ఇది మెరుగుపరుస్తుంది.

మెంతి: ఇందులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది ఆహారం నెమ్మదిగా జీర్ణం కావడానికి, రక్తంలో చక్కెర వెంటనే పెరగకుండా ఉండటానికి సహాయపడుతుంది. కొవ్వును కూడా తగ్గిస్తుంది.

వెల్లుల్లి: ఇది కూడా రక్తంలో చక్కెరను తగ్గిస్తుందని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి.

నల్ల జీలకర్ర: రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో నల్ల జీలకర్ర చాలా బాగా సహాయపడుతుంది.

కలబంద: కలబంద గుజ్జు సారం రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడానికి ఉపయోగపడుతుంది.

కాకరకాయ: కాకరకాయలో రక్తంలో చక్కెరను నియంత్రించే గుణాలు ఉన్నాయని నిపుణులు నమ్ముతారు.

గుర్తుంచుకోవాల్సిన విషయాలు:

మూలికలు, సుగంధ ద్రవ్యాలను వాడుతున్నాం కదా అని డాక్టర్ ఇచ్చిన మందులు వాడకుండా ఉండకూడదు. అలాగే మీరు ఏది వాడాలనుకుంటున్నా మీ డాక్టర్ సలహా తీసుకోవడం చాలా ముఖ్యం.

ప్రతి మూలికను ఎంత మోతాదులో వాడాలో తెలుసుకోవాలి. ఎంత మంచిదైనా ఎక్కువ మోతాదులో తీసుకుంటే లాభం కన్నా నష్టమే ఎక్కువగా జరిగే ప్రమాదముంది.

# కాఫీ వాసన అంటే మీకు ఇష్టమా? అయితే కాఫీ బీన్స్‌తో రూం ఫ్రెషనర్ తయారు చేసుకోండి!






ఇంట్లో కిటికీలు, తలుపు చాలా కాలంగా మూసి ఉండటం వల్ల కొన్ని సార్లు ఇబ్బందికరమైన వాసనలు రావొచ్చు. లేదా సహజంగానే వెంటిలేషన్ తక్కువగా ఉన్న ఇళ్లలోనూ తాజా గాలి చొరబడక దుర్వాసనలు రావొచ్చు. ముఖ్యంగా ఎయిర్ కండిషనర్ ఉన్న గదుల్లో ఇటువంటి వాసనలు వచ్చే అవకాశం ఎక్కువ. పూర్తిగా ఎయిర్ కండిషన్డ్‌గా ఉండి తాజా వాసనలు లేక అసౌర్యంగా ఉంటుంది. ఇలా ఉన్నప్పుడు రోజంతా ఎయిర్ కండిషనర్ వేసుకోవడం అసాధ్యం. అలాంటి సమయాల్లో మూసి ఉన్న గదిలో వాసనలు పీల్చుకోవడం కంటే బయట కూర్చోవడమే బెటర్ అనిపిస్తుంది. కానీ, వాతావరణంలో ఉష్ణోగ్రతలు గదిలోకి వెళ్లాల్సిందేనని భయపెడుతుంటాయి. అలాంటప్పుడు వాసనల ద్వారా కలిగే సమస్యల నుంచి పరిష్కారాన్ని ఇంటి చిట్కాలతో పొందొచ్చు.

గదిలో వచ్చే దుర్వాసనలను తొలగించడానికి కాఫీని ఉపయోగించవచ్చు. కాఫీ సహజ డీయోడరైజర్ గా పనిచేస్తుంది. దీని సహాయంతో మీ గదులే కాదు. కారు, పర్సు, ఇతర వస్తువుల నుండి వచ్చే దుర్వాసనను కూడా తొలగించవచ్చు. ఇంకెందుకు లేటు.. కాఫీతో ఎయిర్ ఫ్రెషనర్ ఎలా తయారు చేయాలా అని ఆలోచిస్తున్నారా.. రండి తెలుసుకుందాం.

కాఫీతో ఎయిర్ ఫ్రెషనర్ తయారు చేసే విధానం

కాఫీ పౌడర్‌ను చిన్న కుండలో వేయండి. దానితో పాటు దాల్చిన చెక్క ముక్కలు రెండింటిని వేసి వాటితో పాటు నారింజ నూనె కలపండి. ఇప్పుడు ఈ కుండను అలంకార దీపం మీద లేదా ఏదైనా సేఫ్ ప్లేస్‌లో ఉంచి వెలిగించండి. ఉంచండి. కాసేపటికే కాఫీ పౌడర్ వేడెక్కి నూనె విడుదల అవుతుంది. సహజంగానే సువాసన వెదజల్లే కాఫీ పౌడర్.. వేడి చేయడం వల్ల మరింత వేగంగా ఇంటి అంతటా కాఫీ వాసన వ్యాపిస్తుంది.





లవంగాలు, కాఫీతో నెగెటివిటీని తొలగించే ఎయిర్ ఫ్రెషనర్ తయారు చేయడం

కాఫీతో వచ్చే సువాసనతో మీలో ఉన్న నెగెటివ్ ఆలోచనలను కూడా తరిమేయొచ్చు. అదెలా అంటే, ఒక కుండ తీసుకుని అందులో రెండు లేదా మూడు కర్పూరం గోళీలు, నాలుగు లేదా ఐదు లవంగాలు వేయండి. ఇప్పుడు అందులో కాఫీ పౌడర్ వేసి దీపం మీద లేదా కాస్త సెగ తగిలే ప్రదేశంలో ఉంచండి. ఇవి మండుతుండటం వల్ల వేడిని పొంది వాసన ఇంటి అంతటా వ్యాపిస్తుంది. దీనిలో కాస్త దాల్చిన చెక్క పౌడర్ కూడా కలుపుకుని వేడి చేస్తే దోమలు పారిపోవడానికి కూడా సహాయపడుతుంది.

నిమ్మకాయ, కాఫీ వాసనతో కూడిన ఫ్రెషనర్

అదే విధంగా, చిన్న గిన్నెలో కాఫీ పౌడర్, నిమ్మరసం, వెనీలా ఎస్సెన్స్ మూడు నుండి నాలుగు చుక్కలను కలపండి. ఇప్పుడు ఆ గిన్నెను వేడి తగిలే ప్రదేశంలో లేదా ఏదైనా హోమ్ డెకార్ లాంప్ మీద ఉంచండి. దీనికి వేడి తగులుతుండటం వల్ల వాసన గది మొత్తం వ్యాపిస్తుంది. గది సువాసనాభరితంగా మారిపోతుంది.

పాట్ పూరీ తయారు చేయడం

కాఫీ గ్రౌండ్‌ను మళ్ళీ వేడి చేసి చిన్న చిన్న క్లాత్ పాకెట్లలో నింపండి. మార్కెట్లో సులభంగా నెట్ పాకెట్లు దొరుకుతాయి. వీటిని మీరు పర్సు, వార్డ్రోబ్ వంటి ప్రదేశాలలో ఉంచుకోండి.

# 'విశ్వనాథ్ అండ్ సన్స్'ను తెలుగు హీరోలు రిజెక్ట్ చేశారా!.. దర్శకుడు ఏమన్నారంటే!



ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్‌గా నిలిచింది 'విశ్వనాథ్ అండ్ సన్స్'. సూర్య హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా ఫ్యామిలీ ఆడియన్స్‌ను థియేటర్స్‌కు తీసుకురావడంలో సక్సెస్ అయింది. ఈ సినిమా విడుదలైన నాటి నుంచి ఓ వార్త సోషల్ మీడియాలో తెగ షేర్ అవుతోంది. ఈ చిత్ర కథనుదర్శకుడు మొదట రవితేజతో పాటు మరికొందరు తెలుగు హీరోలకు వినిపించారని వాళ్లు రిజెక్ట్ చేశారని ప్రచారం జరుగుతోంది. తాజాగా దీనిపై వెంకీ అట్లూరి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు.

"ఈ సినిమా పూర్తి కథను తెలుగు హీరోలు ఎవరికీ చెప్పలేదు. 2020-2022 మధ్యలో ఇండస్ట్రీ చాలా ఒడుదొడుకులు ఎదుర్కొంది. థియేటర్లు తెరుచుకోలేదు. ఎవరూ కొత్తగా సినిమాలు ప్రారంభించలేదు. గతంలో మొదలు పెట్టిన సినిమాలు మాత్రమే పూర్తి చేసుకున్నారు. ఆ తర్వాత షూటింగ్స్ ప్రారంభించాక నేను ఎవరినైతే సంప్రదించానో వాళ్లందరూ గతంలో అంగీకరించిన కథలను తెరకెక్కించడం మొదలు పెట్టారు. నాకు సమయం ఇవ్వలేకపోయారు. దీంతో నేను ధనుష్, దుల్కర్ సల్మాన్‌లను సంప్రదించా. తర్వాత మా టీమ్ అందరం కలిసి సూర్యకు చెప్పాలని నిర్ణయించుకున్నాం. అలా ఈ కథ సూర్య దగ్గరకు వెళ్లింది. ఆయన ఓకే చేశారు" అని వివరించారు. క్లైమాక్స్ జాగ్రత్తగా తీయాలని సూర్య సలహా ఇచ్చినట్లు వెంకీ అట్లూరి తెలిపారు. హీరో, హీరోయిన్ ఇద్దరి పాత్రలకు ప్రాధాన్యం ఉండాలి క్లైమాక్స్‌లో అని చెప్పారని.. ఈ సినిమా అందరికీ నచ్చుతుందని అనుకున్నానని అన్నారు. అలాగే జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు.

మొదటి రోజు నుంచే కలెక్షన్స్‌లో జోరు చూపిస్తోన్న ఈ మూవీ రెండు రోజుల్లోనే రూ.100 కోట్లను తన ఖాతాలో వేసుకుంది. ఇప్పటి వరకూ రూ.121కోట్లు వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. తమిళంలో అత్యధిక వసూళ్లు సాధించిన మూడో చిత్రంగా నిలిచింది. ఈ వరుసలో ఉన్న కరుప్పు(రూ.198కోట్లు), జన నాయగన్ (రూ.196కోట్లు) రికార్డులను ఇది అధిగమిస్తుందని అభిమానులు భావిస్తున్నారు.

# బుల్లెట్ల మోతే కాదు.. మనసుని దోచే కథతో!



వైవిధ్యమైన పాత్రల్లో భాషలతో సంబంధం లేకుండా నటిస్తూ సినీప్రియుల్ని ఆకట్టుకుంటుంది కథానాయిక జెనీలియా. ఇటీవలే 'రాజా శివాజీ'తో ప్రేక్షకుల్ని పలకరించిన ఆమె మరో చిత్రంతో థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధమవుతోంది. ఆమె.. బాలీవుడ్ హీరో ఇమ్రాన్ హష్మీ జంటగా నటిస్తున్న చిత్రం 'గన్‌మాస్టర్ జీ9'. అపర్శక్తి ఖురానా కీలకపాత్రలో నటిస్తున్నారు. ఆదిత్య దత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని దీపక్ ముకుత్, హునార్ ముకుత్, సంగీత అహిర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని వీడియోతో సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది జెనీలియా. "ఈసారి బుల్లెట్ల మోత మాత్రమే కాదు.. మీ హృదయాన్ని గెలుచుకునేందుకు యాక్షన్, రొమాన్స్, సంగీతంతో రాబోతున్నామ'నే వ్యాఖ్యల్ని జోడించింది. నవంబరు 27న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం బలమైన సంగీత నేపథ్యంతో రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమాని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపింది.

# అనుపమ కామెంట్స్‌తో తెరపైకి ధ్రువ్ విక్రమ్ పేరు.. తాజాగా క్లారిటీ ఇచ్చిన హీరో

నటుడు ధ్రువ్ విక్రమ్ తన వ్యక్తిగత జీవితంపై జరుగుతోన్న ప్రచారం, ఎదురవుతోన్న విమర్శలపై స్పందించారు. నటి అనుపమ పరమేశ్వరన్( వస్తున్న వార్తల గురించి ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు.

**వాళ్లే నాకు కొండంత బలం..**

నటి పేరు ప్రస్తావించనప్పటికీ.. బ్రేకప్ గురించి ధ్రువ్ విక్రమ్ మాట్లాడారు. "నా బ్రేకప్ తర్వాత ఎదురైన కష్టకాలం నన్ను వ్యక్తిగతంగా ఎంతో ప్రభావితం చేసింది. కానీ, నా కుటుంబం, అభిమానులు అందించిన కొండంత ధైర్యం వల్లే నేను దాని నుంచి బయటకు రాగలిగాను. సినీ పరిశ్రమలోకి వచ్చేటప్పుడే నా వ్యక్తిగత జీవితంపై అందరూ దృష్టి పెడతారని తెలుసు. ఆ సమయంలో మా అమ్మ నాకు ఎప్పటికప్పుడు ధైర్యాన్నిచ్చింది" అని తెలిపారు.

**విమర్శలు నన్నేం చేయవు..**

"నిజం చెప్పాలంటే, ఈ ప్రచారం నన్ను అస్సలు ప్రభావితం చేయలేదని నేను చెప్పలేను. కానీ, ఇలాంటి సమయంలో మనల్ని మనం ఎక్కువ అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. మనమేమిటో, దేనికోసం నిలబడ్డామో తెలుసుకోవాలి. మనకు నచ్చిన వారిని, మన ప్రాణంగా భావించే ప్రతి విషయాన్ని కాపాడుకోవాలి. మన ప్రవర్తన నిజాయతీగా ఉన్నప్పుడు, ఈ విమర్శలు మనల్ని ఏం చేయలేవు" అని అన్నారు.

**సోషల్ మీడియాలో అందుకే..**

తాను సోషల్ మీడియాలో తక్కువ సమయం గడుపుతానని ధ్రువ్ తెలిపారు. "నాకు ఎడిటింగ్ చేయడం, వీడియోలు తీయడం అంటే చాలా ఇష్టం. వీడియోలను షూట్ చేసి మ్యూజిక్‌కి తగ్గట్టుగా కట్ చేస్తుంటాను. వాటిని సోషల్ మీడియాలో పంచుకోను కానీ, అది నాకు చాలా ఇష్టమైన పని. సినిమాలు విడుదలయ్యేటప్పుడు ప్రమోషన్స్ ఉన్నప్పుడు మాత్రమే సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటాను. మిగిలిన సమయాల్లో పుస్తకాలు చదవడం, సంగీతం వినడంలో మునిగిపోతాను" అని చెప్పారు.

ఇక అనుపమ పరమేశ్వరన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన రిలేషన్ గురించి చెప్పిన మాటలు వైరలైన విషయం తెలిసిందే. గతంలో రెండేళ్ల పాటు ఒక వ్యక్తితో రిలేషన్‌షిప్‌లో ఉన్నప్పుడు నరకం అనుభవించినట్లు చెప్పారు. మానసిక వేధింపులకు గురయ్యానని, శారీరకంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నానని తెలిపారు. ఆ వ్యక్తి ఎవరనేది మాత్రం ఆమె గోప్యంగా ఉంచినప్పటికీ గతంలో ఆమె సోషల్ మీడియాలో పెట్టిన కొన్ని ఫొటోలతో ధ్రువ్ పేరు బయటకు వచ్చింది. వీరిద్దరూ రిలేషన్‌లో ఉన్నట్లు వార్తలు కూడా ప్రచారమయ్యాయి. వీరిద్దరూ కలిసి 'బైసన్' సినిమాలో నటించిన సమయంలో ఈ రూమర్స్ వచ్చాయి.



# క్రికెట్లో ధోనిలానే.. దివ్య 'మిస్ కూల్': చెస్‌రాణికి 'అర్జున' అవార్డు





చెస్ యువ సంచలనం దివ్యా దేశ్‌ముఖ్‌ను అర్జున అవార్డు వరించింది. గతేడాది దివ్య ఫిడే మహిళల ప్రపంచకప్ విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ఆ ఘనత సాధించిన తొలి భారతీయురాలిగా నిలిచిన ఆమెను క్రీడారంగంలో రెండో అత్యున్నత పురస్కారంతో కేంద్రం ప్రభుత్వం సత్కరించింది.

మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌కు చెందిన దివ్యా దేశ్‌ముఖ్ తల్లిదండ్రులు నమత్ర, జితేంద్ర దేశ్‌ముఖ్.. ఇద్దరూ వైద్యులే. తన బలం అమ్మే అని చెప్పే ఈ 20 ఏళ్ల సంచలనం.. చెస్‌లో అడుగుపెట్టడం అనుకోకుండా జరిగిందనే చెప్పాలి. సోదరి బ్యాడ్మింటన్ ఆడుతుంటే తానూ వెంట వెళ్లి, సరదాగా చెస్ నేర్చుకొని గతేడాది ప్రపంచకప్ పట్టేసి చరిత్ర సృష్టించింది. అదీ అనుభవజ్ఞురాలైన కోనేరు హంపిని సైతం ఓడించి విజేతగా నిలవడం విశేషం.

# రీఎంట్రీలో మళ్లీ ఓటమే.. పాపం విలియమ్స్ సిస్టర్స్

నాలుగేళ్ల తర్వాత ప్రొఫెషనల్ టెన్నిస్‌లోకి అడుగు పెట్టిన అమెరికా స్టార్ సెరెనా విలియమ్స్ams)కు ఏదీ కలిసి రావడం లేదు. ఇటీవల సింగిల్స్‌లో ఓటమిని చవిచూసిన ఆమె.. తాజాగా తన సిస్టర్ వీనస్‌తో కలిసి బరిలోకి దిగిన డబుల్స్‌లోనూ ఓటమి తప్పలేదు. సిన్సినాటి ఓపెన్ డబుల్స్‌లో సెరెనా - వీనస్ జోడీ చివరి వరకూ పోరాడినా 2-6, 6-1, 8-10 తేడాతో మోర్టా కోత్సుయక్-స్టీర్స్ చేతిలో ఓడిపోయింది.

**అప్పుడు అలా..**

గత వింబుల్డన్‌లో సెరెనాకు వైల్డ్ కార్డ్ ఎంట్రీ లభించింది. 44 ఏళ్ల సెరెనాకు ఓటమి తప్పలేదు. ఆస్ట్రేలియాకు చెందిన యువ




ప్లేయర్ మాయా జాయింట్ చేతిలో 3-6, 7-6 (8-6), 3-6 తేడాతో పరాజయం చవిచూసింది. ఇప్పుడు డబుల్స్‌లోనూ సెరెనా ఓటమిపాలైంది. తన సింగిల్స్ కెరీర్‌లో 23 గ్రాండ్‌స్లామ్‌లను నెగ్గిన సెరెనా.. డబుల్స్‌లోనూ 14 టైటిళ్లను సాధించింది. తన అక్కతో కలిసే వీటన్నింటినీ నెగ్గడం గమనార్హం.

# తండ్రికి తగ్గ తనయ.. రాకెట్‌లా దూసుకుపోతున్న పుల్లెల గాయత్రి



భారత బ్యాడ్మింటన్ మహిళల డబుల్స్‌లో రాకెట్ స్పీడ్‌తో దూసుకెళ్తోంది పుల్లెల గాయత్రి . ట్రీసా జాలీ జంటగా అంతర్జాతీయ స్థాయిలో స్థిరంగా రాణిస్తోంది. గాయత్రి నిలకడగా మంచి ప్రదర్శనలు చేస్తుండటంతో కేంద్ర ప్రభుత్వం ఆమెను తాజాగా అర్జున అవార్డుకు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా గాయత్రి కెరీర్ గురించి ఆసక్తికర విషయాలను ఓసారి పరిశీలిస్తే..

గాయత్రి బ్యాడ్మింటన్ దిగ్గజం పుల్లెల గోపీచంద్ ) కుమార్తె అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆమె తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ బ్యాడ్మింటన్‌లో దూసుకుపోతోంది. ట్రీసా జాలీతో కలిసి ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్ 2022లో మహిళల డబుల్స్ సెమీ ఫైనల్‌కు చేరడంతో గాయత్రి బ్యాడ్మింటన్ అభిమానుల దృష్టిని ఆకర్షించింది. అప్పట్నుంచి వరుస విజయాలతో అంచెలంచెలుగా ఎదుగుతూ తండ్రికి తగ్గ తనయ అనిపించుకుంటోంది. తండ్రి బ్యాడ్మింటన్ ప్లేయర్ కావడంతో చిన్నప్పటి నుంచే ఆటపై ఆసక్తిని పెంచుకుంది. గోపీచంద్ అకాడమీలో స్టార్ షట్లర్లు సైనా నెహ్వాల్, పి.వి. సింధులను గమనించి వారితో కలిసి శిక్షణ పొంది తన నైపుణ్యాలను మరింత మెరుగుపర్చుకుంది.

గాయత్రి వివిధ జూనియర్ అంతర్జాతీయ టోర్నమెంట్లలో రాణించి 15 ఏళ్ల వయసులోనే అండర్-17 విభాగంలో దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచింది.

దేశవాళీ ర్యాంకింగ్ టోర్నమెంట్లలో అద్భుత విజయాలు సాధిస్తూ 15 ఏళ్లకే జకార్తా 2018 ఆసియా క్రీడల కోసం భారత బ్యాడ్మింటన్ జట్టులో చోటు దక్కించుకుని సంచలనం సృష్టించింది. ఆసియా క్రీడలలోని అనుభవంతో గాయత్రి 2019లో సీనియర్ స్థాయి పోటీల్లో అడుగుపెట్టి నేపాల్‌లో జరిగిన సౌత్ ఏషియన్ గేమ్స్‌లో మహిళల సింగిల్స్ విభాగంలో రజత పతకం సాధించింది. కొవిడ్ మహమ్మారితో 2020 ఏడాది వృథా కాగా.. 2021 సంవత్సరం గాయత్రి కెరీర్‌కు టర్నింగ్ పాయింట్ అనే చెప్పాలి. అప్పటివరకు ప్రధానంగా సింగిల్స్ క్రీడాకారిణిగా ఉన్న గాయత్రి.. తండ్రి గోపీచంద్, కోచ్ అరుణ్ విష్ణు ప్రోత్సాహంతో డబుల్స్ విభాగంలోనూ ప్రయత్నించాలని నిర్ణయించుకుంది. ఆ సమయంలో గోపీచంద్ అకాడమీలో ట్రీసా జాలీ రూపంలో గాయత్రికి సరైన జోడీ దొరికింది. ఈ జంట 2021లో 'ఇండియా ఇంటర్నేషనల్ ఛాలెంజ్'లో స్వర్ణ పతకాన్ని సాధించగా.. ఆ తర్వాత వెల్ష్ ఇంటర్నేషనల్‌లో రజత పతకాన్ని కైవసం చేసుకుంది. 2022లో గాయత్రి, ట్రీసా జాలీ సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ ఫైనల్‌కు చేరడంతో పాటు ఒడిశా ఓపెన్‌లో తమ తొలి బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ టైటిల్ సొంతం చేసుకున్నారు. ఈ జోడీ వరుసగా రెండుసార్లు (2024, 2025) సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టైటిల్‌ను సాధించింది. భారత బ్యాడ్మింటన్ చరిత్రలో ఎన్నో అద్భుత విజయాలు సాధించి దిగ్గజ ఆటగాడిగా గుర్తింపు పొందారు. ఆయనను అర్జున అవార్డు (1999), ఖేల్ రత్న అవార్డు (2001), పద్మ శ్రీ (2005), పద్మభూషణ్ (2014) పురస్కారాలు వరించిన విషయం తెలిసిందే. గోపీచంద్ తన కుమార్తె ఏ రంగం వైపు వెళ్లాలనే విషయంలో పూర్తిస్వేచ్ఛను ఇచ్చానని ఓ సందర్భంలో అన్నారు. 'బ్యాడ్మింటన్ ఆడాలనేది ఆమె నిర్ణయమే. ఒకవేళ ఆడటం ఇష్టం లేకపోతే ఫర్వాలేదని నేను ఎప్పుడూ చెబుతూనే వచ్చాను. కానీ నాకంటే ఆమెకే దీనిపై ఎక్కువ ఆసక్తి ఉంది. దీనికి నేను చాలా సంతోషిస్తున్నాను" అని గోపీచంద్ తెలిపారు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314